UNIVERSAL
LIBRARY
OU_206127
UNIVERSAL
LIBRARY

Osmania University Library

Call No. 372 S69P

Accession No. GT 98

Author సాంఖ్యన్న పంతులుగారు, కంఠమోర్.

Title ప్రరణావాచకము.

This book should be returned on or before the date last marked below.

పురాణవాచకము

ఎనిమిదవ తరగతి.

గ్రంథకర్తలు:

విద్వాన్, గరిమెళ్ళ సోమన్న పంతులుగారు, ఎమ్.ఎ., ఎల్.టి.,

భోగరాజు నారాయణమూర్తి పంతులుగారు.

పబ్లిషర్సు:

వేంకటరామ్ అండ్ కో.,

హెడ్డాఫీసు:—ఏలూరు.

రామా పవర్ ప్రెస్సు, ఏలూరు.

1930

రిజిష్టర్డు]

[వెల 0-8-0.

విషయసూచిక.

(కవిజీవిత సంగ్రహములు.)

1.	భాస్కరరామాయణము - సుగ్రీవమైత్రి.	1
2.	భారతము - పద్మవ్యూహము.	9
3.	దశకుమార చరిత్రము - రాజవాహన జననము. ...	22
4.	నృసింహ పురాణము - జయవిజయశాపము.	35
5.	ఉత్తర హరివంశము - మృత విప్రకుమారరక్షణము. ...	43
6.	పద్మపురాణము - సుందోపసుందోపాఖ్యానము. ...	53
7.	విష్ణుపురాణము - కంస వధ.	58
8.	శృంగార నైషధము - రాయంచ రాయబారము. ...	72
9.	కాశీఖండము - గుణనిధి వృత్తాంతము 1-వ భాగము. ...	81
	డిట్టో 2-వ భాగము. ...	89
10.	భాగవతము - అశ్వత్థామావమానము.	94
11.	హరిశ్చంద్రోపాఖ్యానము.	102
12.	శ్రీకాళహస్తి మాహాత్మ్యము - నత్కీరుని కథ 1-వ భాగము.	111
13.	డిట్టో 2-వ భాగము. ...	122
14.	ఉద్భటారాధ్య చరిత్రము - చిత్రరథ శాపము. ...	130
15.	వాల్మీకి చరిత్రము - వాల్మీకి కథ.	139
16.	ఉత్తర రామాయణము - కుశలవ చరిత్రము 1-వ భాగము.	153
	డిట్టో 2-వ భాగము. ...	160

పురాణవాచకము

ఎనిమిదవతరగతి

భాస్కర రామాయణము.

1 సుగ్రీవ మైత్రి

[భాస్కరుఁడు రామాయణమును వ్రాసెను. దానికి "భాస్కర రామాయణ' మనిపేరు. భాస్కరుఁడు భారతమును వ్రాసిన తిక్కనకుఁ బితామహుఁ డగుటచేత 13 వ శతాబ్ద ప్రారంభమున నుండియుండును. తిక్కనతాతయగు భాస్కరుఁడు వేఱనియు రామాయణకర్తయగు భాస్కరుఁడు వేఱనియు నొక ప్రబలమైన వివాదము జరుగుచుండుటచేతఁ బ్రస్తుతము భాస్కరునికాలము నిర్ణయించుట సాధ్యముగాదు.]

వ॥ రామలక్ష్మణులు సీతాన్వేషణంబుఁ గావించుచు వనంబులెల్లఁ గ్రుమ్మరి క్రమక్రమంబుగ ఋశ్యమూకారణ్యంబునఁ బ్రవేశించిరి. అయ్యరణ్యంబును నచ్చటి ఋశ్యమూకనగంబును సుగ్రీవుఁ డను వానరేంద్రునిసంచారప్రదేశంబులు. సుగ్రీవుఁడు తనయన్నయగు వాలితో విరోధించి వానిచేఁ బరాజితుండై తనసేనలతో వచ్చి యప్పర్వతప్రదేశంబుల డాగియున్నవాఁ డగుటం జేసి, వల్కలాజిన

ధరులును గోదండబాణకృపాణపాణులు నగురామలక్ష్మణులను జూచి వాలిపంపునం దన్నుం గడతేర్పవచ్చిన కపటంపు ఋషివేషధారులుగా భావించి యావిశేషంబును దనమంత్రుల కెఱింగించెను. తోడనే దుర్నిరీక్ష్యతేజస్సంపన్నులగు నయ్యన్నదమ్ములం జూచి యత్యంతభయభ్రాంతులై,

క॥ గిరిగిరిశిఖరంబులకును
దరుతరుశాఖలకు దావదావంబులకున్
బోరిఁబోరిదాఁటులు వైచుచుఁ
ద్వరితగతిం బాఱి రన్యవననగములకున్.

వ॥ ఇట్లు కలంగి తొలంగిన సుగ్రీవసచివులు హనుమంతుం బురస్కరించుకొని యొక్కెడఁ దొలంగియున్న సుగ్రీవునిపాలి కేతెంచి ప్రాంజలులై యుండ నప్పుడు హనుమంతుఁ డినతనయు నుపలక్షించి, 'నీ వెవ్వరిం జూచి వాలి పంపినవా రను భయంబునఁ దొలఁగ నేతెంచియున్నవాఁడవు? వారు వాలి పనుప వచ్చినవారలు గారు. పూర్ణవివేకము లేక బేలవై యేల మనంబునం బెగడె' దనుటయు సుగ్రీవుం డిట్లనియె.

ఉ॥ వారలు వాలిపంపునన వచ్చినవా రను శంక నామదిన్
వారక నాటియున్నయది, వాలియు నాయెడఁ గ్రించు; రాజులే

పార ననేకమార్గముల నప్రియులం దెగఁజూతు రేర్పడన్
వారి నెఱుంగఁగావలయు; వచ్చు నెవన్మఁగ నెందురాజులన్?

వ॥ మఱియుఁ బ్రచ్ఛన్నవేషధారులగు వారలం జారులవలన నెఱుంగవలయు.

చ॥ అనిలతనూజ! నీవు ప్రియమారఁగ వారలఁ జేరి వార లీ
వనమున కేమికారణము వచ్చిరొ, యేటికి నస్త్రశస్త్రముల్
తనరఁగఁ బూనినారొ, రణదర్పమునం జనుదెంచినారొ నే
ర్పునఁబరికింపు రూపములఁ బోలఁగ మాటలసత్వదృష్టులన్.

క॥ వారలు సన్మనులైనన్
గోరిక విశ్వాస పఱిచి కూడి ప్రశంసల్
సారెకుఁ జేయుచు సామం
బారఁగఁ గావింపు మనకు నభిమతమొందన్.

వ॥ రవినందనునభిమతం బీడేర్పఁ దోడనె వాయునందనుండు భిక్షుకరూపంబుఁ దాల్చి రాఘవులసమీపించి సందర్శించి భక్తిపూర్వకంబుగ దండనమస్కారంబులు గావించి ప్రియోక్తుల నగ్గించుచు నిట్లనియె. "అయ్యా! మీరు నర మునివేషములొందిన నరనారాయణులో భూమిం జరింప వచ్చిన సూర్యచంద్రులో యన మెఱయుచుఁ బరస్పర సమాన రూపయౌవనగుణలక్షణవిక్రమశ్రమవిశేషంబులఁ బరగుచున్నారు. మఱియు

మ॥ పరిఘాత్యాయతబాహులశ్విని సరూపప్రాప్తులుగ్రప్రభా
భరితుల్ పార్థివలక్షణాకలితులై భాసిల్లుచున్నారు; మీ
రరయన్ వార్థిపరీతభూభువనరాజ్యంబొంద నర్హుల్ జటా
భరకృష్ణాజినవల్కలంబులు ధరింపం గారణం బేమొకో?

శా॥ సుగ్రీవుండను వానరేంద్రుఁడు రణక్షోణీస్థలిం దన్ను న
త్యుగ్రప్రక్రియ వాలి దోలినఁ గడున్ దూరస్థుఁడై ఋశ్యమూ
కగ్రావంబుననుండి మీకడకు సఖ్యం బొప్పఁగావింప బు
ద్ధిగ్రాహిత్వముతోడఁ జెల్మికిని బుత్తేరంగ నే వచ్చితిన్.

క॥ తపనతనూజుని సచివుఁడఁ
గపిమూర్తిని గామరూపిఁ గామగముఁడ గా
డ్పుతనయుఁడ హనుమంతుఁడఁ
గపటప్రభిక్షుకుఁడ దూతకార్యంబునకున్.

వ॥ మీపాలికి నే నేతెంచితి. మీ రేరాజసుతులరో? యేమహా
నుభావులరో? యీపంపాతీర దుర్గమారణ్యంబున కరుదెం
చిన కారణం బేమియో" యని హనుమంతుండు పలికిన రామ
చంద్రుఁడు మందస్మితవదనారవిందుండై సుమిత్రానందను
తోడ మనవచ్చిన వృత్తాంతం బెఱింగింపు మనిన సౌమిత్రి
యావాయుపుత్త్రుం గనుంగొని, "హనుమంతా! దశరథుఁ
డను మహారాజున కీ మహామహుఁ డగ్రపుత్త్రుఁడు; నా
కగ్రజుఁడు. ఈ సుగుణాభిరాముండు రాముండనఁ బరఁగు
చుండు. సర్వభూతహితుండును జనతాశరణ్యుండును నగు

రామచంద్రుఁడు జనకునిసత్యంబు నెఱప సమస్తరాజ్యం బును బరిత్యజించి పత్నియుం దాను వనంబుల కేతేర, మేము లేనప్పు డొక్కరక్కసుండు కపటియై యీతని దేవియైన సీత నపహరించికొనిపోయె. మేము వానిం గానక యెల్లకడల వెదకుచుఁ దిరుగుచుండ నొక్కయెడ ముని శాపంబున దనుజుండై పుట్టిన దను వను గంధర్వుఁడు 'మీరు సుగ్రీవుని స్నేహంబున సీతజాడ లెఱుంగఁగల' రని చెప్పి దివి కేగె. మేమును సీతాసతి శుభవార్త వినుకుతూ హలంబున సుహృద్భావంబున భానునందనుమైత్రి సంపా దింప నీ పంపాతీరంబున కేతెంచినవార" మని పలికి మఱియు నిట్లనియె.

"సీ॥ ప్రజలు ప్రసాదంబుఁ బడయఁ గోరెడుభర్త
తరుచ రేంద్రునిప్రసాదంబునొంద,
సకలలోకులకును శరణమౌ డగురాజు
కిర మర్థి సుగ్రీవుశరణుసొరఁగ,
నరనాథుఁ డగులోకనాథుండు ప్లవగనా
థుం డిచ్చఁ దనకు నాథుండుగాఁగ
నఖిలలోకసహాయుఁ డై యుండు పుణ్యుండు
కపివర్యసాహాయ్యకంబు వేఁడ
గీ॥ రాజులెల్లను సేవించు రాజగురుఁడు
వానరేంద్రుని సేవింప వచ్చినాఁడు

రామచంద్రున కిట్టి దుర్దశలు వచ్చెఁ
జారుచారిత్రయగు సీత కారణమున.

గీ॥ ధైర్యనిధియయ్యుఁ దనపత్నిఁ దలఁచి తలఁచి
రామచంద్రుండు శోకవారాశిచంద్రుఁ
డగుచు నధికదైన్యంబుతో నాననంబు
విన్ననైయుండ నిచ్చట నున్నవాఁడు."

వ॥ అనుచు బాష్పాకులలోచనుం డగుచున్న లక్ష్మణుం గనుం గొని హనుమంతుం డూరార్చుచు నతని కిట్లనియె.

శా॥ ఆలం బుద్ధతిఁ జేసి చేవచెడి ధైర్యం బేది యవ్వాలిచే
నాలిం గోల్పడి వీడు వోవిడిచి రాజ్యభ్రష్టుఁడై సంచిత
శ్రీలెల్లం జెడి కానలో మఱుఁగుచుం జేట్పాటుతో నుండుటం
జాలంబోలఁగ మీకు నర్కజునకుం సఖ్యంబు వేకల్గెడుం.

క॥ మీరును సుగ్రీవుండును
గారవమునఁ బొత్తుసేసి కపిసేనలతో
నారవిజుఁడు దోడ్పడఁగ ను
దారత సాధింపఁగలరు ధారుణియెల్లన్.

వ॥ అమ్మాటలకు లక్ష్మణుండు ప్రియంబంద, రఘువరుండును హర్షించి, యంజనీసుతుని సంభావించి, "కపివరా! మేము సూర్యకులజాతులము. సుగ్రీవుండును సూర్యనంద నుఁడు. మా కవశ్యంబుగ సఖ్యంబు గాఁదగిన" దని పలి కెను. హనుమంతుండును ముదంబంది రాఘవులు కృత

కార్యసిద్ధులై రనుచు నా రామలక్ష్మణుల సముచితసంభాషణంబులం దేల్చి వారలం దోడ్కొని ఋశ్యమూకంబు గడచి మలయాద్రి కరిగి యచ్చట రాఘవుల నునిచి సుగ్రీవుని సన్నిధి కేగి "సుగ్రీవా! నీతోడి సఖ్యంబునకు రామలక్ష్మణులం దోడ్కొని వచ్చితి. కృతార్థుండవైతివి. ఆ రామచంద్రుండు ధర్మజ్ఞుండును గృతజ్ఞుండును సత్యసంధుండును బితృవాక్యపరిపాలకుండు నధికబలపరాక్రముండు నాశ్రితవత్సలుండును గావున నీమనోరథంబు సఫలంబుసేయ సమర్థుండు. జనకాజ్ఞ నడవి కేతెంచి తనపత్ని రాక్షసాపహృతయైననిమిత్తంబున నిన్నుం గాన నేతెంచె. నీవు నమ్మహానుభావుని నభివందనపూర్వకంబుగ సంభావింప నర్హుండ" వనిన హనుమంతువాక్యంబులకు సంతోషించి, సుగ్రీవుండు వాలివలనిభీతి వాడినపుష్పదామంబునుం బోలె విడిచి,హనుమంతునితోఁగూడ నధికసమ్మోదంబున నేతెంచి, రామభద్రుని పాదపద్మంబులకు బ్రొక్కి యల్లన నిట్లనియె. "రామచంద్రా! నీధర్మజయసత్యపరాక్రమశక్తులెల్ల ననిలనందనుండు నాకుఁ దెల్లంబుగ నెఱింగించె. నీశుభదర్శనంబు నాకు రాజ్యప్రాప్తికిఁ గారణంబగుఁగాక. అధికోత్సాహంబున నీనెయ్యం బభిలషించువాఁడను గావున నన్ను విశ్వసించి చేయి సాపు" మనుటయు, రాఘవుం 'డగుఁగాక'యనిచేయిసాచెను. అప్పుడు రామసుగ్రీవులు

గాఢస్నేహసూచకంబుగ నాలింగనములు చేసిరి. వాయు కుమారుండును గాష్ఠయుగంబుఁ దెచ్చి మథించి యగ్ని నుద్భవింపంజేసి యర్చులిడి ప్రవృద్ధమొనర్చి వారియెదుటం దెచ్చిపెట్టిన నన్నరేశ్వరవానరేశ్వరు లిరువురును బ్రదక్షిణముచేసి యగ్నిసాక్షిగ సఖ్యంబు గావించుకొనిరి. ఇట్లు బద్ధసఖ్యు లైనంత నర్కజుం డధికానందంబున నర్కవంశజుం గాంచి.

"క॥ కాకుత్స్థ! యింక నగవకు
నీకడకున్ వేగ దెత్తు నీసతి దివిష
ల్లోకమున నున్నఁ బన్నగ
లోకంబున నున్న నబ్ధిలోపల నున్నన్.

మ॥ బలిమిన్ నాప్రియపత్ని దోచుకొని కోపక్రూరతన్ వీటిలో
పల నన్నున్ వసియింపనీక వెలికిం బాఱంగ వే తోలినన్
బలవంతుండగు వాలికోర్వక భయభ్రాంతుండనై చింతలో
నెలయున్ వందురుచున్న వాఁడవగతో నీఋష్యమూకస్థలిన్.

వ॥ కావున నోదేవా! నే ననాథుండను. అనాథనాథుండవగు నీవు నన్నుం గాపాడి నామానమును బ్రోవవలయు" నని దీనముగఁ బ్రార్థింప భక్తవత్సలుండగు రామభద్రుండు వానిం గరుణించి యాదరించి కౌఁగిలించి, యిట్లు వచించె. "వానరేశ్వరా! నీ వింకఁ జింతింపం బని లేదు. నీ వాంఛి

తంబులెల్ల నేనెఱుంగుదు. నీకు రాజ్యలక్ష్మియు నర్థాంగలక్ష్మియు సిద్ధించుఁగాక!

చ॥ కనదురురత్నపుంఖములు కాలభుజంగమహోగ్రిముల్ మహా
శనిసదృశప్రభావములు షణ్ముఖకాననసంభవంబులున్
ఘనతరకంకపత్త్రములు గల్గిన యీశితసాయకంబులన్
దునిమెద వాలిలీలఁ ద్వరతో నిలశైలముఁబోలెఁ గూలఁగన్.

భారతము.

2 పద్మవ్యూహము

[తిక్కన నెల్లూరు వాస్తవ్యుఁడు. మనుమసిద్ధిరాజునకు మంత్రి. నియోగి బ్రాహ్మణుఁడు. వీని కాలము 13 వ శతాబ్దము. తిక్కన మొదట నిర్వచనోత్తరరామాయణమును వ్రాసి పిదప యజ్ఞముచేసి సోమయాజియై విరాటపర్వము మొదలు 15 పర్వములుగల మహాభారతమును దెనిఁగించెను. వీనికిఁ గవిబ్రహ్మ యను బిరుదు గలదు.]

వ॥ మహాభారతయుద్ధంబున సుప్రసిద్ధం బగుపద్మవ్యూహమున కర్జునకుమారుండైన యభిమన్యుఁడు కథానాయకుఁడు. తనతండ్రుడు లేపుడును దమకు న్యాయముగ రావలసిన దాయభాగమును గూర్చి ప్రయత్నించుటయు శ్రీకృష్ణుని రాయబారిగ నంపుటయు దుర్యోధనుఁడు పాండునకిచ్చు

గింపక తృణీకరించుటయు మున్నగు విశేషంబులెల్లఁ బ్రద్యుమ్నాది యదుకుమారులతో ధనుర్విద్యాభ్యసనం బొనర్చుచుండిన యభిమన్యుం డెప్పటి కప్పుడె యెఱుంగుచుఁ, గౌరవులతోడి పోరాటంబగుట నిశ్చయించుకొని యత్యంతరణోత్సాహంబును బొందుచుండెను. క్రమక్రమంబుగ సంధియుద్యమంబెల్ల విఫలంబగుటయు సంగ్రామంబె నిశ్చితం బగుటయుఁ గురుక్షేత్రంబునఁ బుణ్యదినంబగు నమవసనాటియుదయంబున మహాభారతయుద్ధము ప్రారంభింపఁబడినది. కురుసేనలకెల్ల గాంగేయుఁడు నాయకుండై పది దినంబులు తన సంగరక్రియాకౌశలమును బ్రకటించి శరతల్పగతుండయ్యె. అంతఁ దత్సేనానాయకత్వము ద్రోణునకొసంగఁబడియె. ఆ పదిదినంబులలో భీష్మునిపరాక్రమానలంబునం బడి పాండవయోధులు నిలువలేక తత్తరపడుచుండ నభిమన్యుఁ డయ్యోధాగ్రేసరు నెదిరించి పెక్కుసారులు తనసైన్యంబుల రక్షించె.

సకలకురుకుమారక ధనురాచార్యుండగు ద్రోణాచార్యుండు సేనానియై రెండునాళ్ళు పోరాడి మూఁడవనాఁడు పద్మవ్యూహమును బన్నెను. వ్యూహములందెల్ల సుప్రసిద్ధమగు నీపద్మవ్యూహాకారము పలువిధములఁ జిత్రింపఁబడుచు నేఁటికిని మిక్కిలిప్రచారమున నున్నది. ఆనాఁడా వ్యూహమునకు గురుండు సకలదేశాధీశ్వరులను దళంబు

లుగను రాజకుమారులఁ గేసరంబులుగను, కర్ణదుశ్శాసన బహుళసేనాపరివృతుండైన రారాజును గర్ణికగను నిర్ణయించి యభేద్యంబుగ నొనర్చెను. మఱియు నవ్యూహాగ్రంబునకుఁ దాను మొగమ్మునను నిలిచి ద్రోణుఁడు జయద్రథాశ్వత్థామకృపశకునికృతవర్మశల్యప్రముఖులను గురుకుమారకులను దక్షిణచోటుల నుండ నియోగించెను. అప్పుడు పాండవవీరులనేకులు వ్యూహాగ్రంబున నున్న కుంభసంభవుం దలపడిరి. సాత్యకిధృష్టద్యుమ్నఘటోత్కచవిరాటద్రుపదభీమనకులసహదేవాది మహావీరులెల్లరు నవ్యూహాన భేదింపఁ బ్రయత్నపడి భేదింపనేరక ఖిన్నవదనులైరి. ధర్మజుండును మొగము వెలవెలఁబారఁ నేమిచేయుటకుం దోపక కర్ణికారకేతనవిరాజితుండును విపులవిక్రమసంపత్పరిపూర్ణుండును నగు సౌభద్రుం జూచి, వీఁడుదక్క నన్యు లివ్యూహాగ్రంబు భేదింపఁజాల రని నిశ్చయించుకొని వానిం జెంతకు ర మ్మని యిట్లనియె.

సీ॥ ఈవ్యూహ భేదింప నే మెవ్వరము నేర
మర్జునుండును నీవు నచ్యుతుండుఁ
బ్రద్యుమ్నుఁడునుదక్కఁ; బార్థుండు మనల ను
ల్లసమాడకుండ నీలావుమెఱసి
భేదించి మాకెల్లఁ బ్రియమొనర్పు కుమార !"
యనవుడు నతఁ డానన్దాబ్జములర

"దీనిముఖంబు భేదించు తెఱంగు నా
కెఱుఁగించె మాతండ్రి యేను దెలుపి
ఆ॥ వె॥ సేయనేర్తుఁ జొచ్చి చించిచెండాడెద
మూఁక పోరఁ జుట్టుముట్టినపుడు
వెడలునట్టి వెరవు విన; దాని కేమి, నా
చొచ్చునేర్పు బలువుఁ జూడు మధిప!"

అనిన విని ధర్మనందనుండు ధనంజయనందనుం జూచి "కుమారా! నీ వించుక త్రోవచేసి లోనఁ జొచ్చినం జాలును. నీపిఱుందన మేమెల్లరముం జొచ్చెదము. మా కీవరం బొసంగు" మనుటయు, భీముండును 'కుమారా! నేనును సాత్యకియు ద్రుపదవిరాటాదులును నీకుం దోడుగ వచ్చువారము. నీ విమ్మొగ్గరంబు భేదించి మార్గంబు సూపినం జాలు' ననిన నభిమన్యుం డాతనియాననం బాలోకించి,

చ॥ సను విను కీచకాంతక! మ
నంబున ద్రోణుఁడు మెచ్చఁజొచ్చి, య
మ్మొనఁ గలఁగింప కిల్లు కురు
ముఖ్యుఁడు ధర్మసుతుండు గారవిం
చిన జతనంబు నిష్ఫలము
సేయుదునే? నరుఁడుఁ సుభద్రయుఁ
దనయునిఁ గాంచి సంతసముఁ
దాల్చుట యంతయు రిత్తఁబుత్తునే?

చ॥ ఇదె యొకపిన్నవాఁ డడరి
యెక్కుడు మూఁకలఁగ్రిందు దోలెడున్
గదుపుల వెల్చు గోపకుని
కైవడి నంచు జనుల్ నుతింపఁ జే
సెద, విని మామ ప్రీతి విల
సిల్లఁగఁ దండ్రియు సంతసిల్ల బె
ట్టిదుఁడగు కౌరవేంద్రునకు
దెప్పరమయ్యెడు భంగిఁ బేర్చెదన్.

వ॥ అనిన విని ధర్మజుండు ప్రీతింబొంది నీదుధైర్యంబును శౌర్యంబును బలమును గీర్తియు వర్ధనమొందెడు మని దీవించి యంపిన సుభద్రకొడుకు సముదగ్రసమరోత్సాహంబునఁ దన సారథిం గనుంగొని 'మనయరదంబు ద్రోణానీకంబుపైఁ బఱపు' మనుటయు నాసుమిత్రుం డర్జునపుత్త్రున కిట్లనియె.

గీ॥ బాలుఁడవు నీవు కుంభజప్రముఖసైన్య
పతులు ప్రౌఢులు పెక్కుఱు బవరమునకుఁ
జొచ్చి యెఱుఁగని నీచేతఁ జచ్చువారు
కారు, బహువిధసమరకర్కశులు వారు.

చ॥ అనవుడు నల్ల నవ్వి యతఁ
డాతని కిట్లను దేవయుక్తుఁడై

యనికి బలారి వచ్చినఁ బు
రారి గణంబులుఁ దానుఁ బన్నినన్
గినిసి కడంగి క్రీడియును
గృష్ణుఁడుఁ దాఁకిన నే జయింతు వా
రొక్కని యనుచుండుదుర్, సర
కుఁగొందు నె ద్రోణునిఁ దోడియోధులన్.

వ॥ అని పలికి వానియాలాపంబు నాలంబుసేసి యభిమ న్యుండు పెలుచం దఱిమిన వాఁ డనుమానించుచుఁ బద్మ వ్యూహంబు సమ్ముఖంబుగాఁ దేరునడపుటయుఁ బాండవ సేనయుఁ దోడన కడంగుటయుఁ గనుంగొని భారద్వాజ ప్రముఖయోధు లొండొరులకుం దలమిగిలి యేచి యెదు రొక్కని పెలుచనిలిచిన సంకులసమరంబయ్యె, నట్టియెడ

ఆ॥ వె॥ మెఱుఁగు మెఱచినట్లు మెఱయంగ నరదంబు
కర్ణికార కేతుకాంతి వెలుఁగ
నంపగముల గురుని నలయించి కడచి యిం
ద్రిజునికొడుకు మొగ్గరంబు సొచ్చె.

వ॥ ఇట్లు దేవాసురలకైన నభేద్యంబగు నాపద్మవ్యూహం బును భేదించి ప్రవేశించి మహాసముద్రమధ్యంబునఁ దిరుగు మందరగిరితెఱంగున, శుష్కకాననమున సంచరించు ఘోరానలముభంగి, దక్షయాగమునందలి వీరభద్రుని విధంబున వీరవిహార మొనర్చుచు, నమ్మోహారంబు రూపు

మాపి, క్రూరనారాచముల గజకుంభములఁ జీల్చుచు, హయంబుల నడఁగించుచుఁ, బతాకమ్ములఁ బడసేయుచు, నాతపత్రములఁ ద్రుళ్ళించుచు, ధనువులఁ దునియలొ నర్చుచుఁ, గరవాలంబుల ఖండించుచు, మేనులఁ జెండా డుచుఁ, దూపులఁ దూలించుచుఁ, గరచరణాద్యవయవం బుల వేఱుసేయుచు నెత్తురు పాఱించుచు నమ్మొగ్గరమ్మును మిక్కిలి చిక్కువెట్టి కలఁగించి తొలంగించి దీనదశకుం దెచ్చె. పద్మాకరమును గలంచు భద్రగజముభంగిఁ బద్మ వ్యూహమును గలంచు సౌభద్రు నీక్షించి కౌరవేంద్రుం డు గ్రాకారుఁడై యాఁకలిగొన్న సింగంబుం దాఁకు మాతంగము తెఱంగున నెదుర్కొని మార్కొనియె.

అట్లభిమన్యుం దాకినరారాజుం జూచి భారద్వా జుండు చేయిచాచి యెలుంగెత్తి "వీరులారా! రండు రండు! రారాజునకుఁ దోడ్పడుఁడు. అభిమన్యుఁ డుద్దండుఁడు. మీమీ ధైర్యసాహసంబుల వినియోగింపుఁ" డని హెచ్చ రించెను. ఆయెలుంగు విని నంతనె కృపుఁడును గురుకు మారుఁడును గృతవర్మయుఁ గర్ణుండును సోమదత్తపుత్రుం డును శల్యుఁడును సౌబలుఁడును మున్నగు మహావీరులెల్లరు గురునివెంట బిరబిర నేగి కురుపతికిఁ దోడుగఁ గవ్వడి కొడుకు నెదురుకొనిరి. అమ్మహావిజృంభణమునకు ధనం జయనందనుండు లేశమ్మును భీతిల్లక మందహాసమొ

నర్చుచు లాఘవలక్ష్యశుద్ధిచిత్రత్వదృఢత్వంబులఁ గృష్ణార్జునులుచూపునేర్పు సూపుచు దుర్నిరీక్ష్యుండగు చండభానుకరణిఁ జూపరులకు రౌద్రమూర్తియై తోఁచుచు భీషణంబగు గుణఘోషంబుతోఁ బెడిదంపు నారసంబులు ప్రయోగించి, లోకభయంకరంబుగ గర్జించుచుఁ బలుపిడుగులరాల్చు ప్రళయకాలవలాహకంబు కరణి విజృంభించి, యేమిసేయుటకుం దోఁపక కరచరణంబులాడక చేష్టలుదక్కి యాచార్యుం డూరకచూచుచుండునట్లు తత్సేనావితానముల నానావిధబాణపరంపరల ముంచి పఱువెత్తించెను.

అచట వ్యూహద్వారముకడఁ బాంచాలయాదవపాండ్యకేకయమాత్స్య సైన్యములతో ధర్మభీమనకులసహదేవాదు లెంత విజృంభించినను లోనం జొరనేరరయ్యె. నాఁ డావ్యూహాగ్రంబుకడ సైంధవుఁ డమ్మహావీరుల నెల్లర నడ్డగించెను. సామాన్యరథికుం డయ్యు సైంధవుం డంతటి మహాయోధుల నడ్డగించి నిలువరింపఁగలుఁగుట కొక ప్రబలకారణంబు గలదు. పాండవు లరణ్యముననున్నప్పుడు సైంధవుఁడు ద్రౌపదిని మోహించి వా రింటలేనియెడ నామెను బలిమినిఁ దనయరదంబున నిడికొని పోవుచు విధివశంబున వారికిం బట్టువడి యందు భీమునిచే సంపూర్ణంబుగఁ బరాభవింపఁబడియె. ఆపరాభవ దుఃఖంబున

సైంధవుండు తపంబొనర్చి శివుని మెప్పించి పాండవుల జయిం
పఁగలుగునట్లు వరంబు వేఁడ నర్జును నొక్కనిం దక్క తక్కిన
నలువుర నీ వొక్కనాఁడుమాత్రము జయింతు వని యీశ్వ
రుం డనుగ్రహించె. ఆవరప్రభావంబున నతఁడు భీమసేన
ప్రముఖుల నెల్ల నాఁడు నిరాయాసంబుగ నోడించెను.

ఇటు వ్యూహమధ్యంబున లోకైకవీరుం డగు నభిమన్యు
ప్రతాపానలంబున ప్రమ్మి పఱుఁగిడఁదొడంగిన యోధ
వరుల నెల్ల ద్రోణుండు మహాప్రయత్నంబున నాపి పురి
కొల్పి యయ్యందఱితోఁగూడ నా బాలకు నెదుర్కొనియె.
విఱిగిన యోధు లెల్లరుఁ దనపైఁ దిరుగఁబడినంతనే నేయి
వోసిన యగ్నిజ్వాలవలె భగ్గనమండుచు సుభద్రకొడుకు
నెత్తుటివరదలు ప్రవహింపఁజేసె. హతశేషులైన కౌరవ
వీరులెల్లరు విచ్ఛిన్నరథోపరిభాగులై విదళితచ్ఛత్రులై
తీవ్రాతపంబున మలమలమాడుచు మేనులు చెమటలెక్క
మొగంబులు వెలవెలంబార నాలుకలఁ దడియారఁ గాళ్లు
గడగడవడంక నలుదిక్కులం జూచుచు ధైర్యంబువిడనాడి
యేక్షణం బభిమన్యుం డెవరిపైఁబడునో యని దిగులువడ
సాగిరి. అట్టి యపరాహ్ణసమయంబున శత్రుంజయుండును
జంద్రకేతుండును సువర్చసుండును సూర్యభానుండును
మొత్తంబై తాకిన ధనంజయతనయుం డమ్మోటిమగల
మేనులు నానాస్త్రంబుల ననేకఖండంబులు గావించి,

గాంధారపతి వచ్చిన వానిం గ్రూరనారాచజాలంబుల జర్జరితశరీరుం జేసి, దుర్యోధనుదెసకు నడచుచుండ నంగపతి గురున కిట్లనియె.

క॥ చండగతి వీరరథికులఁ
జెండుచు నేతెంచి రాజుఁ జేరెడు సౌభ
ద్రుండిట్టులు నీకూరక
యుండనగునె ప్రతివిధాన మొనరింపుతగన్.

క॥ అని పలికి పతికి నష్టము
సనుటయు గురుఁడచటి యోధచయముం గలయం
గనుగొని యభిమన్యుఁడు న
ర్జునుఁడును నని నొక్కరూప చూడఁ దలఁపన్.

వ॥ చూడం బిన్నవాఁడుగాని యలంతులంబోయెడువాఁడు కాఁడు. మనమందఱముఁ గూడుకొని యొక్క పెట్ట యక్కుమారుపై నురవడింపవలయు నని పలికినఁ గర్ణుం డిట్లనియె, "ఆచార్యోత్తమా! వీఁడు న న్నెంత పీడించెనో నాశరీరంబుఁ జూడుము. అపయశంబున కోర్వఁజాలక పఱుఁగిడ కిందు నిలిచితి. ఇదివఱకుఁ బలుసారులు రణరంగంబున నర్జును నే నెఱుంగుదు గాని వానిచేయి యింత బెట్టిదంబుగాదు." నావుఁడు ద్రోణుం డల్లన నవ్వుచు, "కర్ణా! కవచధారణ మను నొక్క మహావిద్యను నే నర్జునున కెఱింగించితి. దాని నీతండును వానికడ నేర్చియుండుటచే

నీబాలుని నోర్పించుట యశక్యము. ఎట్టులైన వంచన చేసి వీని విల్లుద్రుంచి, ఘోటకంబులం జంపి సారథి నడంచి యభిమన్యుని సాధింపవలయు. ఇయ్యది నీచేనైనచో నిట్లు సేయుము. కేల ధనువున్నంతకు వీని నెదిరించుట దేవతల కేని సాధ్యంబు గాదు."

చ॥ అన విని సూతసూనుఁడు భ
యంబెదఁ గూరినవాఁడపోలెనై
వెనుక కొదింగి యారథిక
వీరు పిఱుందికిఁ జుట్టివచ్చి, వం
చనకు సహాయులై యచటి
సైనికు లన్నరపుత్రు బిట్టు మా
ర్కొని పెనఁగంగఁ జేరి యల
ఘుప్రదరంబున విల్లు ద్రుంచినన్.

క॥ గురుఁ డశ్వంబులఁ గూల్చెను
సరభసముగఁ గృపుఁడు సంపె సారథి నన్నైల్ల
నరసుతుఁ డనాయుధుండును
విరథుండును నగుటసూచి వెఱపేదివడిన్.

క॥ శకుని కృతవర్మ శల బా
హ్లీక గురుసుతులాదిగా ననేకు లపరి య
స్త్రకలాపంబుల శస్త్ర
ప్రకరంబుల నొంచి చిక్కువఱచి యలఁచినన్.

క॥ వాలును బలకయుఁ గొని య
బ్బాలుఁడు రయమార గగనభాగంబున కు
న్మీలిత ధృతిసారుండై
లీల నెగసిపోయె మండలీభూతగతిన్.

వ॥ అదిచూచి యయ్యోధవరులెల్లరు మఱల భయాకుల చిత్తులై యాకస్మికముగ నాకసమునుండి సౌభద్రుం డెవ్వరిపైఁబడి యెవ్వరి నంతమొనరించునో యని తత్తరపడసాగిరి. ఆతత్తరపాటు తొలంగునట్లు గురుండు తోడనే యొక బల్లెమున నభిమన్యు కేలంగల కరవాలము ఖండింపఁ గర్ణుండును వానిడాలును శకలంబులొనరించెను. అప్పు డయ్యసహాయస్థితి కర్జునతనయుండు లేశమును భీతిల్లక తనరక్షంబుపై వ్రాలి చక్రాయుధంబుఁ గైకొని యుపేంద్రునివలె శోభిల్లుచు నెత్తురుగార్చుచు నాగ్రహాతిశయంబునఁ గడు నుగ్రంబైన ముఖకాంతితో, కౌరవసేనాసముదయంబులగుండియలు వ్రక్కలు సేయు సింహనాదంబుతో ఆకసమునంటు రథాంగప్రభలఁగలిసి భాసిల్లు మణికంకణ ద్యుతులతో, అంకుశంపుఁబోటునఁ జెలంగిన గంధసింధుర సంరంభముతో నాకుంభసంభవునిపై విజృంభించి, యడ్డపడిన సేనలనెల్లఁ జక్రాయుధంబున సంహరించుచుండ, సమ్మేటిమగని మగతనమును బలమును జలమును వేలుపులు వేనోళ్ళఁ గీర్తింపసాగిరి.

అప్పుడు శకునికృతవర్మకృపకర్ణశల్యముఖ్యులైనమహావీరులు పలువురు మఱల నలుదెసల నతనిం జుట్టుముట్టి, వాని చక్రాయుధంబును దునియ లొనరించిరి. అభిమన్యుండును సుదృఢగదాదండంబు నొండు దాల్చి గురునందనునిపైఁబడ నతండు ప్రాణభీతిం బఱచె. సౌభద్రుండు వాని సారథి రథ్యములఁ జావమోది, తనకడ్డముగ నున్న మహావృక్షముల నెల్లఁ బీకి పాఱవైచు జంఝానిలుని కైవడిఁ జెలరేఁగి, గాంధారవీరుల నిర్వదియేడ్వుర నుక్కడంచి, తన్నుమార్కొనిన వసాతీయులఁ బదుగుర నేనుంగులతోడనె పీనుఁగుల గావించి, యందందుఁ దన్నెదిరించుచుండిన కేకయసప్తకంబును రథసమేతంబుగ రూపుమాపి, డస్సి యోడి పఱుఁగిడిపోయెడి యోధులం గని కలకల నవ్వుచు నుల్లసంబాడుచు నాకుమారవీరుఁడు తన వీరవ్రతమును గడు ధీరత్వనిష్ఠతో జరిపెను.

ఆసమయంబున దుశ్శాసనుకొడుకు తన యరదంబు సంసిద్ధ మొనర్చుకొని యభిమన్యుం దాఁకి నతండు వాని సారథి నడంచి హయములఁ బడనేసెను. అంతతోఁ బోక దౌశ్శాసని తురంగరహితం బగు తన శతాంగమును లంఘించి సౌభద్రునితో గదాయుద్ధంబునకుఁ దొడంగెను. తమ్ముఁ జూచువారి కద్భుతమ్మును సంతాపంబును గదుర శరీరములు రుధిరధారాపూరితములై చెలంగ నాఁ డయ్యు

న్నదమ్ముల బిడ్డలిరువురు నతిభయంకరముగఁ బోరాడు చుండఁ గొంతవడికి సౌభద్రునిగదాఘాతమ్ములచే దుశ్శాసనసూనుండు గతప్రాణుం డయ్యె. కమలాకరమునఁ జొచ్చిన వనగజమును నిర్దయులైన కిరాతులు చుట్టుముట్టి కడతేర్చునట్లు లా సమయమ్మున నచ్చటి మహాయోధు లెల్లరును గూడి నిర్దయులై తాముపన్నిన కృత్రిమవిధానంబున ననేకమహావీరప్రాణాపహరణచణుండైన యభిమన్యునిప్రాణం బపహరించిరి.

క॥ పెక్కండ్రు గూడి యిమ్మెయి
నొక్కనిఁ జంపుట యధర్మమోహో యని న
ల్దిక్కులను బెద్దయెలుఁగున
నక్కజముగ భూతసంచయంబులు వలికెన్.

దశకుమారచరిత్రము.

3. రాజవాహనజననము.

[కేతన—ఇతఁడు తిక్కనకు సమకాలికుఁడు. దశకుమారచరిత్రమును వ్రాసి తిక్కనసోమయాజి కంకితము జేసెను.]

వ॥ కుసుమపురంబు రాజధానిగా రాజహంసుండు మగధరాజ్యమును బరిపాలించుచుండె. అమ్మేదినీవల్లభునకుఁ

గులక్రమాగతులగు సుమతియు సుమిత్రుండును సుశ్రుతుండును సుమంత్రుండును ననువారు నలువురును మంత్రులై యుండిరి. వసుమతికి సవతియనందగు వసుమతీదేవి యగ్రమహిషిగా రాజహంసుఁడు రాజ్యసుఖంబు లనుభవించుచుండ, మాళవదేశాధీశుండైన మానసారుండు రాజ్యగర్వంబున మిన్నుమన్నుఁ గానక కయ్యంబునకుఁ గాలుద్రవ్వుచు నెగ్గు లొనర్చుచుండ నమ్మాగధుండు సైరణ సేయఁజాలక రణంబునకుఁ బ్రయాణభేరి సఱవం బనిచిన.

మ॥ కులశైలంబులు దిగ్గిరందిరుగ దిక్కుంభీంద్రవర్గంబు సం
చలతం జెంద వియత్తలంబు వగులన్ సర్వంసహాచక్ర మా
కులతం బొందఁగ సప్తసాగరములుం ఘూర్ణిల్ల లోకంబు ల
ల్లలనాడన్ జెలఁగెం బ్రయాణపటహంబత్యద్భుతాపాదియై.

క॥ భేరీభైరవభాంకృతి
దూరీకృతశత్రుఁడగుచుఁ దుహినాంశుకులా
ధారుఁడగు రాజహంస మ
హీరమణుఁడు దండువెడలె నెంతయు నలుకన్.

క॥ జలనిధులు నిట్టపొడవం
బ్రళయాంతకుఁ డవనిజనులపై నేచిన య
ట్లలఘుప్రకట చతుర్విధ
బలయుతుఁడై మానసారుపై వడి నడిచెన్.

వ॥ ఇట్లు వెడలిన రాజహంసుని దండయాత్రావృత్తాంతంబును జారముఖంబున విని మాళవేశ్వరుండు మహోగ్రతరాగ్రహవిగ్రహుండై నానాగజయూథ ఘోటకసనాథసమగ్రంబైన యనంతసేనాసముదయంబులతో సమరాభిలాషియై శత్రుసేనల కెదురుగఁ జనియె. ఇవ్విధంబున మాగధమాళవేశ్వరు లొండొరుల కెదురు నడచుచు నొక్కయెడం గలసికొని మొనలఁ దీర్చియుండిన సమయంబున.

క॥ కరిఘటలుఁ దురగచయములు
నరదంబులమొత్తములు భటానీకములున్
బెరసి దిగంతము లద్రువఁగఁ
బరువడి దలపడియె రెండువాగులయందున్.

క॥ కరికరములఁ దురగఖురో
త్కరములఁ రథచక్రములఁ బదాతులు పైపై
దిరుగుచుఁ దునియుచు నలియుచు
ధరణీభాగమునఁ బడిరి తెఱుఁ ద్రొయుండన్.

క॥ కాలుబలమెల్ల నిమ్మెయిఁ
గాలునిబలమయ్యె నంతఁ గరితురగరథా
భీల త్రివిధబలంబులు
నాలంబున రౌద్రరసము నాకృతిఁజూపెఁ.

వ. తత్సమయంబున.

ఉ॥ ఆమగధేశ మాళవధ
రాధిపు లెక్కటిఁ బోరి రాజిలోఁ
గాముఁడు శంబరుండు శశి
ఖండధరుండు గజాసురేంద్రుఁడున్
రాముఁడు రావణుండు సుర
రాజతనూజుఁడు సింధునాథుఁడున్
భీముఁడు దుస్ససేనుఁడు ను
పేంద్రుఁడుఁ గంసుఁడుఁ బోరునాకృతిన్.

వ॥ ఇట్లతిఘోరయుద్ధంబుచేసి వసమఱియున్న మానసారుం జూచి కరికపోతంబుం గనిన కంఠీరవంబునుంబోలెఁ గోపించి పట్టుకొని యతని వదనంబు లజ్జావనతంబగుటఁ గనుంగొని కరుణించి యమ్మాళవేంద్రునిం దోడ్కొనిపోయి వాని రాజ్యంబునం బ్రతిష్ఠించి క్రమ్మఱవచ్చి రాజహంసధాత్రీపతి యపరిమితంబగు తన సంపద పొంపిరివోవ, లక్ష్మికిం బాత్రంబుగా సుపుత్రుంబడయం గోరుచున్నయెడ నొక్కనాఁడు ప్రభాతసమయంబున రాజహంసుకోర్కికిం దగినట్లు దైవయోగంబునం జేసి వామదేవుండను మహర్షి వసుమతీదేవికి స్వప్నంబునఁ బ్రసన్నుండై సంతానసంపత్కరంబుగ సంతానవృక్ష ఫలంబొసంగిచనియె. ఆసుస్వప్నంబు సఫలంబగుటంజేసియద్దేవి గర్భంబు దాల్చినం బ్రమోద సంపదవలనఁ బొంపిరివోవుచు సమస్తసుహృద్భూపాల

వర్గంబు రావించి వసుమతీదేవికి సీమంతోత్సవంబొనరించి, మగధేశ్వరుండు విభవవిజితదేవేంద్రుండగుచు మంత్రి పురోహిత సామంతపరివారపరివృతుండై కొలువున్న యవసరంబునఁ బ్రతీహారి చనుదెంచి సవినయంబుగ నిట్లనియె.

క॥ దేవ! భవద్దర్శనసం
భావన లెదఁగోరి వచ్చి ప్రతిహారమునన్
దేవసముఁ డొకమునీంద్రుఁడు
దా వేడుకనున్నవాఁడు ధరణీనాథా!

క॥ అని విన్నవించి జనపతి
యనుమతమునఁ దోడితెచ్చె నా సన్యాసిన్
గని యెఱిఁగి మందహాసము
వినయముతోఁ గూర్చెఁ బతివివేకము వెలయన్.

ఉ॥ అంతఁ బయోజబంధుఁడు ది
నాంతగతుం డగుడున్ సమస్తసా
మంతుల భృత్యులన్ బుధుల
మాన్యులఁ బొండని యా నృపాలుఁ డే
కాంతగృహంబులోనికిఁ బ్రియం
బున మంత్రులుఁ దానుఁ బోయి వే
షాంతరగూఢుఁడైన చరు నల్లనఁ
జేరఁగఁ బిల్చి యిట్లనున్.

"ఓరీ! నీతో వచ్చిన తక్కినచారు లెందుఁ బోయిరి. నీ వీసన్న్యాసివేషముతో నేయేపురంబుల నేయేరాజుల విశేషంబులఁ గనుగొంటివో మా కెఱింగింపు" మనుటయు నమ్మాయసన్న్యాసి తన మాఱువేసంబు దీసి సవినయంబుగ నిట్లనియె. "దేవా! దేవర పంపిన గూఢచారులెల్లరు నొక్కొక్కదేశంబునకుం జన నే నీవేసమ్ముతో మాళవదేశంబునకుఁ బోయితి. అందుఁ గొన్ని దినంబులు నిగూఢంబుగ వర్తించి యా రాజవర్తనంబులు గుర్తించి వచ్చితి. మాళవేశ్వరుండు మున్నుసంగ్రామంబునఁ బరాజితుండై దేవరచే నిజరాజ్యంబున నిలుపంబడిన నాటంగోలెఁ బరాభవానలంబునఁ గ్రాగుచు నీశ్వరునిం గూర్చి యుగ్రతపంబుఁ గావించె. ఆతని తపఃప్రభావంబునకు దేవదేవుండు మెచ్చి శత్రుభయదంబగు నొక్కపెనుగద యిచ్చి చనియె. మానసారుండు కృతఘ్నుండై యుగ్గదాయుధంబె యాధారంబుగ దేవరపైఁ జనుదేరఁగ నున్నవాఁడు. ఇంక మీఁదికార్యం బెడసేయక యోజింపందగు"

చ॥ అని యెఱిఁగించి వాఁ డరుగ
నప్పుడె కార్యము నిశ్చయించి యి
ట్లనిరి తగంగ మంత్రులు న
రాధిప! యిట్టిదయేని మాళవేం

దుర్గిని కెదురెత్తరా దతఁడు
రోషమునం బయి నెత్తివచ్చెసన్,
జెనయుట దక్క దుర్గములు
చేరుట నీతి తలంచి చూడఁగన్॥

వ॥ అని దైవబలంబు విచారించి పలికిన మంత్రులకుఁ బతి యిట్లనియె.

మ॥ మగపంతంబున మానసారుఁ డనిలో
మాకల్గి పై నెత్తినన్,
బగ వాటింపక వాని నోంపక జగ
త్ప్రఖ్యాతిగా నోటమై
దగవూహింపక దుర్గభూములకు నిం
దాపాత్రమై పోక బు
ద్ధిగఁ జెప్పందగునే స్వచక్రప్రకృతి ని
స్తేజంబు వైరింపనే ?”

ఉ॥ దైవబలం బసాధ్యమని ధైర్యముఁ బెద్దతికంబు లజ్జయున్
బోవఁగఁ బెట్టి కానలకు, బోయినలోకమువారు నవ్వరే?
యేవపుమాటలేమిటికి నెల్లవిధంబుల మానసారు పైఁ
బోవుటమాన, వాఁ డనికిఁ బూని నిజంబుగ నెత్తివచ్చినన్.

వ॥ అనినఁ బతిపలుకు లతిక్రమింప నేరక యొడంబడి వీడ్కొని నిజనివాసంబులకుం జనిరి. మఱునాఁడు మాళ వేశ్వరుండు సమస్తసామగ్రితో నెత్తివచ్చిన విని సుమతి

ప్రముఖులగు నలువురు మంత్రులు గార్యజలంబు సాధనంబుగా నధిపుచిత్తంబు మెత్తంజేసి హేతుదృష్టాంతంబులు చూపి యొడఁబఱిచి గర్భభారాలసాంగి యైన మహాదేవి నఖిలాంతఃపురసంతానంబుఁ గూర్చి బుద్ధిసహాయంబుగా ధాత్రీవర్గంబును గ్రీడాసహాయంబుగా సఖీవర్గంబును దుర్గస్థలవర్తనసహాయంబుగా మూలబలంబును సమర్పించి వింధ్యాటవీమధ్య నిగూఢంబుగా నిలువ నియమించి కందువచెప్పి యనిచి పుచ్చెఁ. రాజహంసుండును దండువెడలె. ఇట్లాండొరులు చేరవిడిసినంత మగధ మాళవాధిపుల బలంబులు తలపడియె. అతి స్వల్పకాలంబుననె యాపోరు ఘోరంబగుటయు మానసారుండు విజయాతురుండై భవదత్తంబగు మహాగద వైచిన మగధవల్లభుండద్దానిం దునియలొనర్చె. అట్లయ్యు నయ్యది దైవదత్తంబగుట నమోఘంబు గావున నగ్గదాఖండంబులు రాజహంసు సూతుం దాకి వానింగడతేర్చి రాజహంసు మేనం గాడి మూర్ఛితుం జేసె. సారథిలేమిం జేసి రథ్యంబులుభయభ్రాంతంబులై పఱుగిడుచుంబోయి దైవవశమున వింధ్యాటవిం బ్రవేశించి యంతఃపుర సన్నివేశంబున కనతిదూరంబున నొక్కవటవిటపికి నరదంబు తగులుటచే నచ్చటఁ బరిశ్రాంతంబులై నిశ్చలంబులై యుండె. ఆరథంబున రాజహంసుండును సేదదేరియుండ, నట మాళవేశ్వరుం

డును మగధపతిరాజ్యంబు గైకొని కుసుమపురంబునకుం జనియె.

సుమతిప్రముఖులైన మంత్రులెల్లరుఁ బాలికలనం బడియుఁ గ్రమ్మఱఁ దెలిసి భూవల్లభు నన్వేషించి యెందు నుంగానక వింధ్యాటవికింబోయి కాంతాజనంబును సమీపించి వసుమతీమహాదేవింగని యుద్ధప్రకారంబును రాజహంసునిం గలనిలోరోసి కానమియు సవిషాదంబుగా నెఱింగించిన నిజవల్లభుండు పరలోకగతుం డయ్యెనకాఁ దలంచి యద్దేవి శోకంబు సైరింపఁజాలక తనుత్యాగంబునకు నుద్యోగించి యనలంబు దయసేయుఁ డనిన మంత్రు లిట్లనిరి. సంశయంబగు పతిమరణంబున కనుమరణంబు తగదదియునుంగాక నీ స్వప్నఫలంబు సాకారంబైనట్లున్న నీ గర్భంబు రక్షించుటయె సమస్తలోకరక్షణంబగు. మఱియు.

మ॥ ఉదరస్థుండు సుతుండు, వాఁడగు జిరా
యుర్ధీ యశస్స్వాకుమా
ర్య దయా ధైర్యపరాక్రమంబుల జనా
రాధ్యుండు లోకత్రయీ
హృదయాహ్లాదకరుండు నిక్క మని ని
న్నేకాంతదుర్గంబులోఁ

బ్రిదికింపన్ మదిఁగోరె భర్త, యది
తప్పం జూడఁగాఁ బాడియే?

వ॥ వసుమతీదేవియు వారితో వాదింప నొల్లక యప్పటికి వల్లెయని, యర్ధరాత్రిమున నందఱు నిద్రాపరాధీనులై యుండ సముత్తశోకానలంబు సైరింపఁజాలక యచ్చోటు వాసిపోయి వరుని యరదంబు చిక్కిన వటవిటపి సమీపంబున నొక మ్రాని కొమ్మ నుద్బంధనంబు సేసికొన నెంచి 'హా! మగధేశ్వరా! రాజహంసమహీవల్లభా! భావిజన్మంబులయందు నేన నీకు ధర్మచారిణి నైయుండు దాన' ననుచు నాక్రందనంబుఁ గావింప నంతకుమున్న మిళితనీహారంబైన మారుతంబు సోకుటం దెప్పిఱియు బహువ్రణపరిస్రుతశోణితుండై లావరుటం జేసి లేవఁజాలక యున్న భూవల్లభుం డాశోకధ్వని విని, తనసతి చావునకుం దెగుట భావించి 'వలదు వలదు. సాహసంబు వల' దని యెట్టు లేనియుం బలికె. ఆపలుకులకు వసుమతి యులుకు వడిచీకటిలో నయ్యెలుంగుదిక్కుచూచి పతికంఠస్వరంబుగ గుర్తించి పోయి రథంబుపైనున్న రాజహంసుంజూచి సంభ్రమించి, పరిజనుల కెల్లర కెఱింగింప సచివప్రముఖులెల్లరు వచ్చిచూచి యానందరసాబ్ధి నోలలాడిరి. అనంతర మమ్మంత్రులు జనపతి నెత్తి తెచ్చి మృదుశయ్యపై నుంచి తను సక్తశల్యంబులం బుచ్చి సుఖస్థితుం జేసిరి. "దేవా! పరివా

రంబులు లేక చీకఁటి నొంటరిగ నిట్లు వచ్చితి” రని యెల్ల
వారు నడుగసాగిరి.

చ॥ అనిన మహీశుఁ డిట్లనియె
నాలము లోపల మాళవుండు వై
చినగదఁ జూర్ణితాకృతిగఁ
జేసితిఁ దీవ్రశరంబు లేసి య
త్తనియలు వచ్చి సూతు వెసఁ
దున్చి మదంగము లెల్ల నొంచినన్
మనమరి మూర్ఛఁబోయితిఁ గ్రి
మంబున నియ్యెడ సేదదేఱితిన్॥

క॥ తేటినయవసరమున నీ
కాటడవిం గాంత యెలుఁగు కరుణాస్పదమై
మీాటి చెవిసోఁకుటయు నడ
లాఱఁగ నేఁ బలికితిం బ్రియత్నముతోడన్.

సీ॥ అరుగుదెంచిన తెఱఁ గిట్టిదని యెఱుంగ
ననిన మంత్రులుఁ గాంతలు నా ప్రజనులు
నఘటమానవిధాయకుఁ డగు విధాతఁ
బొగడి రానంద మాత్మ నుప్పొంగుచుండ.

వ॥ కతిపయదినంబుల కమ్మహీనాథు శరీరవ్రణక్లేశంబుం బా
మనఃక్లేశంబునుం బాప నెంచి మంత్రులతని కిట్లనిరి.

శా॥ దేవా! మున్ను సమస్తభూపతులతోఁ
దేజోగరిష్ఠుండవై
యీ వింధ్యాచలమధ్యకాననమునం
దిబ్బంగి నీ యున్కి-యుర్
వ్యాధీనముగాన దీనికి విషా
దం బందఁగా నేల? శ్రీయుం
భోగాహంబులయట్లు సంపద లోగిం
బుట్టుం జెడుర్ మాత్రిలోర్.

వ॥ అని పెక్కు భంగుల బోధించి, పదంపడి సుమతిప్రము
ఖులు జనపతితోడను, తత్కుటుంబంబుతోడను, సమస్త
పరివారంబులతోడను వామదేవుం డను మునివరు నాశ్రి
మంబునకుం బోయి యందుఁ గొండొకకాలంబు నిలిచి
యుండ నిజమనోరథం బమ్మహాముని వలన సఫలంబుఁ గావిం
చుకొనందలంచి విభుండు వినయావనతవదనుండై వామ
దేవున కిట్లనియె.

చ॥ తప మొనరించి మాళవుఁడు
దైవబలంబున నన్ను నోర్చి రా
జ్యపదవిఁ దాను గైకొనియె;
నట్లన యేనును బూని చాల ను
గ్రపుఁ దపమాచరించి రిపు
గర్వ మడంపఁ దలంచి, నేను నీ

కృపఁ బడయంగవచ్చితి న
కిల్బిషమానస! తాపసోత్తమా.

వ॥ అనినఁ గాలజ్ఞాని యగుటం జేసి భావిఫలం బెఱింగింపం దలంచి వాసుదేవుం డిట్లనియె.

క॥ ఆయాసంబునఁ దపములు
సేయంగా నేల? శత్రుజిద్బాహుండు దీ
ర్ఘాయుష్మంతుఁడు పుట్టెడు
శ్రీయుతుఁ డగుసుతుఁడు వసుమతీగర్భమునన్.

వ॥ అని యిట్లు చెప్పు నవసరంబున "మునివాక్యంబునందు సంశయంబు వలదు. వసుమతికి జన్మించిన పుత్రుండు సంప్రాప్తయౌవనుండగుడు దిగ్విజయార్థం బరుగవలయు. అది నీ కభ్యుదయనిమిత్తం" బని యశరీరవాణి యంతరిక్షంబున నేతెంచిన ధరణీశ్వరుండు పరమానందంబునం బొంది యున్నఁ గొన్ని దినంబులకు శుభముహూర్తంబున నద్దేవికి సర్వలక్షణలక్షితాంగుం డగు పుత్రుం డుదయించి జాతకర్మాదిసంస్కారంబులఁ బ్రదీప్తుం డై రాజవాహనుం డన దినదినప్రవర్థమానుం డగుచు నుండె.

నృసింహపురాణము.

4 జయవిజయశాపము

[ఎఱ్ఱాప్రెగడ - వీనియింటిపేరు ఏర్చూరివారు. నివాసస్థలము నెల్లూరు మండలమునందలి గుడ్లూరు. నియోగిబ్రాహ్మణుఁడు. ఇతనికి శంభుదాసను నామాంతరముగూడఁగలదు. క్రీశ-1340 మొదలు 1369 వఱకుఁ దెనుఁగుదేశములో రాజ్యముచేసిన యనవేమారెడ్డి కెఱ్ఱాప్రెగడ యాస్థానకవిగా నుండెను. ఇతఁడు శిథిలమైన భారతారణ్యపర్వశేషమును బూరించి, రామాయణమును, నృసింహపురాణమును హరివంశమును వ్రాసెను. వీనికిఁ బ్రబంధపరమేశ్వరుఁడను బిరుదు కలదు.]

వ॥ మహనీయమహిమాభిరామంబగు క్షీరపారావారము నిరంతరము శ్రీమన్నారాయణునకు శయనాగారంబై విరాజిల్లుచుండు. అదియే భువనైకమాతయగు రమాదేవికిఁ బుట్టినిల్లు. చంద్రుండును నైరావణాది మహాకరులును మందారపారిజాతాది సురమహీజాతములును దుగ్ధాంబునిధియందే యుద్భవించినవి.

సీ॥ సిరిపుట్టినిల్లు రాజీవలోచను సెజ్జ
పట్టు మహీకాంత కట్టుఁజీర
గిరులుడాఁగెడు గొంది గిరిభేది పగఱకుఁ
బెలుకోట బడబాగ్ని బ్రదుకుఁజోటుఁ

పటుపయోధరముల పాలి ప్రపాసీమ
యమృతాంశుపాడుపున కనుగలంబు
మర్యాదలకు గుటి మహిమలకందువ
యఖిలరత్నములకు నాకరంబు
సుఖదభవనంబు వాహినీసుందరులకుఁ
గూర్మి నిల్కడ గంభీరగుణము నెలవు
తనరు నొప్పిదములకెల్లఁ దానకంబు
వనధిఁ గొనియాడఁ జతురాననునకు వశమె.

వ. ఇట్లపారవిభవోదారం బగు దుగ్ధపారావారంబునకు నలంకారంబగుచుఁ దదీయమధ్యప్రదేశంబున ననేకశతసహస్రకోటియోజనవిస్తారవిపులరూపంబై శ్వేతద్వీపంబుదీపించుచుండు. ఆశ్వేతద్వీపంబునందలివారలెల్లరు శరత్కాలజీమూతబహుళధవళాకారులు, జరామరణభయవిరహితులు, సంతతశ్రీహరిధ్యానానందచేతస్కులు. అట్టి మహాద్వీపంబు నడుమ వైకుంఠనామధేయంబగు మహాపురంబు భూరిమహిమాభిరామం బగుచుండు.

క॥ నాలుగునోళులవానికి
నాలుక లిరువేలుగల ఘనస్థిరమతికిఁ
బోలునె వినుతింపఁగ ననఁ
జాలికలకు మిగిలియొప్పుఁ బురియొప్పిదముల్ ॥

సీ॥ నారాయణునిదివ్యనామసంకీర్తనం
బనిశంబు సేయు మహాత్ములకును
బద్మాక్షు శ్రీపాదపద్మంబు లత్యంత
భక్తిమైఁ బూజించు ప్రాజ్ఞులకును
విశ్వరూపునిమూర్తివిభవంబు నేకాగ్ర
బుద్ధి భావించు సత్పురుషులకును
లక్ష్మీశ్వరుని సముల్లాస హేతువులగు
వ్రతములు సలుపు సద్వర్తనులకు
భవముదీఱిన తుది వచ్చి భవ్యసుఖము
లనుభవింపంగఁ దగునెల వగుటఁ జేసి
అఖిలవస్తుసంపదలకు నాకరంబు
గుణవిధావిభాసురము వైకుంఠపురము.

వ॥ అట్టి వైకుంఠపురంబున రాకాచంద్రసహస్రభాసమానంబగు నొకదివ్యసౌధంబునఁ గమలాలయ యిల్లాలుగ, నలినాసనుండు నందనుండుగ, విహగాధినాథుండు వాహనంబుగ, నహికులస్వామి శయనంబుగ, నందకంబు గరవాలంబుగఁ, బాంచజన్యంబు శంఖంబుగ, నింద్రాదిదేవతలు సేవకులుగ, మునిగణంబు లాశ్రితగణంబులుగ, ధర్మసంస్థాపనంబె నిజోద్యోగంబుగ నార్తరక్షాపరాయణుండగు నారాయణుండు నివసించుచుండు. ఆదేవుని దివ్యమహిమంబు లాదేవుండు తానె యెఱుంగుంగాని చతుర్ముఖ

పురందరప్రముఖబృందారకుల కెవ్వరికి నెఱుంగరాదు. తపంబులంబోని పాపంబులు దానంబులం దొలంగని దోషంబులు జపంబులం బాయని కలుషంబులును వైకుంఠవాసుని పవిత్రనామం బొక్కమా ఱచ్చంపుఁ దలంపున నుచ్చరించిన మాత్రనఁ జెచ్చెర విచ్చిపోవు. అయ్యాది దేవునకుఁ గరుణయె దివ్యాభరణంబు. ఆశ్రితసంతోషంబె మహైశ్వర్యంబు. భక్తసంరక్షణంబె ముఖ్యకార్యభరంబు. ఇట్టి పరమేశ్వరుండు పరమప్రభావసంభృతుండగుచు, భువనాహితచరితంబులం బాపుచు శుభంబులం జూపుచు భక్తజనపారిజాతం బనఁ బ్రఖ్యాతియుఁ గరుణారసప్రీతియుఁ దనకు సహజంబులై వెలయ వైకుంఠపురంబున విహరించుచు సకలలోకాలంకారంబగు శరత్కాలంబునం దొక్కనాఁడు మందస్మితసుందరవదనారవిందుండై యిందిరతోడ సరససల్లాపసౌహార్దంబునం దవిలి.

ఉ॥ ఆ నలినాయతాక్షి నయనాంచలచంచలతావిభ్రమ
భ్రూనటనంబు నాతనిపూర్ణముఖేందువిలాసహాస మ
మ్యానని ముగ్ధభాషణసమంచితమంజులలీల యెంతయున్
మానసముం బ్రమోదరసమగ్నముగా నొనరింపనున్నెడన్.

క. డెందమునఁ గొలువువేడ్కలు
సందడిగొన నేగుదెంచి సంయమివరులున్

బృందారకులున్ నిల్చిరి
క్రిందుగ జగదీశు మందిరద్వారమునన్.

సీ॥ అవసరం బిప్పుడయగు నంతదాఁకను
బగళ్లమై నిలుఁడు దిక్పాలవరులు
సందడిసేయక యందఱు నించుక
సేపుగూర్చుండుఁడు సిద్ధమునులు
దండియలును మీరు దడియాఁగఁ బడక యం
తకు నటువోండు గంధర్వముఖ్యు
లిందాఁకఁ బొగడితి రించుక వడి యింక
జగడంబు మానుఁడు చారణేంద్రు
లనుచు నుద్వృత్తవేత్రదండాభిరామ
హస్తులై ఫణిహారు లందంద నిలువ
నధికమై యొప్పె సమ్మర్ద మాదిదేవు
భూరిమందిరతోరణభూమియందు.

వ॥ అట్టి సంకులసమయంబున బ్రహ్మకుమారులగు సనకుఁడు సనందనుండును సనత్కుమారుఁడు సనత్సుజాతుండు నను వారలు గోవిందసందర్శనవాంఛ నేతెంచి యనివార్యగమనంబున లోనికిఁ బోవం బోవ వారికి నడ్డపడి జయుండును విజయుండు నను ద్వారపాలకు లమ్మహామునీంద్రుల కిట్లనిరి.

ఉ॥ ఇప్పుడ మేలుకాంచెఁ బర
మేశుఁడు సాగరకన్యకాంతతోఁ

దెప్పలఁ దేలుచున్న తన
తియ్యపుఁజూపులనేని నొండుమైఁ
ద్రిప్పఁడు పాఁపపాన్పపయి
దివ్యపదంబు పసిండిపావయుం
దొప్పగనేని మోపఁడట
నొండ్లను జేరరు పూని యెవ్వరున్.

క॥ ఈసిద్ధు లీసురప్రభు
లీసంయమివరులు జగదధీశ్వరుఁ గొలువం
గా సమయము గాచి తదే
కాసక్తత నున్నచంద మటు గనుఁగొనుఁడీ॥

క॥ మీరును నొక్కింతతడవు
సైరణతో నిలిచి సమయసముచితముగ ల
క్ష్మీరమణుఁ గని కృతార్థస
మారంభుల రగుఁడు తద్దయాలాపములన్.

వ॥ అని వారించినంత ముకుందసందర్శనోత్సాహంబునకు భంగంబు వాటించిన జయవిజయుల నత్యాగ్రహదృష్టులం జూచి.

గీ॥ అఖిలలోకగమ్యుఁ డగుపరమేశ్వరుఁ
జూడఁగోల్వ నబ్బు సుకృతమునకు
నంతరాయమైతి రట్టి యుద్ధురితంబు
ఫలము ననుభవింపవలయు మీరు.

ఉ॥ కావున ధర్మవిద్విషులు
కల్మషకారు లనంగ దుష్టమో
హావిలబుద్ధితో నసుర
లై చరియింపుఁడు సంతతంబు ల
క్ష్మీవిభుమీఁది మచ్చరముఁ
గిన్కయుఁ గాఁటియ వెట్టఁగాఁత మీ
భావము లెప్పు డీపగిది
బాములఁ బెక్కగు నిక్కమెంతయున్.

వ॥ అని ఘోరంబుగా శపించిరి. జయవిజయులును భయాతిశయంబున మూర్ఛిల్లి తెలిసి వెఱఁగుపడి వెలవెలఁబోవం జొచ్చిరి. అచ్చటఁ గూడియున్న మునిబృందారకు లెల్ల నిరంతరశాంతస్వాంతులగు సనకాదుల కింతటి యాగ్రహం బేల యయ్యెనో యని వింతపడసాగిరి. ఆ వృత్తాంతం బంతయుఁ దన దివ్యచిత్తంబున నవధరించి సకలజగన్నివాసుం డగు వాసుదేవుండు లక్ష్మీసహితంబుగ ససంభ్రమంబున నచ్చోటికి విజయంచేసి సనకాదులం జూచి, మీరు సకలలోకద్వారంబుల ననివారితసంచారులరు. అట్టి మీకు వీరుచేసిన తప్పు నాయది. ఉపశమంబు నొందుం డని యనునయించిన నయ్యోగీశ్వరులు మహాయోగీశ్వరేశ్వరుండైన లక్ష్మీశ్వరుసందర్శనంబును సంభాషణంబును గని కృతార్థులై పరమానందంబునఁ దదామంత్రి

ణంబు వడసి నిజేచ్ఛం జనిరి. అంత నారాయణుండు బహుల కారుణ్యపుణ్యావలోకనంబుల జయవిజయుల నీక్షించుచు దరహాసప్రసాద సాదరవదనుండగుచు నిట్లనియె. “మునులకోపంబునకు మారుకోపంబు సూపక యున్న మీశాంతంబు గొనియాడందగినది. బ్రాహ్మణవచనాతిక్రమణం బొనర్పక మీరు జన్మాంతరంబులు గైకొనవలయు. మీరు చిరకాలంబు నన్ను భజియించిన దాసులగుటం జేసి పరమైశ్వర్యభాజనంబులగు జన్మంబులం దేవోవిభవంబు లనుభవించి తుది నస్మత్సాయుజ్యంబు నొందఁగలవారలు. మీ యంతరంగంబులం గలఁకఁ బొలంగుఁడు. మదీయశరణాగతుల రగుటం జేసి మీ కెందును శుభంబ. సకలచరాచర జనకుండైన కశ్యప మహామునీంద్రుండును దక్షకన్యా వరేణ్యయగు దితియును గాలుంత భవదుద్భవకారణ్యా బయ్యెదరు. ప్రహ్లాదవిరోచనబలిప్రముఖులగు భాగవతోత్తములు భవదీయవంశంబునం బరమపావనులై యుదయించెదరు.” అని వారలకు సెలవిచ్చి గోవిందుఁడు నిజదర్శనార్థులగు సురమునిప్రముఖములకుం బేరోలగం బిచ్చి కృతార్థులం జేసి నిఖిలజగంబులు రక్షించుచుండె.

ఉత్తరహరివంశము.

5 మృతవిప్రకుమారరక్షణము

[సోమనాథుఁడు:— వీనియింటిపేరు నాచనవారు. నెల్లూరుమండల వాస్తవ్యుఁడు. నియోగి. 14 వ శతాబ్దాంతమునందలివాఁడు. ఇంచుమించుగ నెఱ్ఱాప్రెగడకు సమకాలికుఁడని చెప్పవచ్చును. ఇతఁ డుత్తరహరివంశమును రచించెను.]

వ॥ ద్వారకానగరంబునం దొక్కనాఁడు శ్రీకృష్ణుఁడు విధ్యుక్తంబగు నొక్కక్రతు వాచరింపఁ దొడంగె. ఆనాఁడు గోవిందుఁడు బంధుమిత్రపరివారంబులు బలసి కొలువ, క్రతుదీక్షయం దుండ, మూర్తీభవించిన శోకదేవతంబోలె నొకవిప్రుఁడు.

క॥ వెడవీడెడు దోవతియును
బెడతలచేతులు వడంకుపెదవులు వ్రేలా
డెడు వెండ్రుకలును బైపై
వెడలెడు కన్నీరుగలుగు వేషముతోడన్.

క॥ ముందట నిలిచి మురాంతక!
మందరధర! భక్తలోకమందార! దయా
కందళితహృదయ! సురవర
వందితపాదారవింద! వసుదేవసుతా!

వ॥ దేవదేవా! నన్ను రక్షింపుము రక్షింపు మని మొఱలిడుచు వచ్చెను. కృష్ణుఁడు వాని యాక్రందనము విని సాదరం బుగ నూరార్చుచు నమ్మహీదేవున కిట్లనియె.

క॥ ఏలయ్య భూసురోత్తమ!
తూలెదు? నీయట్టివారు దుఃఖాంబుధిలోఁ
దేలుదు రే? మముబోంట్లకుఁ
దాలిమి లేకున్నఁ దెలుపఁదగువారయ్యా!

క॥ మేలుం గీడును వచ్చుఁ
గాలముతో రెంటిచేతఁ గలఁగరు ధీరుల్
తేలుచు మునుఁగుచు నితరులు
జాలింబడుదురు వివేకసంగతి లేమిన్॥

వ. అనుటయు నవ్వాసుదేవునకు భూసురోత్తముఁ డిట్లనియె. "పురుషోత్తమా! ఎట్లు ప్రలాపింపక యుండువాఁడ? విధి నాయందుఁ జలంబు వహించి చూపోపక ప్రసూతిదినంబు లనే నాపాపల ముప్వర నపహరించె నాకళత్రం బిప్పుడు మఱల గర్భవతియై నవమాసంబులు నిండియున్నది. నా గుండెయుఁ బగులుచున్నయది. దేవా! నీ వీగర్భమును రక్షించి లోకవినోదార్థ మీసంతానఫలంబును జవిచూచు భాగ్యంబుగలిగించి మమ్ము రక్షింపుము. నేఁడు తప్పక ప్రస వంబు కాఁగలదు.

సీ॥ తడియొత్తు చీరతో దాదికౌఁగిటఁ జేర్చి
చూపంగఁ గన్నారఁ జూడనైతిఁ
దడవియాడకమున్న తట్టిడు మని పట్టి
వడకంగ నిజ్జపై వ్రాల్చనైతి
నల్లంతదవ్వుల నప్పలప్పల యని
యెదురుగాఁ బలుతేర నేగనైతి
వియ్యాలచే నిచ్చి వేడుక నను వారు
కొట్టింప విని దప్పిదేరనైతి
నకట! మిథ్యామనోరథుండనైతి గాని
కొడుకులం గని దమవారు గొండసేయ
నుండ లేదయ్యె సంపద లుబ్బనేని
లేబరముగాదె బిడ్డలు లేని బ్రతుకు.

క॥ ఈగర్భము రక్షించిన
నాగౌరవ మేమిచెడక నారాయణ! నా
నాగుణసంపన్నులలో
సాగుదు నటుగాకయున్న సవయుదు వగలఁ.

వ॥ అనవుడు గోవిందుండు దరహాసితవదనుండై "భూసురోత్తమా! నేఁ డొక్కదినంబ నీవు నన్ను మన్నింపవలయు. క్రతుదీక్షితుండనై యున్నవాఁడ. రేపకడ తప్పక రాఁగలవాఁడ. ఎల్లవిధంబుల నీ తనయునిం గాపాడఁగలవాఁడ" నని పలికె. అంత నార్తుం డగు నవ్విప్రుండు

దీనాననుండై, "గదాధరా! నేఁడు ప్రసూతికాలంబున నీవు మద్గృహంబునఁ జక్రహస్తుండవై యుండి దండధరు బారినుండి నాసంతతిం గాచి ననుఁ బుణ్యుం జేసినంగాని యెట్టి కార్యంబు మీరిన నేమిచేసెదవు? నేఁడుఁ దప్పినఁ గార్యంబును దప్పును" అని కంట నీరు వెట్టి వగచుచుండ జేరువనున్న యర్జునుండు "బావా! వసుధామరుప్రార్థన దీర్చ ననుజ్ఞ నొసఁగుము. పనివినిమెద" నని పలికె. విశ్వంభరుం డల్లన నవ్వుచు, "విజయా! నీచేతను నాచేతను నెట్టి కార్యంబైనం జక్కఁబడు. కాని యీ విప్రకార్యము మాత్రము నీ పంతంబులం గొనసాగనేర" దనఁ గిరీటి వినయలజ్జాయత్తచిత్తుండై మోమువంచి యూరకుండె. అప్పుడు వాసుదేవుండు ధరణీదేవుని దీనభావంబును నర్జునుని లజ్జాభావంబును భావించి, "పురందరపుత్ర! నీ వింక విప్రసుతరక్షణార్థంబు వెడలుము. బలరాముఁడును బ్రద్యుమ్నుఁడును దక్క మన వీటంగల తక్కిన యోధుల నెల్లరం గూర్చుకొనుము. వేవేగ లెమ్ము" నావుడు పార్థుఁడు ముఖంబు వికసింప, యదువృష్ణ్యంధకభోజప్రముఖసైన్యంబులతో దిగంతద్విపమండలంబు బెగడువడ గాండీవగుణనిక్వాణంబుఁ గావించుచు శ్రీకృష్ణపదాంబుజంబుల హృదయంబున నిలిపి వెడలిపోయి విప్రమందిరంబునఁ బ్రవేశించి యముని యాగమనంబును నిరీక్షించుచుండెను. అప్పుడు.

క॥ ఎఱసంజ దాసనంబుల
తెఱఁగయ్యెను గూబలెల్లఁ దెసలఁ జెలంగెన్
వఱదు లఱచె నుల్కాలువడె
నెఱిచెడి సురగాలి విసరె నిలువక పెలుచన్.

వ॥ సైన్యంబును గట్టాయితంబుసేసి వాసవనందనుండు నభోంతరాళముల శింజినీనాదమున నించుచు నమ్మహీదేవుని గృహాంగణంబున క్షణక్షణంబును నంతకునిరాక ప్రతీక్షించుచు నుండు నెడఁ గొంతవడికి లెండు లెండు "పట్టుఁడు! పట్టుఁడు! పోండు పోం"డనుమాటలు భయదస్వనంబుతో వానికి వినవచ్చె. వినవచ్చుటయె తడవుగ "అయ్యయ్యో! పండినపంట మఱలఁ బొల్లవోయిన"దని గృహాభ్యంతరమునుండి బ్రాహ్మణియాక్రందనధ్వానమును నర్జునుండు వినియె. దానంజేసి బ్రాహ్మణికి శిశు వుద్భవించినట్లును మరణించినట్లును విజయుండు గ్రహించి వచ్చిన యమకింకరప్రకరంబును గానలేమికి మిక్కిలి చింతించె. ఇట్లు బ్రాహ్మణశిశుప్రాణములు వోయినంతనె యవ్వృష్ణిభోజబలంబులును జిన్నవోయెను. వచ్చిన బంధులు మృతశిశువుం జూచి పోయిరి. అర్జునుండును లజ్జవోయెను. ఇవ్విధంబున గాండీవమ్ములావు వమ్మయినం గ్రమ్ము నమ్మలికమ్మున విన్నవోయియున్న సంక్రందననందనుం జూచి విప్రుఁడు బోరన నేడ్చుచు.

క॥ ఓపార్థ! నిన్ను నమ్మితిఁ
బాపని రక్షింపకిట్లపార్థుఁడవైతే?
నాపాలిపారిజాతము
గోపాలకచక్రవర్తిఁ గొనిరా నైతిన్.

చ॥ పిలిచితి నన్ను నిన్ను నతిభీతుఁడ
విప్రుఁడ నమ్మినాఁడ నీ
పలు కనృతంబుగాఁదగునె
పాఱెడుబంట్లకుఁ గాళ్ళసాఁపగా
నలవడు నన్న పోటుమగఁడై
యిటు చేసితిగాక యాసతో
నిలుతు మురారి నన్నచట
నీళ్ళను ముంచినఁ బాల ముంచినన్.

క॥ మేలైనను గీఁడైనను
నాలవపా లాఫలము ధనంజయ! రక్షా
శీలునకుఁ జేరు నీ వీ
బాలుని రక్షింపనట్ల ఫలముండుదుగా.

క॥ నీ వేమి సేయు దీగాం
డీవము నీ కిచ్చి యమ్ము డెప్పరమైనన్
లావు గలదంచు బలికిన
పావకుచేఁ గాదె గోలుపడితిఁ గుమారున్॥

వ. అని కడునిష్ఠురముగఁ బలికెను. అర్జునుం డవనతము
ఖుండై మౌనమును దాల్చి విప్రుండును దనతో నరుగు
దేరఁ దేర గాండీవము నిడి లజ్జాయత్తంబగు చిత్తంబుతో
సైన్యసమేతంబుగ ద్వారకకుం బోయి విషాదనమ్రవద
నుండై నారాయణునెదుట నిలిచె. అట్లున్న మఱందిని
వెన్నుం డల్లన గారవించి, యవ్విప్రకులోత్తము నెంతయు
బుజ్జగించి, "అయ్యా! నీ కుమారకుల నేలోకంబునం దు
న్నను దెచ్చియిచ్చెద. నీవు కొందలంపడఁ బనిలేదు. నీవు
ధైర్యంబునం దుండు" మని పీతాంబరధరుండు సముచితా
భరణధరుండై శార్ఙ్గకౌమోదకీచక్రనందకాదిప్రహరణం
బులు తనయరదంబుపైఁ బెట్టించి, గరుడధ్వజంబు
మెఱయ దారకుం బొమ్మని సారథిత్వం బర్జునున కొసంగి
కృతవలాహకసైన్యసుగ్రీవమేఘపుష్పసన్నాహమగు స్యం
దనంబున విప్రసమేతంబుగ నధివసించి వెడలె.

ఇవ్విధంబున వాసవనందనుఁడు తేరు గడప వసుదేవ
నందనుఁడు వెడలి, హంససందోహసందిహ్యమానకుము
దదళాళిందకళిందనందనీసందర్శనంబువలనను, భ్రమర
విభ్రమభ్రమణభాసురభాగీరథీలోకనంబువలనను మనంబు
రంజిల్ల మచల్లకంబు మట్టి, మ్లేచ్ఛంబు మెట్టి, దరదంబు
దాఁటి, కాశ్మీరంబు గడచి, సైంధవం బధిసంధించి,
నారదంబు పరిభ్రమించి, హిమాచలం బెక్కి, హేమకూ

టంబుఁ ద్రొక్కి, నిషధం బతిక్రమించి, నిమిషంబున దంత పరిఘుద్విపఖండితదేవదారువును మేరువును గడిసి, వర్షాచలంబును గడిచి, మఱియు నెడనెడంగల విపినంబులు నదులు నగంబులు నన్నియును దాటి, యుద్యత్తరంగనాకర్ణోలాకరం బగు రత్నాకరంబును గాంచిరి. అంత,

గీ॥ అతఁడు నెదురుగ వచ్చి మురాంతకునకు
నర్ఘ్య మిచ్చి 'లోకేశ! నా కానతిమ్ము
చేయఁగల కార్య' మను టయు, 'సింధురాజ!
తెరువు విడుము నా కుత్తర దిక్కు' కనియె.

ఉ॥ నావుడుఁ గంసవైరికిఁ బ్ర
ణామముచేసి పయోధి యిట్లనుఁ
'దేవ! భవన్నియోగమునఁ
దేకువఁదప్ప దొకండు నాపయిం
బోవఁగ లేఁడు గాల్నడ వి
భుండగు నీవు చనంగ నెంతయుఁ
ద్రోవయగున్ సమాశ్రితుఁడు
దూలిన నెవ్వగ నీకుఁ బుట్టదే?'

గీ॥ అనుడు 'విప్రార్థమై నాకు నరుగవలసి
త్రోవ వేఁడితి మఱి నిన్ను దేవతలకుఁ
దేఱిచూడంగ రా' దన్నఁ దెలిసి జలధి
'రథము చనునంత శోషింతుఁ బథముఁ గొనుము.'

వ॥ అనుటయు మురాంతకుండు 'రత్నాకరా! నీవు శోషింప వలవదు. నీయనితరగమ్యధైర్యమును నీ యనర్ఘ్యమణిప్రకరంబును నన్యులు గనుంగొన నేల? నా వారువంబులు చనియెడు నంబుపూరంబు శిలాసదృశంబుగఁ జేయు; మదియ చాలు' ననుటయు, నప్పారావారము తారూపై రథ మరుగునంత త్రోవ విడిచినఁ గిరీటియుఁ దనకలాపాండిత్యము మాఱితలంపున కెక్కు నరదంబు సాగించె. ఇత్తెఱంగున నుత్తరసాగరంబు నుత్తరించి చిత్తంబలర గంధమాదనంబు సేరి.

గీ॥ వచ్చు నెడ జయంతం బన వైజయంత
మనఁగ నీలంబు నా రజతాచలం బ
నఁగ మహామేరు కైలాసనగము లనఁగ
నింద్రకూటంబు నా వచ్చె నేడుగిరులు.

గీ॥ వివిధవర్ణరత్నప్రభావితతి మెఱయఁ
దమ్ముఁ బనిపంపు మనిన మాధవునకు భూధ
రములఁ గృపఁజూచి మీయందు రథము నడపఁ
దెఱపియిం డన్న నవియు నత్తెఱఁగు చేసె.

క॥ అంతట నేడునగంబులు
నంతర్ధానంబు చేసె; నట చనఁగా న
త్యంతభయంకరకర్దమ
సంతమసంబున రథంబు సాగక నిలిచెన్.

వ॥ మఱియు నప్పెనుచీకటి కొండచందమయినం బాతాళంబుం జొచ్చుచుంటిమో యని విప్రుండును విజయుండును భ్రాంతిపడఁజొచ్చిరి. అంత దైత్యాంతకుండు తనసముదగ్రదీప్తసుదర్శనచక్రకీలలఁ దదీయసాంద్రతరసంతమసమును సంహరించె. అర్జునుండును నరదంబుసాగనిచ్చుటయుఁ గొంతవడికి నాకసంబున వింతయగు వెలుంగుదోఁచె. ఆ వెలుంగునఁ జొచ్చుచుండ సత్యవ్రతాకారుండగు నొక్క దివ్యపురుషుండు రాకాచంద్రదివాకరానలప్రభలఁ దేజరిల్లుచు విప్రార్జునులకుఁ గన్నులపండువొనరించె. అప్పుడు జనార్దనుండు వారినిరువురనందె యుండ నియోగించి, తా నాదివ్యతేజంబునం జొచ్చి, కొంతవడికిఁ జచ్చినసుతులతోఁ దిరిగివచ్చె. ఎవ్వఁడే యేఁడు పుట్టెనయ్యెట్టి ప్రాయముం గోల్పోవకున్నసుతులను నాఁడుగన్న పసికూనను గోవిందుండు బ్రాహ్మణునకు సమర్పించి వారందరితోఁ గూడ ద్వారవతిం జేరె.

భగవదనుగ్రహపాత్రులకుఁ బడయరాని సంపద లుండవు.

పద్మపురాణము.

6 సుందోపసుందోపాఖ్యానము.

[మడికి సింగన్న:- ఇతఁడు గోదావరీమండలవాస్తవ్యుఁడు. నియోగిబ్రాహ్మణుఁడు. ఎఱ్ఱాప్రెగడకుఁ గొంచెముపూర్వముండినవాఁడు. ఇంచుమించుగా 1380 సంవత్సరప్రాంతమువాఁడు. ఇతనిరచించినగ్రంథము పద్మపురాణము.]

వ॥ పూర్వము సుందుఁడు నుపసుందుఁడునను నమందపరాక్రములగు నిరువురు దైత్యులు దైత్యసేనాసందోహంబులతోడఁ జెలరేఁగి దేవభూదేవవర్గంబుల నెల్ల బాధించుచు లోకములఁ జీకాకుపరచుచుండిరి.

చ॥ మునిజనకోటిఁ బట్టుకొని
మోములు రాయుచు యాగశాలలం
దనలము వెట్టి కాల్చుచు జ
నాశ్రియధర్మములెల్ల మాన్పి య
య్యనిమిషసిద్ధసాధ్యఫణి
యక్షసురాహితరాజసంతతిఁ
గనుఁగొని పాఱఁదోలుచును
గర్వము దిక్కుల దుస్సహంబుగన్.

వ॥ జగంబులెల్లనుం దారకైవశమై వర్తించుచుండె; నిట్లతిదారుణంబగు దైత్యుల పరాక్రమంబునకు బెగ్గిలి దేవతలు కమల

గర్భునికడకుం జని సుందోపసుందదానవులు సేయు నుప ద్రవంబులు విన్నవించి యిట్లనిరి.

క॥ పడఁగల పాటుల నెల్లను
బడిపడి పడలేక విసివి 'పద్మాసన! నీ
యడుగులు గొలువఁగ వచ్చితి
మెడసేయక మద్విరోధి నేపడఁపు మికన్.'

వ॥ అని పెక్కుభంగులఁ బ్రార్థింపఁ బద్మగర్భుం డాలించి యయ్యసురులు నిరతిశయవరగర్వాతిశయంబునఁ బెచ్చు పెరుగుట యూహించి యింద్రాదులం జూచి 'సుందోప సుందు లన్యోపహతులు గారు. అన్యోన్యహతులై మృతులు గావలయును. దీనికిం దగినయనువు గావించెద. మీ రింక మీస్థానంబులకుం జని సుఖంబుండుఁ' డని పలికె. బృందారకులు చన్నయంతన విరించి యోజించి మానుస్నాన ఫలంబున విష్ణులోకసుఖంబు లనుభవించుచున్న వృత్తకాంగన యను నాగనామణిం దలంచిన నదియుఁ దత్క్షణంబ యసమానలసమానసౌందర్యలావణ్యాతిశయంబులం బ్రకాశించుచుఁ గ్రక్కునఁ బ్రత్యక్షం బైనంత వాణీవల్లభుం డావల్లవాధర నరసి గారవించి, "నీవు తిలోత్తమ యను నామంబూని బృందారకసుందరీసందోహంబునం డెల్ల నధికంబగు విభవవిలసనంబునం బ్రసిద్ధవై విహరింపుచుండు" మని పలికి మఱియు నిట్లనియె.

క॥ 'సుందోపసుందదైత్యులు
బృందారకగణమునెల్లఁ బీడించెద రీ
వం దరిగి వారి నిరుపుర
మర్దింపుము నీవిలాసమాధుర్యములన్.'

ఆ॥ వె॥ అనిన నమ్మహాత్ముఁ గని తిలోత్తమ వక్త్రఁ
జిన్నిమోము వింతఁ జెన్నుమీఱ
"నకట! యాఁడుదాన నసురవీరులమీఁద
నన్నుఁ బనుపఁదగునె నలినగర్భ!"

వ॥ అనిన విని నలువ దరహసితవదనుండై యయ్యింతి కిట్లనియె. "ఆదైత్యులు బలపరాక్రమసంపన్నులు గావున నెవ్వరికి నజేయు లగుదురు. అట్లయ్యు నీ వల్లన నచ్చటికిం జనునప్పుడు నీ సౌందర్యవిలాసంబులం జూచి మదనాతురులై తమలోనం గలకలపడి యన్యోన్యప్రహారంబులం బంచత్వంబు నొందెదరు. అంతట నీ కనాయాసంబున లోకోపకారంబు సంభవించు. దేవహితంబగు. ఇవ్విధంబు సేయు"మనిన వల్లె యని సరసిజాసను వీడ్కొని తిలోత్తమ నిజాంగరాగపరిమళమిళితమలయానిలుండు మునుంగలిగా నవనీతలంబునకు డిగ్గి నర్మదాతటంబున నసురవరులున్న యశోకవనంబు డగ్గఱి.

ఆ॥ వె॥ అయ్యశోకవనమునందెల్ల విహరించి
సుడిసి కమ్మతావి సోఁడుముట్ట,

5691P GT98

దరుణి విరుల నలరు సురపొన్న తరువెక్కి
వట్టిమ్రాఁకు లిగురువెట్టఁ బాడె॥

వ॥ అప్పు డద్దివ్యగానం బత్యంతమధురంబుగా వీఁతెంచిన నవ్వనంబున విహరించుచున్న దనుజనాయకపరిచరవర్తులగు నసురు లయ్యెలుంగు విని చనుదెంచి తిలోత్తమం గనుంగొని చిత్తంబుల నుత్తలంబు గదురఁ బఱతెంచి, శాతకుంభస్తంభవిలసితంబగు మణిమండపస్తంభంబునందు సుందరులు పసిండికోరల నాసవం బందీయఁ గ్రోలుచు నానందించు నన్నదమ్ముల సుందోపసుందమనుజాశనులం గని సమీపించి సంభ్రమంబున మ్రొక్కి యెన్నండు నెఱుంగని చోద్యం బొండు గాంచి వచ్చితి మని విన్నవించి మఱియు నిట్లనిరి.

చ॥ ఇది యొక యింతి యెవ్వతియొ
యివ్వనమంతయు మావనంబునన్
గదురఁగఁ బెక్కురాగములు
గైకొని పాడుచు మ్రానిమీఁదటన్
బెదరిన లేడిచందమునఁ
బిమ్మిటిఁ బొందఁగఁ జూచుచున్న దా
సుదతి వరించినన్ సుఖము
సుబ్బనఁ జూఱలుగాదె యేరికిన్॥

వ॥ అప్పలుకులు వినుటయు తడవుగ మదిరాపానమత్తచిత్తు
లగు నయ్యిక్కడి రక్కసులిరువురుఁ గ్రిక్కున లేచి చని
యశోకవనంబు సొచ్చి తిలోత్తమ నీక్షించి యమ్మత్తకా
శిని విలాసవిభ్రమలీలావిభవంబుల కచ్చెరువొంది మచ్చ
రంబునఁ బెచ్చుపెఱిగి సరభసంబున నయ్యిద్దఱు డా
యం జని.

క॥ 'ఈచేడియ నాసతి'యని
వే చని సుందుండు గవిసె వెస నుపసుందుం
'డీచెలియ నాకుఁ బ్రియ' యని
వాచఱవఁగ, నిరువురకును వైరంబయ్యెన్.

ఆ॥ వె॥ అన్నదమ్ము లొక్క యతివకై ప్రేమంబుఁ
దగవు సిగ్గు విడిచి జగడమాడి
రట్లు కాదె యొందు నతివలఁ బొడఁ గాంచి
జాలిబొందకున్నె శంభుఁడైన॥

వ॥ అప్పు డమ్మహాసురు లత్యంతరోషభీషణాకారులై యొం
డొరులం గలయం బెరసి శుండాదండమండితమహోద్దండ
వేదండయుగళంబునుం బోలె నుద్దండగదాదండమండిత
దోర్దండులై యంతకప్రేరణంబున నంత కంతకుం గదిసి
చండతరరోషంబులు నిండార దండధరాకారంబుల నొం
డొరుల వ్రేయుచు నొండొరుల మీఱుచు నొండొరులం
డాయుచు భండనపాండిత్యంబున మెఱయుచు.

ఆ॥ పోరి పోరి యొక్కపూఁపున నిద్దఱు
నొక్కసారి గదల నిక్కి వ్రేయఁ
దలలు వగిలి కూలి రిలమీఁద వ్రాలుచు
గులిశనిహతిఁ గూలు కొండలట్లు॥

వ॥ ఇట్లు సుందోపసుందులు పంచత్వంబు నొందినం దద్దైత్యసైన్యంబులెల్ల దైన్యంబునం జెదరి యొండేనియుం జనియె. తిలోత్తమయుఁ గృతకృత్యయై కమలాసనాదిసకలబృందారకబృంద స్తోత్రంబుల ధన్యత్వం బడసె.

విష్ణుపురాణము.

7 కంసవధ

[వెన్నెలకంటి సూరన:—ఇతఁడు కృష్ణామండలనివాసుఁడు. రాచూరి సంస్థానాధీశుఁడైన రాఘవరెడ్డి యాస్థానకవి. నియోగిబ్రాహ్మణుఁడు. క్రీ-శ-1600 సం॥ ప్రాంతమువాఁడు. ఇతఁడు విష్ణుపురాణమును రచించెను.]

వ॥ ఒకనాఁడు నారదుండు మథురానగరంబునకుం జని కంసుని సందర్శించి యతండు చేయు సత్కారంబులు వడసి, యతనితోడ వైష్ణవాంశంబులు దేవకీదేవియందు రామకృష్ణులు జన్మించి నందగోకులంబునం బెరుగుటయుఁ, గృష్ణుఁడు పూతనచనుబాలతోడం గూడఁ బ్రాణంబులు

గ్రోలుటయు, శకటపరివర్తనంబు సేయుటయు, యమళార్జునంబులఁ గూలఁద్రోయుటయు, యమునాహ్రదంబున నున్న కాళీయాహిని మర్దించుటయును, ధేనుకాసురుం బరిమార్చి తాళవనంబు నిష్కంటకంబు సేయుటయు, భాండీరవనంబుననున్న ప్రలంబుని బలభద్రునిచేతఁ జంపించుటయుఁ, బర్జన్యప్రయుక్తంబైన వర్షంబువలన నందగోకులనివాసుల కుపద్రవంబుగాకుండ, గోవర్ధనశైలంబు ఛత్రంబుగాఁ బట్టుటయు, గోపికాజనసమేతుండై రాసక్రీడల వినోదించుటయు మొదలుగా సమస్తంబును సవిస్తరంబుగాఁ జెప్పిపోయిన, భగినీపుత్రనృశంసుం డగు కంసుండు మహాకోపంబున.

సీ॥ ఆనకదుందుభి నవరాని వినరాని
దుర్వాక్యసూచులఁ దూలఁబుచ్చె
వృష్ణిభోజాంధకవీరవర్గము నెల్ల
భంగుల సకలసంపదలు గొనియె
నందగోపునియాలమందల నన్నింటి
బలిమిఁగైకొన వీరభటుల ననిచెఁ
దనమేలు చూడఁజాలని వీరవర్గంబుఁ
గ్రొవ్వాడికొఱ్ఱులఁ గ్రుచ్చఁ బనిచె

గీ॥ ధర్మమార్గంబు దప్పని తండ్రి నుగ్ర
సేను శృంఖలాబద్ధునిఁ జేసి బంది

గమున నిడి మేటిదైత్యులఁ గాపువెట్టెఁ
గంసుఁ డత్యంతభీకరాకారుఁ డగుచు.

వ॥ అని యిట్లు తనలో విచారించి తత్క్షణంబున.

సీ॥ అక్రూరుఁ బిలిచి యిట్లను 'నన్నుఁ జంపుట
కై విష్ణుదేవుని యంశమునను
వసుదేవదేవకీవరపుత్రులై రామ
నారాయణులు పుట్టి నందగోప
గోకులంబునఁ బెరుగుచునుండి నావారి
నందఱిఁ జంపినా రనుచు నేఁడు
నారదుం డేతెంచి నాతోడ సకలంబు
నేకాంతమునఁ జెప్పి యిప్పు డేగె

గీ॥ నెంత చేసిరి చూచితే యీవుదక్క
యకట! నాతండ్రి యుగ్రసేనాదులైన
యాదవులు నాకుఁ గీడుసేయంగఁ బూని
యున్నవా రింక నేమని యుగ్గడింతు?.

మ॥ అని యట్లాడెను గాందినీసుత! ధనుర్యాగంబు గావింపఁగా
నిదె యెల్లుండి యుపక్రమించెదను నీవే తన్మిమిత్తంబుగా
ముద మొప్పన్ రథమెక్కి వే కదలి రామున్ గృష్ణునిన్ నందగో
పదురాత్మున్ గొనిరమ్ము వచ్చినను దత్పాపాత్ములన్ జంపెదన్.

వ॥ మఱియుఁ జాణూరముష్టికులను దుష్టాత్ముల చేతనైనను రామ
కృష్ణులం జంపించి లోకంబుల ననివార్యమైన ప్రాభ

వము నొందెదను. తొలుదొల్త రామగోవిందులఁ జంపి పిదప దేవకీవసుదేవుల గీటడంచి, తరువాత నందగోపాలాదుల నందఱఁ బెదపెద కొట్టులనిడి వారి గోధనంబులు హరియించి, యంత మాతండ్రియగు నుగ్రసేనునితోఁ గూడ నా కతిద్రోహులైన యదువంశజులనెల్ల రూపుమాపి, కులక్షయంబు గావించి, నిష్కంటకంబైన యీ జగంబులనెల్ల నేనె యేలెదను. కావున నీవు నాకుఁ బ్రియంబుగా నీప్రయోజనంబు గావించుటకుఁ బయనముం గమ్ము. అ” ని యనుటయుఁ బరమభాగవతుండైన యక్రూరుఁడు తనకుఁ గృష్ణసందర్శనంబు గలిగెఁ గృతార్థుండనైతి నని సంతసిల్లుచు రథాధిరూఢుండై మధురాపురంబు నిర్గమించె.

మ॥ అరదంబెక్కి ప్రమోదమేర్పడఁగ న
యక్రూరుఁ డేతెంచుచున్
బరమాహ్లాదము భక్తియుక్తియును దా
త్పర్యంబు చిత్తంబులో
బెరయం గృష్ణుని బుండరీకనయనుం
బీతాంబరున్ ధారుణీ
ధరునిం జూడఁగ నేఁడు గల్గెను గృ
తార్థంబయ్యె నాజన్మమున్.

సీ॥ తలఁచినమాత్రఁ బాతకముల నెడఁబాపు
సుజనవత్సలు నేఁడు చూడఁగలిగె
బ్రహ్మాదులకు నైనఁ బ్రణతుల కోపని
మురవిరోధికి నేఁడు మ్రొక్కఁ గలిగె
నఖిలవేదాంతవిద్యారహస్యంబుల
ప్రోడతో నేఁడు మాటాడఁ గలిగెఁ
బ్రపంచికముఁ దృణప్రాయంబు గావించు
ప్రభువు మన్నన నేఁడు పడయఁగలిగె

గీ॥ సత్త్వగుణలేశములచేత జగముఁగాచు
పురుషవర్యుండు నను నేఁడు ప్రోవఁ గలిగె
నెంత భాగ్యోత్తరుఁడనో కో యేను కమల
నాభు సేవించి భక్తి యొనర్పఁ గలిగె.

వ॥ అని యివ్విధంబున విష్ణుభక్తియుక్తంబైన డెందంబు పర
మానందంబునం బొందఁ నరిగి యరిగి నందగోకులంబునకు
వచ్చె; నంత నాఁటిసాయంకాలసమయంబున రామకృష్ణులు
వల్లవకుమారసమేతులై పసులకదుపుల నెల్లను గోష్ఠంబు
నకుఁ దెచ్చి తమతమ వెరవులం గుదురుఁద్రోలి దుగ్ధదోహ
నంబునకు సమకట్టుచున్న యెడ.

సీ॥ అరుణారుణచ్ఛాయ లగు పాదములు నేల
నూఁది చక్కఁగ నిలుచున్నవాని

పరిమళించుచున్న విరితెల్లతామర
నెలమితో నవతంస మిడినవాని
గోధూళి పొదివిన కుండలంబులతోడ
నిందనీలచ్ఛాయ నెసఁగువానిఁ
వక్షంబునందు శ్రీవత్సచిహ్నము కేవ
బెడఁగుగా వనమాల నిడినవాని
పేరుకొని లేఁగటావులఁ బిలిచి పిలిచి
పిచ్చలించుచుఁ గ్రేపుల విడుచువాని
క్షీరకలశంబు నుఱుదాళ్ళఁ జేతఁబట్టి
యమరు గోపాలకృష్ణు నల్లంతఁ గాంచె.

వ॥ కాంచి దంతురీభూతపులకితశరీరుండై రథంబు డిగ్గి వినయసంభ్రమభక్తితాత్పర్యంబులు చిత్తంబునం బెనంగొన వచ్చి దామోదరునకు సాష్టాంగదండప్రణామంబు సేసిన భగవంతుండు వానిం దనశ్రీహస్తంబుల నెత్తి కౌఁగిటం జేర్చె. తదనంతరంబు గాందినీసుతుండు రౌహిణేయున కభివాదంబు సేసిన నతండును నట్ల గారవించి, కుశలం బడిగి, యర్ఘ్యపరికారంబుల మన్నించి యాత్మీయమందిరాంగణంబున నొక్కరమ్యప్రదేశంబున నమ్మువ్వురుం గూర్చుండి యిష్టసల్లాపంబులు సేయుచుండి తగుతెఱంగున మజ్జనభోజనంబులు దీర్చి పథశ్రాంతివలననైన బడలిక తమ కరుణామృతసేచనంబుల నపనయించి యతనితోడ మను

రాపురంబునఁ బుట్టిన విశేషంబు లడుగుటయుఁ జక్రిధరు నకు నక్రూరుం డిట్లనియె.

గీ॥ నీవు సర్వజ్ఞమూర్తివి నీకుఁ దెలివి
పడనియది యేమి యున్నది పద్మనాభ!
యయిన నావిన్నపం బెల్ల నాదరించి
వినుము నీచిత్త మటఁబొందఁ దిపనులు నముప.

వ॥ అని పలికి, కంసుండు నారదప్రచోదితుండై యాదవసభా మధ్యంబున దేవకీవసుదేవుల నుదాసీనంబులాడుటయుఁ, బితృగౌరవంబు విచారింపక యుగ్రసేను నిగళప్రాప్తునిం జేసి కారాగృహంబున నునుచుటయును, దనతోడ బంధు ద్రోహంబుసేయ విచారించుటయు, నప్పురాత్ముని మర్మం బ్రింబున నుపాయనంబులు గొని ధనుర్యజ్ఞవ్యాజంబున నందాదిగోపకులతోడఁ దమ్ముఁ బిలువవచ్చుటయును విన్న వించిన నాప్రపంచవేది యాతని కిట్లనియె.

క॥ నీ విపుడు నాకుఁ జెప్పిన
యీ వచనములెల్ల నేను నెఱుఁగుదు నక్రూ
రా! వినుము కంసు నసువులు
లే వని యుండుదువుగాని లెక్కింపకుమీ.

గీ॥ నీవు మెచ్చంగ నెల్లుండి నేను గంసు
ప్రాణములు గొని యాదవప్రతతులెల్ల

నుల్లసిల్లంగ భూమికి నుగ్రసేనుఁ
బట్టభద్రునిఁ జేసెదఁ బ్రాభవమున.

వ॥ ఎల్లి ప్రభాతకాలంబున నిందుఁగల నేతులును బాలును గావళ్ళ నమర్చికొని వల్లవులతోడ నెల్లవిధంబుల సంబరంబు మెఱయ నేనును నీవును రాముండును గొల్లలలోని పెద్దలునుగూడి మథురకు వెడలుదము." అని పలికి యా రాత్రి నందునిమందిరంబునన యందఱు వసియించి మఱునాఁడు ప్రభాతసమయంబునఁ గాలోచితకృత్యంబులు దీర్చి, దధిక్షీరాజ్యాద్యుపాయనంబులతోడం దగువారి ముందర ననిపి, యక్రూరుండు సారథిగా బలభద్రసహితంబుగా రథారోహణంబుఁజేసి వెడలి క్రమంబుగ మధ్యాహ్నంబునకుఁ గాళిందిం దరిసి యచ్చట మాధ్యాహ్నికాదులగు కృత్యంబులు జరిపి యచ్చోటు గదలి చని సాయాహ్నకాలంబునకు మధురాపురంబున కరిగిరి. అప్పుడు సీరిచక్రుల కక్రూరుం డిట్లనియె.

ఆ॥ వె॥ అరదమెక్కి మీర లరుగుదెంచినఁ గంసుఁ
డలిగి నన్ను నేమియైనఁ బలుకు
గానఁ బాదచారులై నడతెండు మీ
యుపదలెల్లఁ గొనుచు నిపుడ పురికి.

వ॥ మరియు మీరు దేవకీవసుదేవులం బొడఁగనుటకై తదీయ నివాసంబునకుం బోయిన మీమీఁది విరోధంబున నావృద్ధ

దంపతుల కగ్రుఁరాత్ముండైన కంసుం డుపద్రవంబు సేయం దలంచుఁగావున నవ్విధంబు పరిహరించునది, యని నిర్దేశించి యామంత్రితుండై కంసుపాలికిం జని తనపోయిన వృత్తాంతంబును రామదామోదరానుగమనంబునుం జెప్పి నిజనివాసంబునకుం జనియె నంత.

ఉ॥ గోపకుమారకుల్ బలిసి
కొల్వఁగఁ గృష్ణుఁడు సీరపాణితో
నాపురి రాజమార్గమున
నంచితమోహనదివ్యమూర్తియై
యేపున మత్తదంతిగతి
నేగుచునుండెను భక్తిసంభ్రమ
స్థాపితచిత్తులై నిలిచి
సర్వజనంబులుఁ జేరి చూడఁగన్.

వ॥ అట్లు చనుదెంచుచున్న సమయంబునన నొక చాకివాఁడు మడుగుపుట్టంబులను గొని కంసుని నగరికిం బోవుచుండ దామోదరుండు వానిం బిలిచి, యందుఁ గొన్ని వస్త్రంబులం దనకుఁ గట్టనిమ్మనుటయు నీచుండగు నారజకుండు మురవైరిని నిరసించి పలికె. అన్నగధరుండు నాగ్రహించి పటుతరముష్టిఘాతంబున వానిశిరంబు వగులంగొట్టి వాని చాకి మూటంబట్టి విప్పి.

గీ॥ సీరపాణికి వందులో జిలుఁగు వన్నె
పట్టుపచ్చడ మొక్కటి గట్టి నిచ్చి
పసిఁడిచెఱఁగుల పచ్చనిపచ్చడంబు
తాను ధరియించెఁ గృష్ణుఁ డుద్దండమునను.

వ॥ తక్కిన వస్త్రంబులన్నియు వల్లవకుమారుల కొసంగి పుష్పలావికగృహంబునకుం బోయి తమకు మునువందగిన సురభికుసుమనికరంబు లడిగిన వాఁడు భయభక్తితాత్పర్యంబులతోడ మోఁకరించి కరంబులు నేలనూది నమస్కరించి పరిమళమిళితంబులైన పూవుదండ లొసంగిన పుండరీకాక్షుండు వానికిఁ గులాభివృద్ధియు మోక్షంబును గలుగు వరంబు లిచ్చి యందుండి కదలిపోవుచు, మార్గంబున నొక్కయెడ నొక కుబ్జకాంతం గనుంగొని చందనం బడుగుటయు నయ్యిందువదన ముకుందునిసౌందర్యంబుమెచ్చి తనకోరలోని ఘనసారగంధంబు వానికి వలసినంత యొసంగె.

క॥ తనువున నెఱపూఁతలుగా
నొనరఁగ గందంబు పూయుచుండి వినోదం
బున సల్లాపములాడుచు
వనజాక్షుఁడు కుబ్జకాంత వరచుబుకంబున్.

తే॥ తనకరాంగుళములఁ బట్టి దానిపాద
యుగముపై నిజచరణంబు లొక్కరఁ బెట్టి

నిక్కుc దిగిచి విక్షేపణ మక్కజముగc
జేయుటయు మోహనాకృతిc జెలcగెc దరుణి.

వ. ఇట్లు కుబ్జ ననుగ్రహించి యచ్యుతుండు వెడలి బలభద్ర ప్రముఖులతోడ రాజద్వారంబుc బ్రవేశించి ధనుశ్శాల లోని కరిగి యచ్చట గంధపుష్పంబుల నలంకృతంబైన కంసుని ధనువుం గనుంగొని యమ్మహోత్సవంబుc జూచు వారిచేత ధనుర్మాహాత్మ్యంబు విని దానిమోపెట్టినంత నయ్యది తునియ లయ్యె. అప్పు డాయుధాగారరక్షకులు కోపారుణితనేత్రులై యప్పద్మనేత్రునిపైc బడ నతండు వారల నెల్లర సమయించి లోకభయంకరంబుగ సింహనాదంబొనరించె. అంత హతశేషులు పరుగున జని కంసున కచ్చటి వృత్తాంతంబంతయు నివేదింప నతండు కోపవివశుండగుచు రామదామోదరులం గూల్పc జాణూరముష్టికుల నియోగించుచు వారల కిట్లనియె.

క॥ ఎల్లి ప్రభాతంబున మీ
మల్లురతోc గూడి రంగమధ్యంబున మీ
రెల్లవిధంబులc జంపుడు
గొల్లపడుచులను నియుద్ధకుశలత మెఱయన్.

వ॥ మఱియుc గువలయాపీడం బను గంధసింధురంబు మావంతునిచేతం బ్రచోదితంబై రంగద్వారంబున నిలిచి బలభద్ర కృష్ణులు వచ్చినప్పు డదియె వధియింపcగలయది. సమస్త

సైన్యంబులుఁ గట్టాయితంబై బలిసి నగరివాకిటికి వచ్చునది యని నియమించె. అమ్మఱునాడు ప్రభాతసమయంబున భోజరాజు.

ఉ॥ తమ్ములు బంధుమిత్రులును
దాను నమాత్యచయంబు రాజలో
కమ్మును బౌరులుంగొలువఁ
గంసుఁడు రంగసమీపతుంగమం
చమ్మున నెక్కియుండెను వి
శాలసమున్నతభర్మరమ్య హ
ర్మ్యమ్ములనుండి చూడఁగఁ బు
రాంగనలున్ మఱి రాజపత్నులున్.

వ॥ మఱియు వసుదేవాక్రూరాదియాదవులును నందాది గోపకులును మొదలుగా సమస్తజనంబులును నన్యో ప్రదేశంబులఁ జూచుచుండిరి. మల్లయుద్ధసన్నద్ధులై చాణూరముష్టికులు రంగమధ్యంబు ప్రవేశించిరి. కువల యాపీడగజంబుతోడ మావంతుండు వచ్చి రంగద్వారం బున నోలసియుండె. అప్పుడు రాజానుమతంబున బలిసి బలభద్రదామోదరులు గోపాలకుమారులతోఁగూడ వచ్చి రంత నామల్లరంగంబునఁ గంసునానతిమై నారాయ ణునిఁ జాణూరుండును రాముని ముష్టికుండును దలఁపడ

నిశ్చయించిరి. కువలయాపీడంబును బలకృష్ణులచేఁబడ
జాడుట.

ఉ॥ పొంగుచు నైపుణంబులును
భూరిబలంబులు నివ్వటిల్ల మా
తంగవిషాణముల్ వెఱికి
తత్క్షణమాత్రన దానిఁ జంపి పో
త్తుంగతదీయదంతములు
దోలనమర్చినఁ జూడనొప్పి
చెంగటఁ గాలదండములు
చేకొనియున్న యమద్వయంబనన్.

వ॥ ఇట్లు విజృంభించి రంగమధ్యంబున నిలిచి చాణూరముష్టి
కులతోడం దలపడి భద్రమూర్తులైన కృష్ణబలభద్రులు
పెద్దయుంబ్రొద్దు పోరి పరిమార్చి వారలకళేబరంబుల
రంగప్రదేశంబున నీడ్చుచుండఁ గంసుండు కోపరక్తలోచ
నుండై యమాత్యులం జూచి కోపాలాపంబులు వల్కు
చుండ.

మ॥ లలిమీరన్ హరి కంసుమంచమునకున్
లంఘించి యుమ్మెటియు
జ్జ్వలమాణిక్యకిరీటమూర్ధరహయిం
జారన్ శిరోజాతముల్
బలిమిం బట్టి వెసంబడం దిగిచి లీ
లన్ వక్షముఁ మస్తముఁ
నలియం బెట్టఁగఁ గుప్పిగంతుగొని వి
న్నాణంబు గావించినన్.

వ॥ ఇట్లు విచిత్రంబుగా సకలలోకవిధ్వంసుండైన కంసుండు ప్రాణపరిత్యాగంబు చేసె, నప్పుడు.

క॥ కురిసెం బువ్వులవానలు
మొరసెన్ సురదుందుభులు సముజ్జ్వలమహిమన్
బెరసెం గంధర్వనుతుల్
సరసన్ వినువీధియందు సంభ్రమములతోన్.

ఆ॥ వె॥ అంత రామకృష్ణు లవ్వసుదేవదే
వకులకడకు వచ్చి వారిపాద
పంకజాతములకుఁ బ్రణమిల్లుటయు వేడ్కఁ
గౌఁగిలించి హర్షకలితు లగుచు.

వ॥ రామకృష్ణుల నుతించి గారవించిరి. పిమ్మట దామోదరుండు కారాగృహంబున నిగళబద్ధుండైయున్న యుగ్రసేనుని విడిపించి తదీయరాజ్యంబున కభిషిక్తునింజేసి యతని చేతఁ గంసునికిఁ బరలోకక్రియలు సేయించి యత్యంత కృపాతరంగితలోచనుండై యతని సింహాసనాసీనుం జేసి సమస్తరాజలోకంబును గనిపించి యిట్లనియె.

ఉ॥ ఈ యదువృష్ణిపుంగవులు
నేనును రాముఁడు నెల్లవారలున్
బాయక నిన్నుఁ గొల్చి నిర
పాయత నుండెద మింక నెన్నఁడున్

మాయెడ శంకయున్ భయము
మాని పనుల్ గొను మీజగంబు ని
త్యాయతబాహుశౌర్యగత
మై విలసిల్లుచు నుండఁ జేసెదన్.

వ॥ మఱియు నారాయణుండు వాయుదేవుం బనిచి మహేంద్రుని సుధర్మాసనం బడిగి తెప్పించి యుగ్రసేనున కిచ్చుటయు.

క॥ అమ్మహనీయసభామ
ధ్యమ్మున యాదవులు గొలువ హరిప్రాపున లో
కమ్ములర నుగ్రసేనుం
డమ్మధురానగర మేలె నతులవిభూతిన్.

శృంగార నైషధము.

8 రాయంచరాయబారము.

[శ్రీనాథుఁడు:- పాకనాటి నియోగిబ్రాహ్మణుఁడు. రెడ్డిరాజులయాస్థానకవీశ్వరుఁడు. 1400 సం॥ ప్రాంతమువాఁడు. ఇతఁడు శృంగారనైషధము, కాశీఖండము మొదలైన పెక్కుగ్రంథములను రచించెను.]

వ॥ నిషధరాజ్యంబున కధిపతియైన నలుం డొక్కనాఁడు పురోపవనంబున విహారంబు గావించుచుఁ దన్మధ్యస్థంబగు నొక్కసుందర కాసారంబును సమీపించె. ఆ కాసారంబు తిమితిమిం

గిలఢుళీకుళీరమత్స్యకచ్ఛపమకరనికరసంచారంబులచేవ్యాకులంబై యుయ్యాలలంబోలె నూగులాడుకెరటాలతో నొప్పియుండె. రాయంచలు బారులు దీర్చి యక్కెరటాల యుయ్యాలలెక్కి పెక్కుభంగుల వినోదంపు టాటలాడుకొనుచుఁ గూయుచుండెను. ఇంతయుఁ జూచి తత్తటాకవైభవంబును నలుం డంతరంగమునం గొనియాడుచుఁ దత్తీరప్రదేశంబున నిబిడనిద్రాభిముద్రితనేత్రమైన మఱియొక రాజహంసమును గాంచె. అక్కలహంస జంబాలంబులేని పులినభాగంబున నాతపత్రాకృతినున్న యొక్క కమలంబు నీడను దరంగమారుతములచేఁ జిగురుఱెక్కలఱేకు లెగురుచుండ, నొంటికాల నెనిల్చి పొడవగు పొందమ్మిపూవుంబోలె వరుణరాజున కిడిన చామరంబుగతిఁ దోఁచుచుండెను.

క॥ కాంచనపక్షంబగు రా
యంచం గనుఁగొని నృపాలుఁ డనురాగముతో
వంచించి పట్టుకొని మొద
నంచుఁ దలఁచె దైవఘటన కనుకూలముగాఁ॥

సీ॥ వామనుండైన కైటభవైరివిధము
నభినయించుక్రమంబున నధిపసుతుఁడు
నడఁకి నడఁకి యల్లల్లన నడిచిపట్టెఁ
బాణిపద్మద్వయంబునఁ బసిడియంచ.

వ॥ ఇట్లు నిషధరాజుచేతం బట్టువడి, బిట్టుమేల్కాంచి యక్కాంచనహంసంబుకంచుగీసిన తెఱంగున నెలుంగించుచు, నెగయ నుంకించుచుం, జంచుపుటంబున వానిపాణిపల్లవంబులు గఱచుచుం, జరణంబులు గింజుకొనుచు, నఖంబుల నొత్తుచు, నలుదిక్కులుం జూచుచు, నెద్దియుం జేయునది లేక చీకాకుపడుచుండ నప్పాటన సంభ్రమసముత్పతత్పతగకులంబై కమలషండంబు గలగుండువడియె. కూలంబులం గులాయంబులనుండి పుండరీకవనలక్ష్మీచరణనూపురక్రేంకారంబుల ననుకరించుచుం గారండవబకక్రౌంచరథాంగకోయష్టికాదులు విహాయసంబున కెగసి కూయం దొడంగె; నప్పుడు తనఱెక్కలంగల ఖంగారంబునుం గాంచి యంతరంగమున మిక్కిలి యక్కజంపడు నృపపుంగవుంగాంచి యల్లన నారథాంగంబు మనుష్యభాషణంబుల నిట్లనియె.

క॥ ఱెక్కల కొనలం గలిగిన
యిక్కాంచనమానపడియెదే నృప ! నీ కే
యక్కఱ దీనం దీఱెడు
నక్కట ! నీహారలేశ మబ్ధికిం బోలెన్.

చ॥ ఎఱుఁగనె నీవు ప్రాంతమున
నింతట నంతట యున్కి యింత యే

మఱుదునె? నిన్ను విశ్వజన
మాన్యుఁడ వంచెద విశ్వసించి యి
త్తఱిసుఖనిద్రఁ బొందితి వృ
థామతి, నట్టన యాత్మ నమ్మినం
జెఱుపఁ దలంతురే ఘనులు
చిత్తమునం బగవారి నేనియున్?
ఉ॥ హింసయ నీకు వేడ్కయగు
నేని గృపాశ్రయమైన యీ సరో
హంసముఁ జంపనేల? కల
వా తరువాత వసుంధరాధిపో
త్తంస! విజృంభమాణభుజ
దర్పనిరంకుశసాహసక్రియా
మాంసలచిత్తవృత్తులయి
మత్రిలియుండు నరాతిభూపతుల్.
వ॥ ఫలకుసుమమూలమాత్రంబున శరీరయాత్ర నడపుచు, మునులుంబోలె సలిలంబులలోనం దపంబు సేయుచున్న వారము. మామీఁద దండనీతిం బ్రయోగింప నీకుం దగునె? అదియునుంగాక.
సీ॥ తల్లి మదేకపుత్రిక, పెద్ద, కన్నులు
గాన విప్పడు, మూఁడుకాళ్లముసలి
యిల్లాలు గడుసాధ్వి యేమియు నెఱుఁగదు
పరమపాతివ్రత్యభవ్యచరిత

వెనుకముందర లేరు నెనరైన చుట్టాలు
లేవడి యెంతేని జీవనంబు
గానక కన్నసంతానంబు శిశువులు
జీవనస్థితి కేన తావలంబు
గీ॥ కృపఁదలంపఁగదయ్య యో నృపవరేణ్య!
యభయమీవయ్య యోతుహినాంశువంశ!
కావఁగదవయ్య యర్థార్థికల్పశాఖ!
నిగ్రహింపకుమయ్య యో నిషధరాజ!

వ. "అక్కటక్కటా! దైవంబ! నీకంటికిం బేలగింజయుం బెద్ద యయ్యనే? జననీ! ముదిసిముప్పఁగాలంబున సుతశోక సాగరం బెబ్భంగి నీఁదఁగలదానవు? ప్రాణేశ్వరీ! యేచందంబున మద్విరహవేదనాదవానలంబునం దరికొనియెదవు? సఖులారా! యేప్రకారంబునఁ బుటపాకప్రతీకాశంబైన కరుణరసంబున బురపురం బోక్కెదరు? బిడ్డలారా! యేలాగున నతిక్షుత్పిపాసాకులంబులై కులాయకూలంబులం గులగులం గూసెద" రని విలాపంబు సేయుచుఁ దృగ్గోశకంబుల వేడికన్నీరువెడల గోలుగోలున నేడ్చినం గృపాళుండై యాభూపాలుండు హస్తపల్లవంబులు వదలి "రాజహంసంబ! పొమ్ము! సుఖం బుండు"మని విడిచి పుచ్చె. అనంతరంబ.

గీ॥ అట్లు పురుషోత్తముండైన యతని వలన
ముక్తిఁగాంచిన యాద్విజముఖ్యుఁ డెలమి
డెందమునకును వాక్కునకందరాని
యధికతరమైన యానంద మనుభవించె.

క॥ చుట్టంబులుఁ జెలులుం దన
చుట్టుఁ దిరిగియుండ ముదము సొంపెసలారన్
నెట్టెపడి వచ్చి క్రిమ్మఱఁ
బుట్టిన చందమున హంసము దటాకములోన్॥

వ॥ నలునిచేదోయి యొత్తునంజేసి నెత్తురులైన యవయవం
బులు నోర సవరించుకొనుచుఁ, దనమేని దుర్వికారంబు
నకుఁ బులుఁగుచుట్టాలెల్ల మిక్కిలి వగచుచుండఁ, దరం
గడోలికల నుయ్యాలలూగి, తియ్యని తమ్మిపూఁదేనెలం
గ్రోలి, కొంతతడవు క్రీడించి, యానీడజంబు క్రమ్మఱ
నిషధరాజహస్తంబునకు నరుదెంచె. అంత నాభూభు
జుండును భుజంబుసాచి యమ్మానసౌకంబును మన్నించి
యిముడ్చికొనియుండ నయ్యది మృదుభాషణంబుల నిట్లని
యె. 'దేవా! అవధరింపుము. నీకుం బట్టువడిన నన్ను
విడిచిపెట్టి ప్రాణంబు రక్షించి మహోపకారంబుఁ గావించి
తివి. ఉపకారికిఁ బ్రియంబు సేయుదు నని యనరే.
అయినను నీకు నొక్క ప్రియంబు సేసెద. అయాచిత
లభ్యంబైన హితంబు పరిహరింపం బనిలేదు. నిఖిలభువన
నాయకుండవైన నీకు మముఁబోంట్లు సేయు నుపకారం
బపేక్షణీయంబు గాదనియు నెఱుంగుదు. అయినను గృత
జ్ఞతాగుణలేశంబు నన్నుఁ గ్లేశపఱచుచున్నయది. సన్నంబు
దొడ్డ యను విశేషంబు విచారింపక నాచేయు ప్రయోజ
నం బంగీకరింపుము.

సీ॥ ప్రత్యర్థిసార్థసార్థక నామధేయుండు
భూమీశ్వరుం డొప్పు భీముఁ డనఁగ
నారాజు త్రిదివంబు నమరేంద్రుఁడును బోలెఁ
దేజంబున విదర్భదేశ మేలు

దమనాహ్వాయుం డను తపసిసద్వరమునఁ
గాంచె నాతఁడు కన్యకాలలామ
సర్వలోకాంగనాసౌభాగ్యగరిమంబు
దమియించుకతమున దానినామ
మభ్రిభారతి దమయంతి యనుచు నొడివెఁ
దద్గుణంబులు వర్ణింప ధరణినాథ!
యబ్జసూతికి నైన శక్యంబు గాదు
పలుకుఁబూఁబోడి కైనను నలవిగాదు.

వ॥ ఏను బ్రితివాసరంబును నానానదీనదకాంతారభూధర ప్రాంతంబుల సంచరించుచు నొక్కనాఁడు విదర్భదేశంబు నకుం బోయి, యందు శరత్సంపూర్ణచంద్రాస్యయైన దమయంతిం గాంచితి. కాంచి, విబుధపురంధ్రీరామ ణీయకం బీరమణీరత్నంబుముందట నిస్సారంబు సొమ్మని యు; విధాతచిత్తంబున నీమత్తకాశినికిం దగిన యుత్త ముఁడగు వరుం డెవ్వండు గలిగియున్నవాఁడొకో యనియు; చింతించుచుఁ గొంతతడవు నివ్వెఱపడి చూచుచుండితి. అనంతరంబ యనురూపలావణ్యరేఖాసంపన్నుండైన పిన్న వయసు రాకొమరు నవలోకింతు నని, లోకాలోకపర్యం తంబుగా నీలోకంబు విశ్వంబునుం బరిభ్రమించి, యుర్వీ శ్వరకుమారులనెల్లం బూర్వపక్షంబు గావించుచు వచ్చి వచ్చి, యిచ్చోట నిన్నుం గనుంగొని సిద్ధాంతీకరించితి. కావున,

గీ॥ సౌరభము లేని యట్టి పుష్పంబువోలె
గండుఁగోయిల వెలియైన కానవోలె
నధిప! దమయంతితోడి సఖ్యంబు లేని
నీదు సౌందర్యవిభవంబు నిష్ఫలంబు.

వ॥ కావున నిఖిలవైమానికనికాయకామ్యమానయైనయమ్మా నవతికి నిన్నుం గూర్ప నాకు నేర్పు గలదు. అక్కొమ్మ నెమ్మనంబున నిన్నుం దక్కఁ దక్కొరుం బరిగ్రహింపకుండునట్లుగా భవద్గుణంబు ప్రశంసించెద. నన్నుం బనిగొమ్ము. లెమ్ము. కార్యంబున నార్యులు నిజప్రయోజనంబు నెఱింగింతురు గాని మాటలం బ్రకటింప రని పరిస్ఫుటంబుగాఁ బలికిన విని భూవల్లభుండు తదీయవాక్సుధాధారఁ గ్రోలి మందస్మితసుందరవదనారవిందుం డగుచుఁ గరారవిందంబున నప్పతంగపుంగవునంగంబు నివురుచు దమయంతీగుణబద్ధచేతస్కుండై యానీడోద్భవంబును విదర్భాపురంబునకుం బుచ్చె.

కాశీఖండము.

9 గుణనిధి వృత్తాంతము

1 వ భాగము.

[శ్రీ భక్త శృంగారనైషధకర్తయగు శ్రీనాథమహాకవి]

వ॥ కాంపిల్యపురంబున వేదవేదాంగవేదార్థవిదుండును యజ్ఞవిద్యావిశారదుండును నగు యజ్ఞదత్తుండను నొక భూసురోత్తముం డుండెను.

గీ॥ అతనిపుత్త్రుండు గుణనిధి యనెడువాఁడు
దర్పకునితోడిజోడు సౌందర్యరేఖ
నెయ్య మలరంగ గురు లుపనీతుఁ జేసి
చదువఁ బెట్టిరి వాని నాచార్యునొద్ద.

వ॥ కాని యతండు లేశమును విద్యాసక్తి లేక దుర్వినీతుఁడై ద్యూతక్రీడారతుఁడై కులాచారంబు లెల్ల విడిచి దుష్టులం గూడి, యుదయసాయంసమయంబులు వీట నెల్లెడఁ దిరుగుచుండెను. గుణనిధి సార్థకనాముండు గాక దుర్గుణనిధియై బ్రాహ్మణాచారములను బరిహాసకము చేయుచు, నగ్నిహోత్రవిధానములన్న నలుగుచు, సంధ్యావందనం బన్న నేవగించుచు, ద్యూతకారులను, బాషండులను నాస్తికు

లను, నటులను, విటులను గూడి సురాపానమత్తుండై గీతవాద్యవినోదంబులఁ బ్రొద్దు పుచ్చుచుండెను. తఱుచు జూదంబుల నోటువడుచు జూదగాండ్రచే బాధింపఁబడుచు దల్లిమేనిరవణమ్ముల నమ్మి వారికిఁ బెట్టుచుండును. "తండ్రీ! ఇట్టి దుర్వర్తనంబులును దుస్సహవాసంబులుం బాసి, సద్వర్తనంబును సత్సహవాసంబును బూనియుండు"మని ప్రతిదినంబును దల్లి వానిచెవినిల్లుగట్టుకొని పోరుచుండును. యజ్ఞదత్తుండు గృహకార్యాంతరవ్యగ్రుండై కొడుకువర్తనంబు పరామర్శింపకయుండెను. ఇట్లు దినంబులు గడచుచుండ.

గీ॥ ఎడపఁ దడపఁ దనూభవుం డెచట నుండుఁ
గానరాఁ డని గృహభర్త కాంత నడుగ
నింత దడవును నాయొద్ద నిచట నుండి
యరిగెఁ జదువంగ నని భర్త కతివ పలుకు.

గీ॥ స్నానమాడెనె? వార్చెనె సంధ్య? యగ్ని
హోత్రమాచరించెనె? యింతి! పుత్రుఁ డనిన
స్నానమాడెను, వార్చెను సంధ్య, యగ్ని
హోత్రమాచరించె ననుచు నువిద వెలుఁగు.

ఆ॥ వె॥ గొడ్డుపోఁగి కన్నబిడ్డండు గావున
నొక్కరుండ కాన నుత్పలాక్షి
ధూర్తుఁడైన వాని దుశ్చేష్టితములెల్ల
నధిపు నెఱుఁగ నీక యడఁచుచుండు.

వ॥ మఱియుఁ జూడాకర్మానంతరంబున షోడశవర్షంబునఁ దల్లి దండ్రులు విధ్యుక్తప్రకారంబున వానిని వివాహితుం జేసిరి. వివాహితుండైన సుతుండు తన దుశ్శీలంబునుండి మఱలు నని తల్లి భ్రమపడి వానియం దెట్టి మార్పునుం గానక నిరంతరదురాచారసంపన్నుండగుచుండిన సహింపనేరక యొక్కనాఁడు వానింబట్టి కూర్చుండఁబెట్టి గట్టిగ నిట్లు లనియె.

గీ॥ అన్న! మీతండ్రి కోపగాఁడౌనొ కాఁడొ
యీవు నొనరించు దుర్వృత్తి మెఱఁగనేనిఁ
గల్లతనములు పలుమాఱు గప్పిపుచ్చు
నట్టి నామీఁదఁ జంపంగ నలుగకున్నె?

సీ॥ సచ్ఛ్రోత్రియులు ననూచానులు సోమపీ
థులునైన కులము పెద్దలఁ దలంచి
రాజమాన్యుఁడు సత్క్రతుఁడు వినిర్మలా
చారవంతుండైన జనకుఁ దలఁచి
భాగ్యసంపదయందుఁ బతిదేవతలతోన
నెన్నంగఁ దగియెడు నన్నుఁ దలఁచి
వేదశాస్త్రపురాణవిద్యానిరూఢులై
వాసికెక్కిన తోడివారిఁ దలఁచి

గీ॥ చెడ్డయింటి చెడారమై శివునికరుణ
నివ్వటిలు సర్వదేవేంద్ర నిన్నుఁ దలఁచి

పదియు నాఱ్వత్సరంబులభార్యఁ దలఁచి
గోరతనములు మానురా కొడుకుఁగుఱ్ఱ!

గీ॥ అఖిలకల్యాణగుణగణాయత్త యత్త
మామ యౌదార్యతేజఃక్షమాహితుండు
ధైర్యనిర్జితమందరాహార్య భార్య
తనయ! యేలయ్య కైకోవు వినయగరిమ.

చ॥ విడువక నీవు పట్టణము
వీథుల వీథుల వెఱ్ఱివాఁడవై
చెడుగులఁ గూడి ధౌర్త్యములు
సేయ మహీరమణుం డెఱింగినన్
విడుచునె సోమయాజి మను
వృత్తులు చేకొను నెల్లవంకలం
జెడుదుముగాదె నీకతనఁ
జీరయుఁ గూడును లేక పుత్రకా!

వ॥ అని యనేకప్రకారంబుల బోధించిన తల్లిమాటలు సెవుల సోఁకనీక యిట్టట్టనక యూరకుండె. మృగయామద్యపైశున్యవేశ్యాచౌర్యదురోదరపరదారాభిలాషంబు లను దోషంబులు నవయౌవనారంభంబుననె సంభవించెనేని వానిం దొలంగింప నెవ్వారు నేర్తురు? గురువచనం బతి నిర్మలంబయ్యు సలిలంబునుంబోలె చెవులంబడి దుర్జనునకు శూలపుట్టించును. అసాధ్యనామధేయుండగు దుర్గుణనిధి

యథాపూర్వంబు దుర్వర్తనంబులందిరుగుచుండ నొక్కనాఁడు యజ్ఞదత్తుండు కార్యాంతరంబునంబోయి వచ్చుచుండఁ దనరత్నాంగుళీయకం బొక్కజూదరివ్రేలనుండుట గాంచెను. ఆయుంగరంబొకానొక పుణ్యకాలంబున రాజుచే వానికి దానము సంగఁబడెను. ఆసోమయాజియుఁ దనధర్మగేహిని యైన సోమిదమ్మ కనురాగాతిశయంబున నొకనాఁడు దానిని గానుకగా నొసంగెను. జూదమాడి యోటువడి, యోటువడిన ధనం బిమ్మని జూదరులచేఁ జుట్టుకొనఁబడిన పట్టికి సోమిదమ్మ యమ్మణియుంగరం బిచ్చి వానిముప్పు దప్పించెను.

సోమయాజి యారతనంపుటుంగరంబును గనురెప్పవేయక చూచిచూచి తనసొమ్మౌటయెఱింగి, యాయక్షక్రీడారతుని సమీపించి వాని కేలువట్టియెత్తి యీ యంగుళీయకంబు నీకెట్టువచ్చె? ఉన్నరూపు సెప్పక తప్పఁజెప్పితివేని నిన్ను భూపాలుసన్నిధిం బెట్టి నిజంబు దెలిపి దండింపింతు ననిన జూదరి, 'నీతనయుండు గుణనిధి నెత్తంబున నోడిన విత్తంబునకై యీ యుంగరంబు నాకొసంగె. మఱియుం బెక్కుబంగారుభృంగారంబులు నాభరణంబులుఁ బళ్లెరంబులుఁ దామ్రపాత్రంబు లారకూటఘటంబు లెన్నేనియు దాకట్టు వెట్టియు దురోదరక్రీడాపరాయణుండై పట్టణంబునం జరియించుచున్నవాఁడు.

గీ॥ అక్షధూర్తులలోన నీయనుఁగుఁగొడుకు
దొరయు నంతటి యక్షధూర్తుండు లేఁడు
క్షితితలంబున యాగదీక్షితులలోనఁ
గీర్తి నీయట్టి యాగదీక్షితుఁడు లేఁడు॥

వ. అనిన విని లజ్జాక్రోధంబులు మనంబున ముప్పిరిగొన యజ్ఞదత్తుం డర్ధముండితం బైన మూర్ధంబున నీర్కావిదోవతినటి ముఱికిఁ జుట్టుకొని యింటి కేతెంచి, మొగంబు గంటువెట్టుకొని 'సోమిదమ్మా! యేమిసేయుచున్నదాన విటు రమ్మా. నీకొడుకు కెక్కడఁ బోయెనో? తోడ్తోఁ గాకేమి నారత్నాంగుళీయకంబు దెమ్మా. ఆయుంగరంబున శృంగారింపని చేతఁ బావకునకు హవిర్భాగంబు సేయఁజాల' ననిన సోమయాజికి సోమిదమ్మ యిట్లనియె.

సీ॥ మాధ్యాహ్నసంధ్యాసమాగమం బిది తీర్థ
మవధరింపుము సంధ్య యాచరింపు
మగ్నికార్యము దీర్పు మభవుఁ బూజింపుము
పంచమహాయజ్ఞపరుఁడ వగుము
మొగసాల నున్నారు జగతీసురవర్యులు
గ్రాసార్థులగుచుఁ బెక్కండ్రతిథులు
పక్వాన్నములు శాకపాకాదికంబులుఁ
జల్లవాఱిన యేని జవులుదప్పుఁ

గీ॥ బదిలముగ మందసమునందుఁ బరిణెలోన
నునిచి దాఁచినదాన మీయుంగరంబుఁ
దీవ దిప్పుడు పెట్టె శోధించి చూడ,
నారగించిన పిదప నే నధిప! తెత్తు.

వ॥ అనిన విని సోమయాజి యత్యాగ్రహంబు వహించి తత్తర పడుచు నీవు పుత్రవతివయ్యు సాధ్వివయ్యు నాయెడ నసత్యంబు లాడవచ్చునే? నీవు నీకొడుకుంగూర్చి నాతోఁ బెక్కు సూనృతంబులు వలుకుచుంటివి.

సీ॥ స్వాధ్యాయ మెన్నండుఁ జదువంగఁ బోకుండఁ
బోలునె? చదువంగఁబోయె ననుట
తెల్లవాఱిన నేటఁ దీర్థమాడకయుండ
ననురూపమే? తీర్థమాడె ననుట
సమయానుకూలత సంధ్యవార్వకయుండ
వైదగ్ధియే? సంధ్యవార్చె ననుట
తఱితోడ నగ్నిహోత్రము వేల్వకుండంగ
విజ్ఞానసరణియే? వేల్చె ననుట
కల్ల లాడంగ ఫల మేమి గలిగె నీకు?
మాటిమాటికి నేను నీమాట నమ్మి
యరసి రక్షింపనేరక యనుఁగుఁగొడుకు
భ్రష్టుఁ జేసితి నేమి చెప్పంగఁ గలను?

వ॥ ఆభరణాదికంబు లైన మనయింటి యమూల్యవస్తువ్రాతంబు లెల్ల జూదరులకును వేశ్యలకుం జిక్కె. నిర్భాగ్యురాలా! గృహంబెల్ల నీవును నీకొడుకును బాడు చేసితిరి.

గీ॥ చాలు నింక నాపాలికిఁ జచ్చినాఁడు
కొడుకు గుణనిధి యనువాఁడు కులవిషంబు
తిలలు దర్భయు నుదకంబుఁ దెత్తుగాక
యే నివాపాంజలుల వాని కిత్తు నిపుడు.

వ॥ కుపుత్త్రిత్వంబుకంటె నపుత్త్రిత్వంబు మేలు. కులపాంసనుండైన వీని నొక్కనిం ద్యజించి కులంబు రక్షించుట నీతిదాయక' మని పలికి, కోపావేశంబునఁ బెదవు లదరఁ గటతటంబులు గదల భ్రూకుటి నిటలంబున నటింపఁ గటాక్షంబులఁ గెంపుగదురఁ గటకటంబడుచు, నాహ్నికంబైన క్రియాకలాపంబు నిర్వర్తించి, యాగ్రహంబు కృతార్థత్వంబు నొందఁ గొన్నిదినంబులకు నొక్క శ్రోత్రియుని పుత్త్రిం బెండ్లియాడి యజ్ఞదత్తుండు గృహస్థధర్మంబు నిర్వర్తించుచుండె.

10 గుణనిధి వృత్తాంతము

2 వ భాగము.

వ॥ అంతకుమున్న గుణనిధి తండ్రికోపం బెఱింగి యింటికిం బోవక యెక్కడేనియుం జనువాఁడ నని యూహించి, గతంబంతయు భావించి యిట్లు వితర్కించె.

గీ॥ ఏమిసేయుదు నెక్కడి కేగువాఁడ
ధనము నిప్పచ్చరంబు విద్యయు హుళక్కి;
పెట్టసాగదు నాచేయి భిక్షసేయ
నెట్లు నేరుచు దైవంబ యెఱుఁగు నింక.

గీ॥ ఏభయంబును నెచ్చోట నెనయ లేదు
నరున కెప్పాట విద్యాధనంబ ధనము
చోరబాధాదికముల చేఁ జూఱవోవు
ధనము ధనమౌనె యెన్నిచందములఁ దలఁప.

గీ॥ అక్కటకట! దురోదరవ్యసన మెట్లు?
యాయజూకవిశిష్టాన్వవాయ మెట్లు?
యెట్లుచేసినఁ జేయుఁగా కేమనంగ
నేర్చువారము విధి దయానిస్వహృదయు.

చ॥ అరుణగభస్తిబింబ ముద
యాద్రిపయిం బొడతేర గిన్నెలోఁ

బెరుగును వంటకంబు వడ
పిండెలుతుం గుడువంగఁ బెట్టి ని
ర్భరకరుణాధురీణ యగు
ప్రాణము ప్రాణము తల్లి యున్నదే?
హరహర యెవ్వరింకఁ గడు
పారసి పెట్టెద రీప్సితాన్నముల్.

వ॥ ఇట్లు పెక్కుతెఱంగుల నంతరంగం బుమ్మలింప నెందేని యుఱి బోవుచు నిశాసమయం బగుటయు గుణనిధి తన్నుఁ గార్చిచ్చునుంబోలెఁ బేరాఁకలి పేర్చి యందంద కడుపు మండించుచు బాధింప వంటకం బెక్కడఁ గలుగునో యని చింతాక్రాంతుండై యున్న యవసరంబున నద్దినంబు రాత్రి శివరాత్రి యగుటం జేసి, శైవుం డొక్కరుండు నగర బాహ్యప్రదేశంబున నొక్క శివలింగస్థానంబున జాగరంబు సేసి నాలుగుజాలు నుపహారంబు సమర్పించువాఁడై నియమవ్రతంబుఁ బూని భక్తివిశ్వాసతాత్పర్యాతిశయంబున శాకపాకంబులు భక్ష్యభోజ్యలేహ్యపానీయంబులు దధ్యాజ్యపానకఫలరసాదికంబులు సకలమధురపదార్థసమృద్ధి వెలయఁ గొనివచ్చి యుంచిన నప్పుడు భూసురవరుండు నిజనాసికాపుటంబు దదీయపక్వాన్నగంధంబుల గాలివెరవున నాఘ్రాణించి, యాయన్నంబు నాకుఁ గుడువ నెబ్బంగి సమకూఱునో యని యప్పరిమళంబు సవపట్టుకొని పోయి

శంభుభవనద్వారంబునం గూర్చుండి నృత్తగీతవాద్యం
బులు ప్రవర్తిల్లుచుండఁ జాముప్రొద్దువోవునందాక జాగరంబు
సేసి యంతంత సాగి ప్రజలు మాటుమడంగి యుండఁ
దా నయ్యవసరంబున.

సీ॥ కట్టాయితంబుగాఁ గటిమండలమ్మునఁ
దీర్చి దట్టీచేలదిండు గట్టి
తలుపు గిట్టనకుండఁ దరిమి కొంచెంబైన
యోరవాకిట దేహ మొయ్యఁ జొనిపి
మునివ్రేళ్ల లొయ్యొయ్య మోపి చప్పుడుగాని
పరిపాటి పవనంబు బట్టి నడచి
దీపాంకురచ్ఛాయఁ దెలివిసాలని యట్టి
కోనచీఁకటిని లోని కోనరఁ జొచ్చి
పళ్లెరములందుఁ బూపసూపములతోడ
ననఁటిపండులతోడ నాజ్యంబుతోడ
దధిపయఃక్షౌద్రబహుపదార్థములతోడ
ధవళకలమాన్న మీక్షించె ధరణిసురుఁడు.

వ॥ అప్పుడు గర్భమంటపంబున దీపికాకలిక గాలివశంబున
నిర్వాణదశ వహింప దాని నెగఁద్రోసి బ్రాహ్మణుం డా
యన్నంబు నీక్షింపం దలంచి, గుటక్కుట్లు మ్రింగుచు నొక్క
మహాన్నకుంభంబునుం జూచి, మందరశ్మియైయున్న దీపాం
కూరంబు నెగఁద్రోసి యుందింత నేయివోసి తన యేక

వస్త్రాంచలంబును జించి యొక్కవత్తిం జేసి ఘృతంబున
ముంచి కూర్చి దీపకాంతి నధికంబుఁ గావించి.

సీ॥ పక్వాన్నపాత్రంబుఁ బాణిఁ గైకొని బహి
ర్ద్వారభూమి భుజించువాంఛ నతఁడు
వెల్వడివచ్చుచో విధివశంబున వాని
కాలివ్రేలొకనియంగంబుఁ దాకె
దాఁకిన వాఁడు తత్తరపాటుతో మేలు
కని మ్రుచ్చు మ్రుచ్చంచుఁ గళవళించెఁ
గళవళింపఁగ దారగతికమార్గంబున
నాక్రోశ మొనరించి రఖిలజనులు

గీ॥ నన్నపాత్రంబు విడువక యవనిసురుఁడు
పాఱె భయవిహ్వలుండయి బయలువట్టి
వెంటఁ దవిలి తలారులు వెగడు పడఁగ
బాణముల నేసి చంపి రా బ్రహ్మకులుని.

గీ॥ అతనిఁ గొనిపోవఁ బనిఁబూని యమునిభటులు
వరుణపాశాగ్రహస్తులై వచ్చి రపుడు
వాని గొనిపోవఁ బనిఁబూని వచ్చి రపుడు
త్ర్యంబకుని కింకరులు విమానంబుఁ గొనుచు.

వ॥ అనంతరము నానావిధప్రహరణపాణులగు పినాకపాణి
భటులం జూచి భీతచిత్తులై కృతాంతకింకరులు కరపంక
జంబులు మొగిడ్చి యిట్లనిరి.

గీ॥ అభవుకింకరులార! మహాత్ములార!
తగవు ధర్మంబు పాడి పంతంబు దెలియ
మీకు నడ్డంబు గలదె ముల్లోకములను
నెంతవారము మేము మీయెదుర నిలువ.

వ॥ వీఁడు కులాచారహీనుండు. పితృవాక్యపరాఙ్ముఖుండు. సత్యశౌచపరిభ్రష్టుండు. సంధ్యాస్నానవివర్జితుండు. శివనిర్మాల్యహర్త. వీనియం దొకధర్మంబు లేశంబు గలిగిన నానతిండు వినియెదము. వీని పుణ్యాపుణ్యవివేకంబునకు మీరె ప్రమాణం బనినఁ గృతాంతకింకరులవాక్యంబు లాకర్ణించి శివకింకరు లిట్లనిరి.

సీ॥ అశన మబ్బకయున్నసైనను శివరాత్రి
యోరంతప్రొద్దును నుపవసించె
నోగిరంబు హరింప నోనవెట్టుకొనిమైన
వేఁగునంతకుఁ జేసె జాగరంబు
పాత్రావలోకనోపాయంబునకు నైన
వెల్లసైన దీపంబు వెలుఁగఁ జేసె
జూడనొల్లక మైనఁ జూచె నీశ్వరుమహాళిఁ
బరులు చేసినయట్టి ప్రసవపూజ

గీ॥ చచ్చె విధిమూడియైనను జంద్రధరుని
నగరి తొంగిసాలఁ బెంద్రోవ నట్టనడుమ

సూక్ష్మదృష్టి విచారించి చూచినప్పు
డింతకంటె సుధర్మంబు లెవ్వి గలవు?

వ॥ కావున సర్వవిధంబుల నీతం డీశ్వరసాన్నిధ్యంబు వడయు టకర్హుం డని పలుకుచు శివకింకరులు వానిని విమానారూఢునిం జేసి కైలాసంబునకుఁ గొనిపోయిరి.

భాగవతము.

11 అశ్వత్థామావమానము

[బమ్మెరపోతన:- ఇతఁడు శ్రీనాథునకు సమకాలికుఁడు. నియోగి. మహాభక్తుఁడు. భాగవతమును వ్రాసెను. ఈతని నివాసము కడపమండలములోని ఒంటిమెట్ట గ్రామము.]

వ॥ పాండవకౌరవ యుద్ధంబున మహాయోధులైన వారలు స్వర్గంబునకుం జనినవెనుక భీముగదాఘాతంబున దుర్యోధనుండు తొడలు విఱిగి కూలి నంత నశ్వత్థామ సుయోధనునకుం బ్రియంబు సేయువాఁడై యర్ధరాత్రంబున రహస్యవృత్తి నేగి నిదురవోవుచున్న ద్రౌపదీపుత్రుల శిరంబులు ఖండించి తెచ్చి రారాజునకు సమర్పించె. మఱు నాఁ డుదయంబుననఁ బాంచాలి బాలురచావు కర్ణములం

బడినంతనే బోరనవ్వేడ్చుచు నేలంబడి మూర్ఛిల్ల నర్జునుండు లేవనెత్తి శిరంబు దువ్వుచు మంజువాక్యంబుల నిట్లనియె.

మ॥ ధరణీశాత్మజ! నీకు నేల వగవన్
ధర్మంబె యాద్రౌణి ని
ష్కరుణుండై విదళించె బాలకుల; మ
ద్గాండీవనిర్ముక్తభీ
కరబాణంబుల నేఁడు వానిశిరమున్
ఖండించి నేఁ దెత్తుఁ ద
చ్ఛిరముం ద్రొక్కి జలంబులాడు మిచటన్
శీతాంశుబింబాననా!

వ॥ అని యుల్లాసంబుతోడ తనకు మిత్త్రుండును సారథియు నైన హరి మేలనుచుండఁ గవచంబుఁ దొడిగి గాండీవంబు ధరించి కపిధ్వజుండై గురుసుతుని వెంట రథంబుఁదోలించిన గురుసుతుండును ధనంజయుండు వచ్చు విజయుం దర్శించి శిశుహంత గావున నిజప్రాణసంరక్షణార్థంబు వడివడిఁ బాఱందొడంగె. ఇట్లోపినంతదూరంబు పఱువిడి కొంతవడికి వెనుకఁ జూచి రథతురంగంబు లలయుటఁ దెలిసి నిలిచి ప్రాణరక్షణంబునకొండుపాయంబు లేమి నిశ్చయించి జలంబుల వార్చి ద్రోణనందనుండు సమాహితచిత్తుండై, ప్రయోగంబకాని యుపసంహారంబు నేరకయుఁ బ్రాణసంరక్షణార్థంబు పార్థునిమీఁద బ్రహ్మశిరోనామకాస్త్రంబుం

ప్రయోగించిన నది ప్రచండతేజంబున దిగంతరాళంబు
నిండి ప్రాణిభయంకరంబై తోచిన హరికి నర్జునుం డిట్ల
నియె. "దేవా! గోవిందా! భక్తాభయప్రదా! వరదా!

క॥ ఇది యొక తేజము భూమియుఁ
జదలును దిక్కులును నిండి సర్వంకషమై
యెదురై వచ్చుచు నున్నది
విదితముగా నెఱుఁగఁ జెప్పవే దేవేశా!"

వ॥ అనినహరి యిట్లనియె. "భీభత్స! దుశ్శీలుండైన యీద్రోణ
జుండు ప్రాణాపాయభయంబున నుపసంహారం బెఱుంగ
కయు బ్రహ్మాస్త్రంబు నేసె. బ్రహ్మాస్త్రంబునంగాని దీనిని
మఱలింపరాదు. నీవును బ్రహ్మాస్త్రంబుం బ్రయోగింపు"
మనుటయు నర్జునుండు జలంబుల వార్చి హరికిం బ్రదక్షి
ణంబువచ్చి ద్రోణనందనుం జేసిన బ్రహ్మాస్త్రంబుమీఁద
తన బ్రహ్మాస్త్రముం బ్రయోగించిన,

మ॥ అవనివ్యోమములందు నిండి తమలో
డాకెండు బ్రహ్మాస్త్రముల్
రవివహ్నిద్యుతిఁ జూపుచుం ద్రిభువన
త్రాసంబుఁ గావింపఁగా
వివశభ్రాంతి యుగాంతమోయని ప్రజల్
వీక్షింప నాకేశ మా

ధవు నార్జునుఁ విజయుండు నేసె
విశిఖద్వంద్వోపసంహారముల్.

వ॥ ఇట్లస్త్రద్వయంబు నుపసంహరించి పురందరనందనుండు ద్రోణనందను పైఁబడి వానింబట్టుకొని యాజ్ఞికుండు యజ్ఞపశువుం గట్టుతెఱంగున బంధించి శిబిరంబునకుం గొనిచని వానిని హింసింపనూహించిన హరి వాని కిట్లనియె. "అర్జునా! సంశయింపకుము. అసమర్థులు సుప్తులు నస్త్రవిద్యల నెఱుంగని పిన్నపాపల నిషిద్ధంబని యెంచక వీఁడు వధించె. ఇట్టి దుశ్శీలుండు బ్రాహ్మణుండనియు నిరాయుధుండనియుఁ దలంపరాదు. ఇట్టిపాపమతినిఁ గృపామతిం జేసి కావంజూడకుము. మఱియు.

చ॥ వెఱచినవాని, దైన్యమున
వేమఱు నొందినవాని, నిద్రఁ బై
మఱచినవాని, సౌఖ్యముగ
మద్యముఁ ద్రావినవాని, భగ్నుఁడై
పఱచినవాని, సాధు జడభా
వమువానినిఁ, గావు మంచు వా
చఱచినవానిఁ, గామినులఁ,
జంపుట ధర్మముగాదు ఫల్గునా!

శా॥ స్వప్రాణంబుల నెవ్వఁడేనిఁ గరుణా
సంగంబు సాలించి య

న్యప్రాణంబులచేత రక్షణము సే
యఁగ వాఁడధోలోక దుః
ఖప్రాప్తుండగు రాజదండమున స
త్కల్యాణుఁడౌ నైన నీ
విప్రుం దండితుఁ జేయు మేటికి మహా
విభ్రాంతిచే నుండఁగన్.

వ॥ ఇట్లు కృష్ణుం డానతిచ్చిన బ్రాహ్మణుండు కృతాపరాధుం డయ్యు వధ్యుండుగాఁడను ధర్మంబుఁదలంచి చంపక ద్రుపద రాజపుత్రికిం దనచేసిన ప్రతిజ్ఞం దలంచి బద్ధుండైన శిశుఘాతిం దోడ్కొని హరిసారథ్యంబున విజయుండు శిబిరంబు సమీపించి, ఫల్గుణుండు మహాపరుషపాశబద్ధపాణియగు ద్రోణిని నిరవధికపుత్రశోకయుత యైవద్రుపదసుతకుం జూపిన బాలవధాజనితలజ్జాపరాఙ్ముఖుం డైన కృపికొడుకుం జూచి మ్రొక్కి యాసుస్వభావ యిట్లనియె.

మ॥ పరఁగన్ మామగవారలందఱును మున్
బాణప్రయోగోపసం
హరణాద్యాయుధ విద్యలన్నియును ద్రో
ణాచార్యుచే నభ్యసిం
చిరి, పుత్రాకృతినున్న ద్రోణుఁడవు, నీ
చిత్తంబులో లేశమున్

గరుణాసంగము లేక శిష్యసుతులన్
ఖండింపఁగాఁ బాడియే?

క॥ భూసురుఁడవు బుద్ధిదయా
భాసురుఁడవు శుద్ధవీరభటసందోహా
గ్రేసరుఁడవు శిశుమారణ
మాసురకృత్యంబు ధర్మమగునే తండ్రీ!

శా॥ ఉద్రేకంబునరారు, శస్త్రధరులై
యుద్ధావనిన్ లేరు, కిం
చిద్ద్రోహంబును నీకుఁ జేయరు, బలో
త్సేకంబుతోఁ జీఁకటిన్
భద్రాకారులఁ జిన్నపాపల రణ
ప్రౌఢక్రియాహీనులన్
నిద్రాసక్తులఁ బట్టిచంప నకటా!
నీచేతు లెట్లాడెనో!

ఉ॥ అక్కట! పుత్త్రశోకజని
తాకుల భారవిషణ్ణచిత్తనై
పొక్కుచునున్నభంగి నినుఁ
బోరఁ గిరీటి నిబద్ధుఁ జేసి నేఁ
డిక్కడ కీడ్చి తెచ్చుటస
హింతనిద్రె భవదీయమాత నేఁ

డెక్కడ నిట్టు శోకమున
నేకిఁయ నేడ్చుచుఁ బొక్కుచున్నదో.

వ॥ అనికృష్ణార్జునులం జూచి "ద్రోణునితో సహగమనంబు గావింపక ద్రోణకుటుంబిని యింటనున్నయది. మీర లీద్రౌణిం బట్టి నేఁ డిట్లు తెచ్చుట విని దైన్యము నొందుచుఁ బుత్రశోకవివశీకృతనైన నాతెఱంగున నెంత దుఃఖించునో? మఱియు బ్రాహ్మణహింస మనకుం దగదు. వీనిం బరిత్యజింపుఁ" డని ధర్మ్యంబును సకరుణంబును సమంజసంబును శ్లాఘ్యంబునుంగాఁ బలికిన పాంచాలిపలుకులకు ధర్మనందనుండు సంతసిల్లె. నకులసహదేవసాత్యకిధనంజయకృష్ణులునుసమ్మతించిరి. సమ్మతింపక భీముం డిట్లనియె.

చ॥ కొడుకులఁ బట్టి చంపె నని
కోపమునొందదు, బాలఘాతుకుః
విడువు మటంచుఁ జెప్పెడిని,
వెఱ్ఱిది ద్రౌపది; వీఁడు విప్రుఁడే ?
విడువఁగ నేల చంపుఁ, డిటు
వీనిని మీఁరలు చంపరేని నా
పిడికిటిపోటునన్ శిరము
భిన్నము సేసెదఁ జూడుఁ డిందఱున్.

వ॥ అని పలికిన నశ్వత్థామకు ద్రౌపది యడ్డంబువచ్చె. భీముని సంరంభంబుసూచి నారాయణుండు చతుర్భుజుండై రెండు

చేతుల భీముని వారించి కడమరెంటను ద్రుపదపుత్రికను దలంగించి నగుచు ననునయాలాపంబుల వృకోదరు నోడం బఱచి కిరీటిం జూచి, "ద్రోవదికి నాకు భీమసేనునకును సమ్మతంబుగ మున్ను నీచేసిన ప్రతిజ్ఞయు సిద్ధించునట్లు నాకుంపు సేయు"మని నారాయణుం డానతిచ్చిన నతండును తదనుమతంబున నశ్వత్థామశిరోజంబుల నిశితకరవాలం బునం దఱిగి వానిశిరంబున నత్యంతమహిమాన్వితంబై యొప్పు దివ్యరత్నంబును బరిగ్రహించి పాశబంధముల నూడ్చి పొమ్మని గొబ్బునం ద్రోవ శిబిరద్వారభాగంబునం బడి ప్రాణావశిష్టుండై వెడలిపోయె. అంతఁ బాండవు లును బాంచాలీసహితులై పుత్రులకు శోకించి మృతు లైన బంధువులకెల్ల దహనాదికృత్యంబులుఁ జేసి గంగకుం జని యుదకప్రదానంబు లాచరించియున్నయెడ నుపేం ద్రుండు మునులుం దానును బంధుమరణశోకాతురులైన వారల వగపుమానిచి మన్నించె నిట్లు.

శా॥ పాంచాలీకబరీ వికర్షణమహా
పాపక్షతాయుష్కులన్
జంచద్వర్గుల ధార్తరాష్ట్రుల ననిం
జంపించి గోవిందుఁ డి
ప్పించెన్ రాజ్యము ధర్మపుత్రునకుఁ గ
ల్పించెన్ మహాఖ్యాతిఁ జే

ఝుంచెఁ మూఁడు తురంగమేధములు దే
వేంద్రప్రభావంబునన్.

---

12 హరిశ్చంద్రోపాఖ్యానము

[గౌరనమంత్రి. ఇతఁడు పదునాల్గవశతాబ్దమధ్యకాలమం దుండినవాఁడు. శైవమతస్థుఁడు. హరిశ్చంద్రోపాఖ్యానమును ద్విపదకావ్యముగా రచించెను.]

—* దేవేంద్రసభ *—

నాకలోకంబునం దొక్కనాఁడు పాకశాసనుండు మేన హరిచందనం బలందికొని రత్నభూషణములం దాల్చి మందార పుష్పంబులు ముడిచి దివ్యాంబరములు గట్టి దేదీప్యమానంబగు నిజసభాభవనంబునందుఁ జింతామణీభద్రపీఠంబునం దాసీనుండై యగ్నియమప్రముఖులైన దిక్పాలకులును గిన్నరగంధర్వగీర్వాణయక్షప్రముఖులైన సకలనిర్జరవరులును గొలువ, రవలకంకణంబులరవములతో నచ్చరలు వింజామరములిడఁగ, నారదమునివీణానాదమున కనుకూలముగఁ దుంబురుని గానంబును రంభనృత్యంబును మోదావహంబులై యొప్ప నిండుకొలువుండి, కొలువున నుచితాసనాసీనులై యున్న మునిప్రముఖులం జూచి ప్రసంగానుకూలంబుగ వారల నిట్లు ప్రశ్నించెను.

ద్విపద. మూఁడులోకంబుల మునుమిడి మీరు
చూడనియట్టి రాజులు మఱి లేరు,
వారక మును చన్నవారిలో నున్న
వారిలోఁ బుట్టెడివారిలోపలను
బలికి బొంకని మహీపాలుండు గలఁడె
తలపోసి చెప్పుఁ డిందఱు నట్టివాని.

మహేంద్రుం డడిగిన ప్రశ్న వినియు జ్యవనుండు విస్మయం బంది విననియట్లే యూరకుండె. శార్ఙ్గరవుండు నవ్వుకొట్టెను. కశ్యపుఁడుసిగ్గునములుచుండెను. వామదేవుఁడు నేల వ్రాయుచుండెను. మరీచి సోమరియై మీఁదుచూచుచుండెను. గౌతముఁడత్రిమునికిఁ గనుగీట నతఁడు శాతాత్మకునిఁజూచి సన్న చేసెను. అతండును నగస్త్యుని నల్లన గోకెను. అగస్త్యుఁడు చేత జమదగ్ని నదిమెను. ఇట్లు మహేంద్రప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరం బెఱుంగక యచ్చటి తాపసోత్తములెల్లరు నొండొరుల నీవు నీ వని చూపి, గుజగుజ లాడుకొనుచుండ మహాజ్ఞానగరిష్ఠుఁడైన వసిష్ఠుఁడు సభవారి గజిబిజిని జేయెత్తి వారించి పురందరునితో నిట్లు పలికె.

వినుము సురేంద్ర! యీవిశ్వంబునందు
వినుతికెక్కిన మహావిక్రమోన్నతుఁడు
తనరు షోడశమహాదానవినోది
వినయభూషణుఁడు వివేకసంపన్నుఁ

డతులసత్కీర్తి మహాభాగ్యశాలి
వితత ధనుర్వేదవిద్యాధికుండు
సర్వశాస్త్రార్థవిచారకోవిదుఁడు
గర్వితరిపుగజకంఠీరవుండు
వరుస నాఱ్వురుచక్రవర్తులలోనఁ
దరమిడి మున్నేన్నఁదగు చక్రవర్తి
నిత్యప్రసన్నుండు నీతిపాలకుఁడు
సత్యసంధుండు త్రిశంకునందనుఁడు
నిరుపమవిజ్ఞాననిధి భానువంశ
శరధిచంద్రుఁడు హరిశ్చంద్రుఁడన్ రాజు;
పోఁడిమి మదిఁ దలపోసి చూచినను
వాఁడెపో బొంకనివాఁడు దేవేంద్ర!

ఆమాటలు విని విశ్వామిత్రుఁ డత్యంతాగ్రహచిత్తుఁడై యంబుదధ్వనికిఁ గనలి మాఱు గర్జించు సింహాము తెఱంగున వసిష్ఠుం జూచి యిట్లనియె. 'వసిష్ఠా! ఇవ్విధంబున మృష లేల వాకృవ్వెదవు? దధ్యాజ్యశాల్యోదనమాంసభోజనంబులు పరిపూర్తిగా మెసఁగి మత్తులై వర్తిల్లు రాజులు తఱుచు బొంకుచుండుట చూచుచుందుము. కావున జననాథు లేయూరు? సత్యమేయూరు? నీపలికిన పలుకు లాదరణీయములుగావు. హరిశ్చంద్రుఁ డెక్కడ? సత్యవ్రత మెక్కడ? నీ వినవంశజులకుఁ బురోహితుండవగుట నయ్యభిమానంబు

పురస్కరించుకొని శతముఖంబుల నీశతమఖునిసన్నిధి నా హరిశ్చంద్రు నింత గొనియాడితివి. ఈ మహేంద్రుఁడు నిన్ను విశ్వసించుఁగాక! సభవారి కీమాటలు సమ్మతికా' వనుటయు, నరుంధతీవిభుఁడు రోషించి కౌశికుం జూచి.

'అంతుగా నాఁబోతు అంకె వేసినను
గంతులు దక్కునే కంఠీరవంబు
కల్ల జంజాటంబు కౌశిక! యిచటఁ
జెల్లదుసుమ్ము వసిష్ఠుఁ డుండంగ
నురగకంకణుతోడ నూరజోగులను
సరిచేసి యెన్నినచందాన నీవు
నమితసత్యవ్రతుం డగు హరిశ్చంద్రు
సమముగా నృపపిశాచముల లెక్కింతు
వామహారాజేంద్రునటికాలివ్రేలు
భూమిపాలురఫాలముల నైనఁ గలదె?
ఎవ్వనిఁగాఁ జూచి తినకు లేశ్వరునిఁ
గ్రొవ్వి దూషించెదు కొలువుమధ్యమున.

అట్టి సత్యవ్రతు నట్టి తేజోధను నా రాజచంద్రుఁ బలుమారు నిందించిన నీకు వన్నె వచ్చెనా? వానివాసి చెడియెనా?' యని పలికెను. కౌశికుఁ డంతతో నూరకుండక తనయలుక రెట్టింప 'వసిష్ఠ! యీవట్టి జర్ఝరుల మానుము. వీనికి నేను భయంపడను. తగరుడీకొనినంత కులపర్వతంబు కొందలమొం

దదు. నీ వొకరాజకీటకంబును నొకదుర్మదాంధు నొక కొండఁజేసి లేనిసత్యంబు కల్పించి కలవియు లేనివియుఁ గొన్నికాఱులు నాముంగటఁ గూయుచున్నావు. ఆహరిశ్చంద్రుని వందిచందంబునఁ గైవారంబుసేయుచు దంటమాటలు కొన్నిసెప్పి నన్నుఁ గెల్వఁజూచెదవు. సముద్రం బంతయు నక్కజంబుగ నాపోశనము వట్టి యొక్క గ్రుక్కను గొన్నట్టి యాయగస్త్యుఁడుండఁ, బన్నగాభరణునకుఁ దన యఱకాలఁ గన్నుఁజూపిన యా గౌతముఁడుండ, నాగ్రహించి నారాయణుం దన్నిన యాభృగుఁడుండ, బ్రహ్మాదిదేవత లెల్లరెఱుంగ సృష్టికిఁ బ్రతిసృష్టిఁగావించిన నేనుండఁ, దక్కిన యామునిపుంగవు లెల్లరునుండ, మహేంద్రుని ధర్మసందేహంబుఁ దీర్ప నీవు గడంగుటకు మాలో నెవ్వరికంటెఁ దపోమహిమాధికుఁడవు? నరసురాసురగరుడగంధర్వయక్షప్రముఖులం దెవ్వరును ముజ్జగంబుల బొంకనివారలు లేరు.' నావుడు వసిష్ఠుఁ డిట్లనియె.

'తడవినమాటకుఁ దగిన యుత్తరము
నుడువక ప్రాజ్ఞుండు నోరొత్తుకొనునె
అల రెండువేలజిహ్వలవానికైనఁ
గొలఁదె హరిశ్చంద్రుగుణములు వొగడఁ
దనువెల్ల సత్యంబు తలఁపెల్లఁ గరుణ
పనులెల్ల ధర్మంబు పలుకెల్లఁ బ్రియము
బొంకునాలుకకుఁ జేర్చుటకాని వావి

యింకనిన్నియుఁ జెప్ప నేమి కారణము?
వారిజగర్భుని వ్రాత దప్పినను
వారిజాప్తుఁడు దూర్పువంకఁ గ్రుంకినను
మేరువు గ్రుంకిన మిన్ను వ్రాలినను
ధారుణీచక్రంబు తలక్రిందు వడిన
వారిధు లింకిన వజ్రాయుధంబు
ధారదప్పిన మాట తప్పఁ డారాజు.'

అను వసిష్ఠునినిశ్చయం బెఱింగి కౌశికుం 'డయ్యా! విత్తసంవాదంబు లేల? వానిసత్య మరసినఁగాని నీమాటల విశ్వసింపనేరము. నే నింక నే యుపాయంబున నైన వానిని మాయలం గుదియించి మాటల నొంచి యుల్లంబెల్లఁ గలంచి కళ్లలాడించిన మనకుఁ బన్నిద మేమైన నున్నదా? నేనింతకుఁ జాలి నిలిచెద. నీవును జగ్గఁగ మున్నె విచారించి యా హరిశ్చంద్రున కేమైనఁ జెప్పఁదగిన దున్నఁ జెప్పి నీపూన్కి తిరంబుఁ గావించుకొనుము.'

వసిష్ఠుండు చిఱునవ్వు నవ్వి "సత్యవ్రతంబు మున్నె వానికి వెన్నతో నిడినది. ఇంకఁ జెప్పఁదగిన దేమున్నది? నీవు వాని తెఱంగెఱుంగక దేవేంద్రునితోడ మించనాడితివి. నీ వొక్కండవె కావు. నీవంటి మునులు వేవురుగూడి వేవేల చందముల మాయలు పన్నినను బాయనియిడుములపాలొనర్చినను మనోవాక్కాయకర్మంబులచే నారాజోత్తముఁడు

కలలంగాని కలవరింతలంగాని నవ్వులంగాని బొంకు వలుకఁడు. కులసతిం బాయుఁగాక! కొడుకు గతించుఁగాక! తనకుఁ బ్రాణాపాయంబు సంభవించుఁగాక! వాని నాలుక నస త్యంబు వెలువడదు. ఆ హరిశ్చంద్రుఁడు-

మఱచి తా నాడినమాట బొంకినను
మఱి నీవు నవ్వ బ్రహ్మత్వమునకుఁ దొలఁగి
తపమును వేదశాస్త్రములును మఱచి
యుపవీతసూత్రంబు లొగిఁ బుచ్చివైచి
జపమును సంధ్యాదిసత్క్రియ లుడిగి
వపనమై యధ్యాత్మవాసనమాని
విపుల వల్కలములు విడిచి నెన్నొదుట
నపవిత్రమైనట్టి యంకంబుఁ దాల్చి
ఘనగార్దభము నెక్కి కట్టమానవుని
పునుకలో మద్యంబుపోసి త్రావుచును
జనులెల్ల నేవగింపఁగఁ దలవాంచి
కొని దక్షిణాభిముఖుండనై చనుదు.'

వ॥ ఇట్లు వసిష్ఠుండు గావించిన ఘోరప్రతిజ్ఞ వినినంతనే కౌశికుఁడు విపరీతక్రోధావేశంబున నొడలు మఱచి యుక్తా యుక్తజ్ఞానంబు విడిచి కొలువెల్లఁ గలయం గనుంగొని యెల్ల వారలు విన నిట్లనియె.

"అనిమిషవల్లభుఁడాదిగా సురలు
మునివరు లింక నా పూనికి వినుఁడు!
సాధించి యాహరిశ్చంద్రభూవిభునిఁ
గ్రోధకాళికిఁ బారి గొటియగాఁ జేసి
పలుకుపంతము చెల్లుబడిగాఁగ నతనిఁ
జలపట్టి బొంకింపఁజాలక యున్న
సిద్ధచారణమునిసేవితంబైన
సిద్ధాశ్రమంబున శివుని నేఁ గూర్చి
గాలి యాహారంబుగాఁ ద్రోలి యొక్క
కాలూఁది యూర్ధ్వముఖంబుగా నిలిచి
రెండుచేతులు నెత్తి రెప్పలు విచ్చి
చండాంశుపై దృష్టి చక్కఁగా నిలిపి
యెన్నంగఁ బెక్కు వేలేండ్లు తపంబు
మున్ను నేఁజేసిన పుణ్యంబులోన
సగమిచ్చి భువనప్రశస్తంబుగాఁగ
యుగములు నాలుగు నొగి పదునాల్గు
వరుసలు వర్తింప వసుధ నేలింతు;
మఱి చతుర్దశమహామన్వంతరమున
నింద్రుని సరిగద్దె నీ స్వర్గమందుఁ
జంద్రకళామౌళి సాక్షిగా నునుతు."

ఇట్లు వసిష్ఠవిశ్వామిత్రులు కడుఁ దీవ్రప్రతిజ్ఞలు గావించినంతనే.

పన్నగేంద్రుని వేయుపడగలు గ్రుంకె
మిన్ను బిట్టదరె నిమ్మేదిని దిరిగె
జలధులు గలఁగె నక్షత్రముల్ రాలెఁ
గులగిరు లగిలె దిక్కూలు వ్రక్కలయ్యెఁ
బెల్లుగాఁ గావిరి బెరసి యద్దంపు
బిళ్ళపోలికి రవిబింబంబు దోఁచె
గుండె ఝల్లనఁ జేతికులిశంబు వైచి
పండెఁ బొమ్మని దేవపతి కొల్వు విచ్చె
జున్ను రేచినరీతి సురలెల్ల బెదరి
కన్నవా రేగిరి కన్నత్రోవలకు
నుదరి తాపసులెల్ల నొండొరుఁ గడవఁ
బదపడం డిదె మహాప్రళయంబు వచ్చె
జిటిమి వశిష్ఠకౌశికులకోపాగ్ను
లుఱక లోకంబు లాహుతిఁగొను ననుచు
జడలు వీడఁగఁ గళాసములు విదిల్చి
మడిచి చంకలనిడి మఱలి చూచుచును
జనిరి దిగ్గున నిజాశ్రమముల కట్లు
చనిరి వసిష్ఠ విశ్వామిత్రులంత.

శ్రీకాళహస్తిమాహాత్మ్యము.

13 నత్కీరుని కథ.

1 వ భాగము.

[ధూర్జటి:- ఇతఁడు పాకనాటి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. గొప్పశివభక్తుఁడు. 1520-80 సంవత్సరముల ప్రాంతమువాఁడు. శ్రీకాళహస్తీశ్వరశతకమును, శ్రీకాళహస్తిమాహాత్మ్యమును రచించెను. శ్రీకృష్ణదేవరాయల యాస్థానకవులగు నష్టదిగ్గజములలో నితఁడొకఁడు.]

వ॥ పాండ్యదేశమునకు రాజధానియైన మధురానగరము సకలసంపత్పరిపూర్ణంబై యుమామహేశ్వరుల క్రీడావిహారప్రదేశమై యలరారుచుండెను. లోకమాతయగు నగజాత పాండ్యభూనేతకు దుహితయై జనించుటచేత నారాజశేఖరుం డల్లుండై యందె విహరించుచుండెను.

గీ॥ ఏపురంబునఁ జెంపొందు నిందుధరుఁడు
పాండ్యభూపాలునల్లుఁడై ప్రజలకెల్ల
నుల్లములలోన నుల్లాస ముల్లసిల్ల
నట్టి మధురకుసరియె యేపట్టణంబు?

వ॥ పాండ్యభూపాలపుత్రియగు భవాని మాణిక్యవల్లియు మరకతవల్లియు నానందవల్లియు నమృతవల్లియుఁ గస్తూరవల్లియు నను నామంబులఁ బిలువంబడుచు నాగరాంగనలచే నిత్యమును బూజింపఁబడుచుండెను. పౌరకాంతలును

బార్వతీదేవినామంబులను దామును ధరించి యొండొరు లం బిలుచుకొనుచు గుంపుగుంపులుగాఁగూడి యత్యుత్సాహమున దేవిసేవకై పోవుచుందురు.

క॥ ఇట్టి మహాత్వ్యంబునఁ గను
పట్టెడు తల్లిఁగల ప్రజలభాగ్యం బిల నే
పట్టుననున్నది పురముల
నెట్టు నుతింపంగవచ్చు నిందున కెసఁగాన్॥

శా॥ ఏమే కల్పకవల్లి! రా వమృతవ
ల్లీ! పోవె కర్పూర వ
ల్లీ! మాణిక్యలతా యిదో మరకతం
బెందుండు? నానందవ
ల్లీ. మీనాక్షులు రండటంచుఁ దమలో
లేమ ల్శివాభోగ వే
శామఁ జూక్తులఁ బిల్చు సంభ్రమ మన
ల్పం బెప్డుదుం దత్పురిన్.

వ॥ పార్వతి కూఁతురును బరమేశ్వరుఁ డల్లుఁడునుగాఁ బాండ్యరాజు దానవిద్యాపరకర్ణుఁడై దిగంతవ్యాప్తమహాకీర్తివంతుఁడై వైరిజనభయంకరుఁడై యపారపరాక్రమవంతుఁడై ధర్మపరిపాలనముఁ గావించుచుండెను. ఇట్లుండ నగస్త్యుం డొకప్పుడు ద్రావిడభాషకు వ్యాకరణమును నిఘంటువును నలంకారమును నందుఁ గవిత్వము చెప్పుటకు లక్షణమును

గల్పింపనెంచి యొక్క సంఘఫలకంబుపై నష్టాదశాక్షర మాలికను వ్రాసి దానిం గొనివచ్చి పాండ్యభూవల్లభున కిచ్చి యిట్లనియె. "రాజేంద్రా! ద్రవిడభాషాకవిత్వమహిమచే భారతీదేవికి సమానులైనవా రెందఱికైన నీఫలకంబు చోటిచ్చుచుండును. ఒక్కఁడైన యెడల నాయొక్కఁడు కూర్చుండుటకుఁ దగియుండును. దీనిమహిమం బిట్టిది. మీ పాండ్యరాజులు తరతరంబులుగ నీసంఘఫలకంబును బూజింపుచుండుఁడు."

క॥ అని కుంభజుఁ డిచ్చినవెను
కననేకులు పాండ్యనృపులు గడచినపిదపన్
జనియించెఁ గలియుగంబున
జనవల్లభుఁ డొక్కఁ డతనిసద్వంశమునన్॥

వ॥ ఆ జనవల్లభుఁడు తన పూర్వనృపాలురంబోలె భూభార భరణంబునఁ బ్రజానుమోదంబు వడయుచు నగస్త్యదత్తం బగు సంఘఫలకంబు పై నధివసింపందగిన మహామహుల ద్రవిడభాషావిద్వత్కవుల, మహాకావ్యనిర్మాణనిపుణుల శైవజ్ఞానసంపన్నులఁ బన్నిద్దఱం జేర్చి వారల గౌరవాదరణంబులఁ బోషించుచుండెను.

క॥ ఆసభ మెచ్చఁ గవిత్వం
బేసరసుఁడు చెప్పినన్ మహీశుం డిచ్చున్
జేసేతన్ మాడలు వే
యేసి దెసలఁ గీర్తిలతిక లెలమివహింపన్.

చ॥ అడిగిన దిచ్చు నర్థులకు
నాప్తుల కిచ్చు మనంబుc గూర్మియున్
బడతుల కిచ్చు సౌఖ్యములు
బంధుజనంబుల కిచ్చు సంపదల్
పుడమి సమస్తజాతులకు
బొంకమి నుత్సవ మిచ్చు శత్రులం
బొడవడగించి సాధుజన పుంగవ
కోటికి నిచ్చు వేడుకల్.

క॥ ఆభూవిభుc డిట్లుంగిని
భూభాగం బేలునపుడు పుట్టెన్ గ్రహావ
క్రాభద్రతామమహా
క్షోభంబు జగంబు వర్షశూన్యము గాcగన్.

వ॥ మహాకాటకసూచకంబుగ శని మీనంబునకు వచ్చెను. తూర్పున ధూమకేతువు దోcచెను. దినదినంబును మధ్యందినంబులc దుషారము చినుకc దొడంగెను. రాత్రులయందాకసంబు నిర్మలభావంబు నొందుచుండెను. వెలియెండ గాయుచు గాలియు నధికంబయ్యె. మఘాప్రవేశకాలంబు నందును నుఱుముట లేదు. దక్షిణదిక్కున మేఘగర్జలు విన రాcదొడంగె. ఇంక మహాక్షామంబు దప్ప దని ప్రజ లెల్లరు భీతిల్లసాగిరి. వాన లేమిని బంటలెల్ల నశించుటంజేసి ప్రజలెల్లరు గంటెలు చోళ్లు మున్నగు హీనధాన్యంబులకుc

ప్రయత్న పడసాగిరి. అన్నము లేక సకలవర్ణములవారు నెడతెగని యుపవాసంబులచేఁ గృశించుచుండిరి.

ఉ॥ తోలును నెమ్ములుఁ మిగిలి
త్రోసినఁ దొంబడిచోట్లఁ గూలువా
రాలిని బిడ్డలఁ విడిచి
యాఁకటిచిచ్చున వెచ్చపోవు వా
రేలిక బంటువాసి యొక
యింటుక లేకకృశించు వారునై
తూలె జనంబు మీనశని
దోషము దాఁకి నిరస్తసస్యమై.

క॥ నవయుచు నుండియు నొక్కొక
దివసంబున నశనమబ్బఁ దిని దగ మింగుటఁ
భువి నోరఁగి లేవనోపక
శివశివ! జనకోటి విడుచు జీవానిఁయముల్.

క॥ కలవంతంతకు నొత్తఁగఁ
కరవెఱుక తినంగనోపఁ గలుగక మనుజుల్
సురసుర సుక్కి కొందఱు
పరదేశంబులకుఁ జనిరి బ్రదుకులకొఱకుఁ.

వ॥ ఇట్లు మనుష్యుం జంపి మనుష్యుండు తిను దుష్కాలంబగుటయు నాపురంబునం దొకమూల నీశ్వరాలయంబున నివసించుచుండు నొక్క శైవబ్రాహ్మణుండు కూటికిలేక మల

మలమల్లాడుచుఁ దానును నెందేనియుం బోవ నుద్యమించు చుండ, మహేశ్వరుండు కరుణించి, వానికిఁ బ్రసన్నుండై యన్నగరం బేలుచున్న ఱేనిమీఁద నఱువ బాసం బద్యంబు శృంగారరసానుబద్ధంబుగా నొకటి చెప్పి యిచ్చి "ఇది చదివిన మెచ్చి వేయిమాడలము పిచ్చు. వెచ్చంబున కోదవు. నీవు నెవ్వగ నొవ్వక బ్రదుకంగలవాఁడవు. అంతటఁ గఱవును దీరును. జగంబునఁ గృతహర్షంబగు వర్షంబుఁ గురియంగలదు. సస్యంబులుఁ బండు. పండువు జనంబుల కగు" నని యనుపుటయు నతండును నారాజ సమ్ముఖంబునకుం బోయి (శ్రీ) పరమేశ్వరప్రణీతంబైన కవితాచమత్కారంబు వచించిన నందలి యర్థంబు "సింధురరాజగమనాధమ్మిల్లబంధంబు సహజగంధం" బనియుం డుటం జేసి,

క॥ దానికి నవ్వుచు నృపసభ
లో నక్కీరుండు వలికె "లోకము నగదే
పూనుకొని సహజగంధము
వేనలికిం గల దటన్న వేయుతెఱంగులన్.

ఉ॥ తప్పిది చెప్పరాదు కవి
తాసమయంబున కొప్పుగాదు నీ
విప్పగిదిన్ రచింపనగు
నే" యన విప్రుఁడు చిన్నవోయి, "నా

కప్పరమేశ్వరుండు వసు
ధాధిపుపై రచియించి యిచ్చినాఁ
డొప్పును దప్పు నే నెఱుఁగ
నుత్తములార!" యటంచుఁ గ్రమ్మఱన్.

ఆ॥ వె॥ వచ్చి పార్వతీశువంకఁ గనుంగొని
యతనిపద్య మతని కప్పగించి
"నిన్ను నమ్మి పోయి నిండినసభ సిగ్గు
చెడితి నున్నకథలు చెప్ప నేల ?

క॥ సర్వజ్ఞత్వము బహుముఖ
నిర్వాహకశక్తిగుణము నీకుఁ గలుగఁగా
శర్వ! నిను నమ్మి పౌరుష
గర్వముఁ బోనాడుకొంటిఁ గడపట సభలోన్.

వ॥ ఈశ్వరా! ఎవ్వండేనియుఁ దాను బండితుండై తనపాండిత్య పరిభావంబున రాజాస్థానంబులఁ గీర్తినొందఁగలండుగాని విద్యాహీనుండై పరులవిద్య నాధారంబుగాఁగొని రాజసభలకుఁ బోయినఁ బరాభవం బగు.

క॥ నీమాట నమ్మి పోయిన
నామోసముఁ జెప్ప నేల నత్కీరునిచే
నే మాటపడ్డదుఃఖము
తామవ్యథకొలఁదిగాదు సౌజన్యనిధీ!

శా॥ నాభాగ్యం బిటు లుండఁగాఁ దుది నినుఁ
నత్కీరునిం దూఱఁగా
నేభావ్యం బిఁకఁజాలు; నిక్కఱవుచే
నిర్వృతి నెందైనఁ గా
నీ భైక్షంబునఁ గుక్షిఁ బ్రోచుకొని దీ
నిం దీర్చి నేవత్తు, దే
వా! భద్రం బగు నీకు నన్ననుపవే
యన్నం గృపామూర్తివై.

"ఎవ్వఁడో నత్కీరుఁ డఁట! నాపద్యంబునఁ దప్పువట్టె నట! అ దెట్టిదో చూచెదఁగాక! యని నిటలాక్షుం డాగ్రహించి యా బ్రాహ్మణునితో రాజభసకు వచ్చి యెల్లవారలు విన నిట్లనియె.

శా॥ ఈరాజన్యునిమీఁద నేఁ గవితసా
హిత్యస్ఫురన్మాధురీ
చారుప్రౌఢిమఁ జెప్పి పంప విని మా
త్సర్యంబు వాటించి, న
త్కీరుం డూరక తప్పువట్టెనఁట యే
దీలక్షణంబో యలం
కారంబో పదబంధమో రసము చ
క్కం జెప్పుఁ డాతప్పునన్.

వ॥ అని యడిగిన నత్కీ_రుఁడు మునుపటివలెనె కాంతాధమ్మి ల్లము సహజగంధమై యుండు నని చెప్పుట తప్పునిరూపిం చె. అంతఁ బరమేశ్వరుఁడు పార్వతీదేవి ధమ్మిల్లము సహజగంధంబై యుండు నని పలుక నత్కీ_రుండు నవ్వుచు.

క॥ అగజకున్నైనం దగు నిల
మగువలకుం దగదు మాను మత్సర మింకన్
గగనప్రసూన వాదము
జగతిం బ్రత్యక్షమునకు సరి యనఁ దగునే?

వ॥ కావున నీ వింకఁ గపటంపు వాదమును జాలించి నీదోషంబు నంగీకరింపు మనుటయు నిటలాక్షుం డత్యాగ్రహంబును వహించెను. తన్ను నీశ్వరునిగా నత్కీ_రుం డెఱుంగఁడనియు, నెఱింగినయెడలఁ దనపద్యంబున నిట్టిదోషంబు పట్టియుండఁడనియు భావించి నిజరూపంబును వానికిఁ జూప నిశ్చయించి, నీలగ్రీవుండు తననిటల నేత్రమును బ్రత్యక్షముఁ గావించెను. నత్కీ_రుఁడు వానిమూఁడవ కన్ను విలోకించియుఁ దనవాదంబు విడక భయంపడక,

క॥ తలచుట్టువాఱఁ గన్నులు
గలిగినఁ బద్యంబుదప్పు గాదన వశమే
వల దిచ్చట నీమాయా
విలసనములు పనికిరావు విడువు మటన్నా.

వ॥ ఇందుధరుండు వాని నిర్లక్ష్యభావంబున కెంతయు గుపితుండై "ఓరీ! నత్కీరా! నీవు కుష్ఠవ్యాధిం దపియించుచుండు"మని శపించెను. అంత నత్యంతభయస్వాంతుండై నత్కీరుఁడు గడగడవడంకుచు రుద్రుని పాదపద్మముల వ్రాలి "స్వామీ! మహాపరాధంబు గావించితిని. నీవుదయాళుండవు. భక్తరక్షామందారుండవు. నాకు శాపాంతం బనుగ్రహింపు" మని ప్రార్థింప, "నీవు కైలాసంబును సందర్శింపుము. దానం జేసిన నీకుష్ఠవ్యాధి తొలంగఁ గల"దని నీలకంఠుండు పలికి యదృశ్యుఁడయ్యెను. అంత నత్కీరుండును దాను గావించిన శివదూషణం బను మహాదోషంబును దలంచుకొనుచుఁ బశ్చాత్తాపపడుచు డెందంబునఁ గొందల పడసాగెను.

ఉ॥ ఈకవితాభిమానము వ
హించితి నేటికి? సంఘపీఠిపై
నీకవు లున్నయట్లు వసి
యింపక దేవునితోఁ నేల చా
ర్వాక మొనర్చితిన్? గడుభ
రంబగు కుష్ఠరుజా విషాద మే
నేకరణిం ధరింతు, నిఁక
నెన్నఁడు చూచెద వెండిగుబ్బలిన్॥

ఉ॥ ఎన్నిమహానదుల్, వనము
లెన్ని, గిరీంద్రము లెన్ని, బోయపీ
ళ్లెన్ని, మృగంబు లెన్ని, జన
హీనములైన పథంబు లెన్ని, నే
నిన్నియుఁ దాటి యేకరణి
నీశ్వరుశైలముఁ జూడఁ బోయెదన్
గన్న దిగాదు విన్నయది
గాని సదాశివ! యేమి సేయుదున్?

మ॥ హరి శార్దూలమదేభఖడ్గశరభ
వ్యాకీర్ణముల్ రాక్షసో
త్కరసంచారనివాసముల్ హిమపయో
ధారాళవర్షంబులు
ద్ధురసంఘర్షణబాధకోపలము లా
తోఁగ్రివల్ సనన్ శక్యమే
కరుణాసాగర! భక్తవత్సల! శివా!
గౌరీశ! యెట్లోగదే?

సీ॥ తివిరి యంగమ్మునఁ దిమిరి యొత్తకమున్న
యొడలెల్ల మచ్చలఁ జెకమున్న
దళమెక్కి గాత్రంబు చెలువు దప్పకమున్న
బుడుపులు మేన నేర్పడకమున్న

యలత విగ్రహమున నంకురింపకమున్న
కాయంబు వెడరూపుగాకమున్న
తనువునఁ జీముర క్తములుఁ గాఱకమున్న
దేహ మీఁగలు మూఁగి తినకమున్న
భైక్షమడుగంగఁ బోయినపట్లు జనులు
చూడ రోయకమున్న కాలాడినపుడె
నడవఁగావలెఁ గైలాసనగముఁజూడ
హరుని వాక్యంబు శక్యమే? పరిహరింప.

వ॥ ఇట్లు చింతాపరంపరల మునింగి మునింగి కడకు నక్కీరుండు ధైర్యంబువహించి కైలాససందర్శనార్థ ముత్తర దిక్కుగాఁ బ్రయాణమును సాగించెను

---

14 నక్కీరుని కథ

2వ భాగము.

నక్కీరుఁడు మధురానగరంబును నిర్గమించి పోవుచు మార్గమధ్యంబునఁగల చెవ్వందీశ్వరక్షేత్రంబునఁ బ్రవేశించి యందలి యీశ్వరలింగమును దర్శించి, యందుండి వెడలి జంబునాథశివలింగంబునకు మ్రొక్కి, యచ్చోటు విడిచి కావేరీతీర్థమున స్నానమాడి, యత్తటినీరత్నంబు నుత్తరించి యుత్తరాభిముఖుండై కొన్ని తీర్థంబులు

దర్శించి, పిమ్మట నరుణాచలంబును జూచి, పదంపడి తిరువత్తూరి మహాదేవు నారాధించి, యటఁ జని యేకరసాలేశ్వరునిఁ బూజించి, మఱియుం గొన్ని పయనంబు లొనర్చి, విక్రమసింహనగరాసన్నయగు పెన్నయుఁ దీర్థయాత్రాపరులకు సురతరుపుకొమ్మయగు గుండ్లకమ్మయు సుకృతీభూతపాతకశ్రేణియగు కృష్ణవేణియు, నుత్తుంగతరంగసంగతయగు గౌతమగంగయుఁ గుక్కుటేశ్వరపీఠంబగు పీఠికాపురంబును సింహాచలంబును శ్రీకూర్మంబును గోకర్ణంబును బురుషోత్తమంబును గటకంబును జంబాలేశ్వరంబును నందనేశ్వరంబును గగనేశ్వరంబును గయాస్థానంబును గ్రమక్రమంబుగా సేవించుచు గంగానదిని సమీపించెను.

నక్కీరుండు గంగాస్నానముఁజేసి మోక్షస్వామియైన విశ్వేశ్వరుని దర్శించి విశాలాక్షిం గొలిచి, కాలభైరవునిఁ గీర్తించి ఢుండివిఘ్నేశ్వరుని మ్రొక్కి శంకరశైల దర్శనోత్సాహంబునఁ గాశీపట్టణంబును విడిచి,

సీ॥ ఒకకొన్ని పయనంబు లొయ్యనొయ్యనఁ బోయి
నడువ నోపిక లేక నడుమ నడుమ
నడుముఁ బట్టుక నిల్వఁబడియుఁ గూర్చుండియుఁ
దొంగి దోఁగియుఁ గొన్నిజంగ లరిగి

పొదలు పెట్టుచుఁ దన కడు గాముడై యుండఁ
జీమునెత్తురు మేనఁ జిప్పిలంగ
నీఁగలు మూఁగియు రేఁగియు జుమ్మురు
మ్మనఁగ నుత్తాలశైలాంతరంబు
నిర్మనుష్యంబు బహుసత్త్వనిష్ఠురంబు
నైన కానన మధ్యంబునందుఁ జిక్కి
దిక్కు గానక దీనతాధీనహృదయుఁ
డగుచు నత్కీరకవిచంద్రుఁ డగ్రభూమి.

వ॥ ఒక్క సరోవరంబుఁ గాంచి దానిపొంతకు నొయ్యనం బోయి, యచ్చటి వటవృక్షచ్ఛాయం బ్రవేశించి తదీయ శాఖాశైత్యంబున కత్యంతసంతోషంబునొంది కూర్చుండి, తద్వటంబునుండి రాలిన పండుటాకులు బట్టబయటఁ బడినవి విహంగంబులును జలంబులం బడినవి మీనంబులు నై పోవ నందొక్క పలాశంబు జలాశయంబున సగమును దటప్రదేశంబున సగమును బడి మీనపక్షిత్వంబులు గైకొని లోపలికి వెలుపలికిం దివియు చమత్కారంబు నత్కీరుండు చూచి యద్భుతరసపరవశుండై యుండెనంత.

ఉ॥ కూరనిరీక్షణ ప్రభల
గుర్జ్జులుఁ గోఱలు నూర్ధ్వకేశముల్
నీరద నీలగాత్రమును
నిష్ఠురవాక్యము లట్టహాసముల్

ఫేరవకంఠ నిస్స్వనము
భీకర హేతియు మానవాస్థిహా
రారవముల్ సెలంగ వికటా
కృతితో నొక భూత మాతని ॥

క॥ పట్టుకొని తనదు గుహకుం
బెట్టిదముగఁదెచ్చి మునుపుపెట్టిన మనుజుల్
దట్టిఁబడిన పులుఁగులగతి
నిట్టులు పడంగ నునిచి యెంతయు వేడ్కన్.

క॥ వారల నందఱ నే కా
హారముగాఁ గొనఁదలంచి యయ్యద్రిబిల
ద్వారమున ఱాయి ద్రోచి మ
హారయమునఁ గొలన నుదక మాడఁగఁ బోయెన్.

వ॥ అంత నప్పెనుభూతముచే నంతకుమున్న నయ్యద్రిగుహాం తరంబున బంధింపఁబడినవారలెల్లరు నత్కీరుం గాంచి యిట్లనిరి.

"గీ॥ ఏమిసేయవచ్చు నింతయు మామీఁదఁ
గరుణలేక కమలగర్భుఁ డిపుడు
నిన్నుఁదెచ్చిపెట్టె నేఁడింక నందఱఁ
దిను నితండు వీని తెఱఁగు వినుము.

ఈ రక్కసుండు మానవుల నిరంతరము నూఱుకొని త్రిప్పుచుండు. నూఱుపురైనఁగాని వాని కొక్క యాహా

రంబునకుఁ జాలరు. నాఁటినుండి బూ్త్రియగువలెనుండి మమ్ము భక్షింపక యీ బిలాభ్యంతరమునఁ గూడఁబెట్టుచున్నాఁడు. నేఁడు నిన్నుం దెచ్చుటంజేసి నాఁటివురమైతిమి. నేఁటితో మన కెల్లరకు నాయేండ్లును నిండు. ఆ రక్కసునకును గడుపు నిండు." నావ్వుఁడు నత్కీరుండు లేశమ్మును భీతిల్లక తన కిష్టదైవంబగు కుమారస్వామి యీ పెనుభూతంబును సంహరించి తన్నుం దనతోడివారిం గాపాడంగలఁ డని నిశ్చయించి నిశ్చలచిత్తంబున సుబ్రహ్మణ్యస్వామిని ధ్యానింపసాగెను.

ఉ॥ తారకదైత్యభంజనుఁడు
దారుణశక్తిధరుండు పన్నగా
హారహరాయుండు దీనజన
తామరభూజము షణ్ముఖాఖ్యుఁడా
సారభటీవిపాటిత దిగంత
కటాహుఁడు వీనిఁబట్టి సం
హారమొనర్చి యుందఱఁ గృ
పాంబుధియై బ్రతికించుఁ గావుతన్.

ఉ॥ భూతముఁ జంపుఁడే యరుదు
బోరనఁ దారకుమన్నిగొన్న వి
ఖ్యాతమహాప్రతాపునకు,
నద్రిగుహాలయ మేమిదొడ్డని

ఘ్రాతమువంటి శక్తిఁగొని
క్రొంచముఁ జించిన రౌద్రమూర్తికిన్
భీతిఁదొరంగఁజేయు టొక
పెద్దయె వారితదేవతార్తికిన్.

వ॥ అని యనేకప్రకారంబుల భక్తియుక్తంబుగా నిష్టదేవతావరేణ్యుండును భక్తశరణ్యుండునగు సుబ్రహ్మణ్యు సన్నుతింప ననుకంపాతరంగితాపాంగుండై యతండు చండతరవేగంబునం బయింబడిభూతంబు భూతలంబుపయింబడ్డం బెడచేత నడిచి బిలద్వారంబునం దొ్రిచినతాతిఁ దిగిచివైచి యందఱ వెడలుండని యనుగ్రహించిన డెందంబుల నానందంబునం బొంది యిందుశేఖరునందను సందర్శించి వందనంబులు సం దడించుచు వారెంతేనియుం జనిరి. నత్కీరుండును బునఃప్రణామం బాచరించి నిలుచుటయుఁ బ్రసన్నతాంకురంబులు ముఖపంకేరుహంబునం బ్రభవింప 'నీ వీయెడకు రాఁగతం బేమి' యని యడుగుటయు' నిట్లని విన్నవించె. 'దేవా! ఓ శరణాగతవత్సల! దీనకల్పక! ఏనొక్కతప్పు సేసిన కారణంబున మహేశ్వరుం డాగ్రహించి కుష్ఠరోగవ్యథం బడుమని శపియించె. అంత నే నామహాదేవుని శాపాంతంబును గరుణింపఁ బ్రార్థింపఁ గైలాసదర్శనంబునఁ దొలంగునని యనుగ్రహించె. ఇమ్మహాగోగంబున మునింగి లేశమును జవసత్వములు లేక పడరాని యిడుములఁబడుచు దుర్గమంబగు

కైలాసమార్గంబుఁ బట్టి పోవుచుంటి. స్వామీ! నన్ను శీఘ్రంబుగ గమ్యస్థానంబునఁ జేర్చి యనుగ్రహింపు' మని పాదములపైఁబడియె. అంత నద్దేవుండును

"శా॥ కైలాసం బనెఁగాని యుత్తరదిశా
కైలాస మంచాడఁడా
గాలగ్రీవుఁడు వీఁడు దక్షిణదిశా
కైలాసముఁ జూచినన్
జాలుం గుష్ఠము మాను" నంచు మదిలోఁ
జర్చించి, యాపర్వతం
బాలోకింపఁగ నశ్రమంబగు నుపాయం
బాత్మఁ జింతించుచున్.

వ॥ నక్కీరునిం గాంచి, "కవీంద్రా! నీ పీకొలనిజలంబులం గ్రుంకుము; తోడనే యాడఁబోవుతీర్థం బెదురై నయట్లు నీకు శివశైల మెదురై సిద్ధింపఁగలఁ దని యనుగ్రహించె.

శా॥ నేనానీవచనామృతంబు చెవులం
జిందంగ డెందంబులో
నానందం బుదయింప నక్కొలనిలో
నత్యంతనిష్ఠం గృత
స్నానుండై తలయెత్తఁగా నెదుటఁ గా
నన్ వచ్చె నాలో నవా
చీనస్థాణునగంబు హేమముఖరీ
సింధుప్రతీరంబునన్.

శా॥ కుష్ఠవ్యాధియు మానె హేమముఖరీ
కూలస్థకైలాసమున్
నిష్ఠాధీనమనస్కుఁడై కదిసి త
న్నీరంధ్రికల్లోలభూ
యిష్ఠౌఘంబునఁ దీర్థమాడి గిరిజా
ధీశున్ శివున్ దేవతా
శ్రేష్ఠున్ సంస్తుతి నూఱు పద్యములు చే
సెం ద్రావిడోక్తిం దగన్.

క॥ ఆనూఱుపద్యములకున్
సేనానీజనకుఁ డార్తచింతామణి వి
ద్యానిధిజ్ఞానప్రసవాం
బానాథుఁడు కాళహస్తిపతిప్రీతుండై.

వ॥ సాక్షాత్కారం బొసంగి నత్కీరా! నీభవము ధన్యం బయ్యె. నీకవిత్వంబువలనం బ్రీతుండనైతి. ఇంక నీభయంబు లెల్ల వర్జించి వరంబు వేడు మనుటయు నక్కవిశేఖరుం డిట్లనియె.

క॥ ఈ సంసారము దుఃఖా
వాసానందంబు దీని వర్జింపంగా
నే సుఖము గల్గు దయ న
న్నాసుఖమునఁ గూర్పవే కృతార్థుఁడ నగుదున్.

వ॥ శంకరుండు వాని వేడిన వరం బిచ్చి యదృశ్యుండయ్యె.

ఉద్భటారాధ్యచరిత్రము.

15 చిత్రరథశాపము.

[రామకృష్ణుఁడు-వీనియింటిపేరు తెనాలివారు. ఇతఁడు ధూర్జటినాటికి బాలుఁడై యుండి వానితదనంతరమున క్రీ-శ 1550 సం॥ ప్రాంతమునఁ బ్రసిద్ధుఁడైన మహాకవి, ఇతఁడు ఉద్భటారాధ్య చరిత్రము, పాండురంగమాహాత్మ్యము మొదలగు పెక్కుగ్రంథములను వ్రాసెను.]

వ॥ పురాణదంపతులైన పార్వతీపరమేశ్వరు లొకనాఁడు తారాచలంబుపైఁగల యారామంబున వినోదంబుగ విహరించుచుండిరి. కిన్నరకాంతలు విమానంబుల నిలిచితమ పసిడికిన్నెరలు మీటుచుఁ బాడుచు నాజగత్పితరులఁగీర్తించుచుండిరి. పూవులంజొచ్చి పుప్పొడి రేపుచుఁ గొలఁకులం జొచ్చితరఁగలఁ గదలించుచు మలయానిలము చల్లగ వీచుచుండెను. మఱియు నయ్యది వసంతసమయంబగుటఁ జిగురులకు జిగియును గ్రొన్ననలకుఁ జెన్నును విరులకు మురిపెమ్మును బిందెలకు నందమ్మును గాములకు సోయగంబును దోరలకు గౌరవంబును బండులకు మెండును గలిగి యాకైలాసోపవనంబెల్ల నూతనవిలాసభాసురంబై యుండెను. ఆవనాభ్యంతరమున గౌరీభర్త భవానింగూడి, కలకంఠకుహూకారాంతరములైన మావిమోకలం జొచ్చియుఁ దఱుచైన నెత్తావుల నివ్వటిల్లు పువ్వుపొదరిండ్లం దూరియు, తుమ్మెదబాలికల మనోహరఝుంక్రియల నొప్పు నడ

బావితీరంబులం దిరిగియుఁ జంద్రికాధవళంబులైన చంద్ర కాంతవేదికలపై విశ్రమించియుఁ బెక్కుచందంబుల వినో దింపసాగెను. ఆవిహారంబున ఫణిహారుండు తామరదుద్దులను బంగారపుదుద్దులవలె హైమవతికర్ణముల ఘటించెను. కమ్మని పొగడపూవులం జేరగాఁ గూర్చి యామెకటియం దమర్చెను. వావిలిపూవుల నామె సీమంతవీధికి ముత్యాల చేర్చుక్కగతి రచించెను. పొన్నపూవులపుప్పొడిని బూఁ దేనెలం బోసి మేదించి గంధమువలె నామెమేన నలందెను. చంపకంబుల పతకంబుగూర్చి యామెకంఠము నలంకరిం చెను. ఇట్లు సాక్షాత్కరించిన యారామలక్ష్మియుం బోలెఁ బ్రేక్షణీయయగు దాక్షాయణింగూడి క్రీడాపరాయణుండై నారాయణాసఖుం డఖండితానందకందళితహృదయారవిం దుండై యుండు నవసరంబున.

సీ॥ తేటవెన్నెల మించుఁ దెలచిరా జనిపించు
నకలంకహారవల్లికలతోడ
కేవఁగాంతుల పెల్లుగా వసంతము జల్లు
కటకాంగదకిరీటకములతోడ
తివుట నెత్తావుల దిక్కుగు రావుల
నలమి వాసించు మాల్యములతోడ
ప్రకటితంబుగఁ జూపులకు విస్మయముఁ జూపు
రమణీయచిత్రవస్త్రములతోడ

గీ. ప్రమద సల్లాప కోలాహలములతోడఁ
గాంతు లొలుకంగఁ దొడసిరాఁ జెంతరాలు
పుష్పాదులతోడ గంధర్వముఖ్యు లటకు
నురువిమానంబు లెక్కి-వచ్చిరి ప్రియమున.

వ॥ ఇట్లువచ్చిన యాగంధర్వులెల్లరు విరించి మున్నిచ్చిన వరగర్వంబునం జేసి మెచ్చుటనైనఁ గొంకులేక విచ్చలవిడి నిచ్చకొలంది సంచరించెడు వారలు గావున నుమాపతి యనుమతిం బాటింపకయె యన్నగాగ్రంబున విమానంబులు డిగ్గిరి.

క॥ ఇది రజతాచల మిందుఁ
మదనారి వసించు విబుధమానితుని నె
మ్మదిఁ దలఁపక గంధర్వులు
తదద్రిపై విడిసి రధికదర్పం బెసఁగన్.

వ॥ గంధర్వపుష్పగంధులెల్లరు జగన్మోహంబుగ గాంధర్వంబు గావించుచుఁ దమ భర్తలతోఁ బుష్పాపచయమును బ్రారంభించిరి. అప్పుడు నారాయణసఖుండు దాక్షాయణితో నా సమీపంబుననే యొక్క పుష్పవాటిం టియం దుండెను. ఆరామవిహారంబువలని యాయాసంబు వాయ బరమేశ్వరి పరమేశ్వరుని యంకపీఠంబున శిరం బానుకొని విశ్రమించుచుండెను. పుష్పాపచయోద్యోగంబున నాగంధర్వులెల్లరుఁ గ్రమక్రమముగ నాపువుటింటి వాకిటకు

వచ్చి నిలిచిరి. కలకలనవ్వేడు చిలుకలకొలుకులతోఁగూడ గొలగొల మని వచ్చిన ఖచరకోటులం జూచి యీశ్వరాను చరుండైన నందికేశ్వరుం డా కలకల మోర్వఁజాలక యీ గంధర్వు లింతటి గర్వాంధులాయని యఖండితరోష కషాయితాక్షుఁడై,

ఉ॥ భీకరరేఖతోఁ బసిఁడి
బెత్తము ద్రిప్పుచు ఘర్మబిందు జా
లాకరమౌ మొగంబు తరు
ణారుణతేజము లీనఁ గన్నులు
ల్కాకళలన్ జ్వలింపఁ దమ
కంబునశంకరు పువ్వుటింటి యు
వ్వాకిట నిల్చి యిట్లనియె
వారలతోఁ ద్వరమాణవాణియై.

క॥ చీకులరె మీర లీశుఁడు
లోకేశ్వరుఁ డీవనంబులో నీశ్వరితో
నేకాంతంబున నుండఁగ
నీకాంతలు మీరు వచ్చు టిది తగవగునే?

వ॥ అని పెక్కుభంగుల వారింప నావియచ్చరులు నందిని
లేశమ్మును జీరికింగొనక మార్గస్థంబున నుమామహేశ్వర
స్థానంబును మఱింత సమీపింపఁజొచ్చిరి. అవ్విధంబెల్ల
నాత్మ నెఱింగి త్రిపురమర్దనుండు విపరీతక్రోధంబున.

గీ॥ పులుగరంబునఁ బూని, 'మీరలు పిశాచ
రూపమునఁనుండు'డని వైవ రూపరేఖ
దప్పి వికటాంగులైరి గంధర్వులెల్ల
నెంతవారికిఁ దప్పునే యీశ్వరాజ్ఞ!

క॥ ఆయందము లాచందము
లాయద్భుతరూపరేఖలామంజుసుధా
ప్రాయోక్తులు మిడివోయెను
గాయజహారుకినుకకతన గంధర్వులకున్.

గీ॥ చంపనలిగియు నొక్కింత చలము మాని
విషమనయనుండు పులినాకి విడిచినట్లు
చావుతోడుత జోడైన చటులఘోర
కష్టరూపంబు వారికిఁ గలుగఁజేయ.

సీ॥ ఎఱసంజకెంజాయ నెక్కసక్కెంబాడు
చికిపికిపల్లవెండ్రుకలవారు
గమకంబులగు గ్రచ్చకాయలఁ దలఁపించు
కూర్రంబులగు మిట్టగ్రుడ్లవారు
ముడిబొమ్మలును బెద్దమిడిగ్రుడ్లు వెడఁ గోర
దాడలుగల్గు వక్త్రములవారు
పెనుబీఱనరములు పెనఁగి పైఁబ్రాకుటఁ
గనుపట్టు పొట్టపొంకములవారు

గీ॥ కుఱుచలగు హస్తపాదముల్ గుదియఁబొడిచి
నట్లు బలిసిన మెడలతో నరయ నూచ
లైన యూరులతో వికటాంగులైన
వారునైరిట్లు గంధర్వవరులు పెలుచ.

వ॥ మదనవిరోధిశాపంబున నాఖచరేంద్రపంక్తికి నెత్తురులేక బీటలువారిన పెదవులును జెట్టుపట్టలవంటి మేనులును దట్టముగ వ్యాపించిన పిశంగరోమములును విస్ఫులింగము లొలుకు నిశితోగ్రదంష్ట్రలును జనించుటచే వారల పూర్వాకారంబులెల్లఁ జిందరవందరయయ్యె. అట్టి వికారాకారంబులకుఁ దోడుగఁ గలకలభాషణంబులును గహకహట్టహాసంబులును గనుపట్ట నెక్కడ రక్తపానంబు? ఎక్కడమాంసభక్షణంబు? ఎక్కడమేదోలేపనంబు ఎక్కడకపాలధారణంబనుచు మత్తిల్లి భయంకరధ్వనులు గావించుచుండ నాపిశాచబృందంబులం జూచి డెందమునం గొందలంబంది తదధినాథుండగు చిత్రరథుండు, నీలంపురంగుదులకించుతనతల వెంట్రుకలు పల్లవెంట్రుక లగుటయు, నిండుజవ్వనంబుచే గంపుమీఱిన తనమేను వికలభావం బొందుటయు, మాణిక్యకంఠహారంబులెల్ల సన్నని పేగుపుల మాలలగుటయుఁ, గమ్మతావులం జల్లు గందంపుఁబూత మేదోలేపనంబగుటయు, నడుమునకుం గట్టినబట్ట పచ్చితోలగుటయుఁ గనిపెట్టి యవ్విధంబెల్ల హరునిచే నగుట యెఱింగినవాఁ డగుట నయ్యాభ

పునిపాదంబులకు మ్రొక్కి లేచి భయభక్తుల నిట్లనిరి.

ఉ॥ ఓ పరమప్రభావ! పురు
హూతముఖామరవంద్య! మేము నీ
పాపలవంటివారము కృ
పాపరతంత్రత దక్క యక్కటా!
మాపయి నిట్లనుగ్రహము
మానుటయే మఱి యింతమాత్రలోఁ
గోపము మానుమయ్య యిఁక
గోపతికేతన! దైత్యశాతనా!

గీ॥ అకట! నీబంటు బంటులమైన మమ్ము
నొక్కతప్పును సైరింప కుఱక ఘోర
శాపదావానలంబున సగము చావు
చంపితివి చాలు నిఁకఁ బ్రోవు చంద్రజూట!

చ॥ నెఱయఁగ లోకపూజ్యుఁడగు
నీచెలికానిఁ గుబేరుఁ గొల్చి మే
ముఱక వికారభావమున
నొందుట నీకుఁ గొఱంత గాన ని
క్కెఱుఁగక మందెమేలమున
నే మొనరించిన తప్పు గాచి యం
దఱఁ గరుణారసాబ్ధిఁ బరి
తాపము మానఁగఁ దేల్చు శంకరా!

గీ॥ మృత్యుదేవత యోర్వదు మిహిరతనయుఁ
డోర్వఁ డిభదైత్యనాయకుఁ డోర్వఁ డెందుఁ
ద్రిపురదానవు లోర్వరు తీవ్రమయిన
నీదుకినుకకు మే మెంత? నీలకంఠ!

క॥ కలుషించి తేల తృణక
ల్పులమగు మామీఁదఁ గరుణవోనాడి కటా!
పలుదెగఁగొని బ్రహ్మాస్త్రం
బిలఁ బిచ్చుకమీఁదఁ బూని యేయఁగఁదగునే?

వ॥ అని యనేకప్రకారంబుల సకరుణంబుగాఁ బ్రార్థించుచుఁ బ్రణతులైన గంధర్వాధ్యక్షునిమీఁదం గృపాకటాక్ష వీక్షణామృతంబు వోలయ దాక్షాయణీవల్లభుం డిట్లని యె.

క॥ ఓహో! వగ యుడుగుఁడు మీ
సాహసమున నింతపుట్టె శాపావధి కే
మూహించి తెరువుఁ జెప్పెద
మీహైన్యముఁ గొంత యోర్వుఁడీ! ధైర్యమునన్.

వ॥ ఖచరులారా! ఆర్యావర్తం బను దేశంబున మహావైభవాస్పదంబై రెండవకాశి యనందగిన వల్లకీనామ మహాపురంబుగలదు. ఆపట్టణ రుదగ్భూమికిఁ జేరువనే యొక్క మహావటంబున్నది. మీరెల్లరు నవ్వటవృక్షంబుపై నూఱు దివ్యవత్సరంబులు నివసింపవలయు. ఇంతలోఁగొన్ని హాయనంబు లరిగిన పిదప ముంజభోజుం డను నొక రాజకుల

రత్న ముదయించి యుద్భటారాధ్యుఁ డగు గురువునకు శిష్యుం డగును. అగ్గురుసత్తముఁడు నాయంశంబునం జనియించువాఁడు. ముంజభోజుం డయ్యాచార్యవర్యు నతిభక్తిం గొల్చుచుండును.

ఉ॥ ఆగురుమూర్తి కాలగతి
నందుడుఁ దత్తనుధూమయుక్తిచే
వేగ భవన్మహావికృత
వేషము లన్నియుమాని పూర్వకే
ళీగరిమంబుఁ దాల్చుటయుఁ
గాదు మదీయగణాధినాథతా
యోగము గల్గి నాకడన
యుండెద రేగుఁడు భూతధాత్రికిన్.

వ॥ అంతవరకు మీ రావటంబునం దుండి శివభక్తులను శివలింగధారులను బంచాక్షరీమంత్రపరులను సత్యరతులను ధర్మమూర్తులను మన్నించుచు వారలవంకఁ బోక తదన్యజనములఁ గారింపుచుండుఁడు. ప్రారబ్ధకర్మం బనుభవించుటచేతనే క్షీణింపఁగలదు గావునఁ గర్మానుభవంబునకు వగవం బనిలేదు. కాలక్షేపముసేయక మదుపదిష్టంబగు మార్గంబున శాపావధిం గాంచి మదీయసాలోక్యంబున నుండెదరు, పొం"డని కుండలిమండలేశ్వరకుండలుండుకొండరాచూలితో నంతర్ధానంబునొందె. పిశాచబృందంబులు

నమ్మహాదేవు నాదరంబునఁ గొంతసంతాపంబు వాసి తొలంగిపోయె.

వాల్మీకిచరిత్రము.

16 వాల్మీకికథ

[రఘునాథరాయలు-ఇతఁడు 17 వ శతాబ్దమధ్యమునఁ దంజావూరు రాజ్యము నేలినరాజు. ఈతఁడు వాల్మీకిచరిత్రమును రచించెను.]

వ॥ ఆర్యావర్తమునంగల పుణ్యనదులం గ్రుంకుచు దైవ క్షేత్రంబుల దర్శించుచుఁ గొందఱు మునిచంద్రములు తీర్థయాత్రికుతుకంబునఁ దిరిగి తిరిగి కాశికానగరంబుఁ జేరుకొని యందుఁ గొన్నిదినంబులు నివసించి, తన్నగరంబు విడిచిపోవుచు "తమసా" నదిని సమీపించిరి. కట్టకగలె గాఢాంధకారబంధురములైన యా తమసానదీప్రాంత కాంతారము లా తాపసోత్తముల కత్యంతభయావ హంబులై కనుపట్టె. మార్గవశంబున వార లా భీకరాట వులం బ్రవేశించి పోవుచు నొక్కయెడ నొక్కభిల్లపల్లెం గాంచిరి. క్రుళ్ళిన రక్తమాంసాదికంబులచే దుర్గంధబంధు రంబైన యా శబరవాటికం జొచ్చి యమ్మునిపుంగవులు,

క॥ చుట్టును బసరపుటెమ్ములఁ
తెట్టలు చూచినను మదికి దిగులయ్యెను హా
కట్టఁడి దైవం బిచ్చటి

కెట్టు మనలఁ దెచ్చె దాఁటు టెట్లొకో యనుచున్.

క॥ చండాలవాటికయు నిటు
లుండునె యీ రోఁతగన్న నొక్కటఁ బ్రేవుల్
గుండెలు నిలువక వాంతికి
నొండరిగెడు కర్మఫల మహో యిటు లుండెన్.

క॥ నెఱ చెదర కరాతులముం
దఱనైనం బోవవచ్చు దయమాలిన యి
క్కఱకు కిరాతులముందఱ
వెఱవక చనఁబోల దిచట వెఱవెయ్యదియో?

వ॥ అని కరంబులు తమ మొగంబుల కడ్డమిడుకొనుచు ముక్కులుమూసికొనుచు, మనసున రోసి రోసి రేగినదుర్గంధమున కుమియుచు నాసన్న్యాసులు మధ్యందినంబగుటయు మార్గాయాసంబున మిక్కిలి యలసి జడలును గమండలములును మోవఁజాలక మోయుచు నెత్తి వేసినయడుగెల్లఁ గుళ్ళిన మాంసపంకంబునందె పడుచుండ నాకిరాతవీథులఁ బోవు నెడ నాకస్మికముగ నొక్క బోయ దాయవలె వారి కెదురయ్యెను. తన భయంకరగర్జనములచే నడవిపులుఁగులు బెగడువడి తొలంగ, నిప్పులురులు బెడిదంపుఁ జూపులతో వచ్చు నా బోయవాఁడు వారల కుఱుమని పిడుగుం బలె దోఁచెను.

చ॥ కటినటియించు నీలిబలు
కాసెయు నల్లనిమేనుఁ జిమ్మచీఁ
కటి ఘటియింపఁ జేత వీలు
గైకొని మేఘపుఁబిల్లవోలె న
ట్టిటు శరపంక్తు లడ్డముగ
నేయుచు డాయుచు వచ్చివచ్చి యు
జ్జటికుల సార్వభౌములను
సాగఁగ నీ కరికట్టి నిల్చుచున్.

క॥ నిలు నిలువుఁడు! మీచేతం
గల సొమ్ములనెల్ల నిచ్చి కదలుఁడు! నాతోఁ
జలపట్టిన మిమునందఱఁ
బలుచట్టులమీఁద నుతికి పాఱన్ వైతున్.

వ॥ అమ్మునివరులు వానికి మాఱువలుకక నిశ్చలంబుగ నిలువంబడియుండ బాపనపిసాచులకు భీతి గలిగించెద నని యాకిరాతుఁడు విల్లెక్కువెట్టి వారిపై వాడికోలల నేసెను. కాని యవి గుఱితప్పి నేలఁబడుటయు నొడుగఱచి వాఁడు మఱల నేయ నయ్యవి పక్కకుఁ దొలఁగిపోయె. ఆశబరుం డంత నహంకరించి వెండియుఁ గొన్ని బాణంబు లేయ నయ్యవి పైకిం దేలిపోయె. ఇట్లుపెక్కుసాఱు లేసినయమ్ములెల్ల వమ్మగుటయు నయ్యాటవికుం 'డౌరౌరా! ఎంత వింత ? ఈజడదారుల కంపతప్పగలదు కాఁబోలు! నాయేటులన్ని

యుం దప్పె నని విస్మయంపడుచు వారిపైబడిఁ జడచుట్టలను
బీకివైచియు మెడలపై గుప్పుగుప్పన మోదియుఁ, గమం
డలంబులం బగులఁగొట్టియు, గూనులువడ వీపులపై గుద్దు
లుగుద్దియుఁ బలువిధంబుల బాధించి కడకొక్క కాసే
నియు వారియొద్దఁ గానఁ డయ్యె.

గీ॥ ఇట్లు బాధించి శోధించి యొందు నొక్క
పచ్చపైకంబుగాన కప్పచ్చిబోయ
నేఁటితెర వాటు పసలేక దాటిపోయె
ననుచు వెస వారిదెసమాని యవలికేగి.

గీ॥ వింటి కొప్పునఁ జేయూది విన్నఁబోయి
యసురుసురటంచుఁ గలఁగుచు నున్నవాని
చంద మీక్షించి యప్పు డా శాంతమతులు
మునులు వలికిరి చేసాచి మనికితమున॥

గీ॥ తాపసుల మమ్ముఁ బసులచందమున గొట్టఁ
జేతు లెట్లాడె నిది యేమి చేటు నీకు?
పాతకుఁడుగాఁగ నెన్నాళ్లు బ్రతికెదీవు?
ఊతఁజేసిరె యూరికి రాత! నిన్ను.

క॥ ఇట మునుపు నీవుచేసిన
పటుసాహసములకు నెల్లఫలమగు నోయీ!
జటివరుల నిటులఁ గొట్టితి
కటకట! యిఁకనైన దురితగతి మానవుగా.

వ॥ ఓరీపుళిందా! నీశరీరము బుద్బుదమువంటిదిగాని శాశ్వతము గాదు. నీ పీరహాస్యమును దలంపక యింతటి ఘోరపాతకము లెట్లు చేయుచుంటివి? నాపుడు నాలుబ్ధకుం డతిశుద్ధస్వభావులసంభాషణావిశేషంబున నుల్లంబునఁ గొంత శాంతి పల్లవింప వారలఁ గాంచి, "బేలతపసులారా! ఈ విల్లునమ్ములు నా యాలిబిడ్డలకుఁగాఁ దాల్చితిని. నా చేసినపాతకంబు లెల్ల వారలకుఁగాక నా కంట"వని పలికె. అంత నత్తాపసులు వీని నెట్టులైన ననుగ్రహింపవలయు నని మఱియు ని ట్లనిరి.

క॥ ఓరోరి! నీవు చేసిన
గోరపుబాపముల నీవుఁ గొడుకులు నాలుఁ
జేరఁబడి పంచికొందురొ
వారికిఁ బనిలేక నీక వచ్చునొ చెపుమా.

వ॥ ఆప్రశ్నకు శబరుండు ప్రత్యుత్తరం బీయఁజాలక వెలవెలంబోయి, యత్తాపసులమహిమచే నించుకజ్ఞానంబు వడసి, "మునులారా! మీప్రశ్న కుత్తరంబు నాయాలుబిడ్డల నడిగివచ్చెద. అదియే పల్లె. దవ్వు లేదు. నే వచ్చుదనుక మీ రిందుఁ గదలవలదు. కదలితిరేని నాలావు నెఱుంగుదురు కదా"యని పలుకుచు నింటికిం జనియె. చనునప్పు డక్కిరాతుఁడు పూర్వమువలె మార్గమధ్యంబునంగల యేణముల నేయఁబోక, పక్షులఁగొట్టక వాకులపాటుతోఁ దనతా

టాకు టిల్లు ప్రవేశించి యొక్క జింకతోలుపైఁ జదికిలఁబడి విలునమ్ములు నొకమూలఁబాఱవైచి, వెచ్చగానూర్చుచు దనభార్యను రమ్మని పిలిచెను. తోడనే యేనుఁగుదంతము రోకలిగాఁ జందనపురోలున వెదురుబియ్యము దంపుచుండిన శబరి శబరనాథునికడకు వచ్చెను. ఇట్లు చనుదెంచిన యయ్యంగనం గనుంగొని యాపుళిందుఁడు.

క॥ "ఓపడఁతి! నే నొనర్చిన
పాపంబులు దలఁప నీకుఁ బనిగలదో నా
కేపనియొ కాక చెఱిసగ
మై పఱగునొ నాకు దాచ కంతయుఁ జెపుమా."

క॥ అన విని యచ్చెలి నగుచుఁ
విను నాయక! తలఁప నాకు నీదగు పాపం
బునకుఁ బనిలేదు నీపో
పున నెంతయుఁ గుడిచి కట్టి పొసఁగుటకన్నన్.

చ॥ తవులగువారి కెవ్వరిక
తంబున నీవెర వప్పుదీసి తె
త్తువొ, కొనితెత్తువో, తెరువు
దోచుచుఁ దెత్తువొ, జూదమాడి తె
త్తువొ, చనితెత్తువో, యదియు
దోసమొ పుణ్యమొ నాకు నేటి కా

రవరవ? నీవు తెచ్చినవి డాచక
వండఁగఁ బాడి నిచ్చలుఁగా.

వ॥ అమ్మాటలకు వానిడెందంబు చివుకురు మనఁ బుళిందుండు పదంపడి తననందనులంగూడ రావించి వారల నట్లే యడుగుటయుఁ దల్లిచెప్పిన చొప్పుననే కొడుకులుం జెప్పిరి. అంత నా నిషాదుం డత్యంతవిషాదం బంది.

గీ॥ మోసపోయితి నిన్నాళ్లు నాసఁ దగిలి
యాలుబిడ్డలుఁ దానుఁ జుట్టా లనంగ
నెవ్వ రెవ్వార లేయూరి కేదితోవ
వీరి కేఁ బాటుపడు టెల్ల వృథయ యనుచు.

క॥ దోసమునకుఁ బనిలే దఁట
నాసొమ్ములు వీరికిం దినం బని గలదే?
రోసితి సంసారముఁ దెగఁ
గోసితి మొదలంట బందుగుల తగులెల్లన్.

వ॥ అని తలంచి సన్న్యస్త సమస్తసంసారుం డగుచు, సుకృత వాసనావిశేషంబున నూతనజ్ఞానంబు వహించి మోదంబు నొందుచుఁ బుత్రమిత్రకళత్రాదిసంగమంబు తొలంగి, క్రమ్మఱ నమ్మునులపాలికిం జని యందంద వందనంబులు గావించి, యంజలిపుటఘటితనిటలుం డగుచుఁ దచ్చరణంబుల వ్రాలి, తత్పాదరేణుస్పర్శనంబునఁ గలిగిన వాక్పాటవంబున నోమునీంద్రులారా! మీదర్శనంబునఁ

గృతార్థుండ నైతి. నాజననంబు సఫలంబయ్యె. సకలపాప హరణంబగు నొక్కమంత్రంబు నా కుపదేశింపుండనుచు సంతసంబునఁ బునఃపునః ప్రణామంబు లాచరించిన నవ్వా చంయములు వనేచరుని సమీచీన ధీచాతుర్యంబున కాశ్చర్యంబు నొందుచు, మున్ను వీఁ డెన్నితపంబులు సలి పెనో యాటవికుండయ్యు సత్కర్మంబు నాటింపం దలంచె. నెంతటి ధన్యుం డని సంతసించి, సర్వవర్ణసాధారణంబును నిఖిలమంత్రఫలదంబును, లోకాపారదోషరహితంబును సత్యకామంబును శ్రుత్యభిరామంబును నగు "రామ" నామంబకాని వీనిం బవిత్రుంజేయ వేఱొక యుపాయంబు లేదనియు, నేతాదృశులకుఁ బ్రతిలోమంబుగా నుపదే శింపవలయుననియు విచారించి యాదండ నొక్కతీర్థ కుండంబున నక్కిరాతు సుస్నాతుఁ గావించి, సంభావించి, "పుళిందా ! నీ విందు నిశ్చలభక్తి చిత్తంబున 'మరామరా' యటంచు జపించుచుండు" మని యనుగ్రహంబున రామ మంత్రంబిచ్చియమ్మునులు కైలాససందర్శనాభిలాషం జనిరి.

అంత నయ్యాటవికుఁడు నొసటంగల జేగురుబొట్టుఁ దుడిచి తులసిమృత్తిక దాల్చి కటింగల నీలిచీరంబాసి నార చీరంగట్టి దండకమండల జటాభరాదులఁ గేవల ముని వేషంబు నివ్వటిల్ల,

గీ॥ దినముఁ దమసాతరంగిణీతీర్థమునను
స్నానమొనరించి యత్యంతశాంతి మెఱయ
మౌను లుపదేశమిచ్చిన మంత్ర మెపుడుఁ
దపముసేయుచు నక్కిరాతప్రభుండు.

క॥ ఈసరణి వాఁడు సకల
వ్యాసంగము మాని మౌనివర్తన నుండన్
వేసటచే వీఁ డెక్కడ
గాసింబడె ననుచు వానికలవారెల్లన్.

క॥ చెట్టులపుట్టల గట్టుల
చుట్టుల నందంద వెదకి సొలయుచు నొకచో
నట్టడవిలోనఁ గదలక
చట్టుంబలె నున్నవానిచందము గనుచున్.

క॥ ఇయ్యడవి వీని నేలలు
దయ్యంబులు వ్రేసెనొక్కొ తరలకయుండన్
డయ్యఁ డొకింతయు మనతోఁ
గుయ్యన నొల్లండు కన్నుఁగొన తెఱవంగన్.

గీ॥ అకట! చెడి వీని నెవ్వఁడో యంకగాఁడు
తప్పుసుద్దుల బుద్దులు తగులుకొలిపి
బోయజాతికి వెలిగాఁగఁ బాయఁజేసి
యాలుబిడ్డల మనుమల నలియఁజేసె.

వ॥ అని వానిం జేరుకొని యందఱు మఱియు నిట్లనిరి.

సీ॥ కన్నులు దెఱవని గండభేరుండంపు
నిసువుల నెవ్వరు నేర్తు రరయ
నేనుంగుతలపాల సెవ్వరు దెత్తురు
పెంచిన సింగంపుఁ బిల్లకులను
కవిసిన దొడ్డిలోఁ గాఱెనుపెంటుల
దట్టించి యెవ్వారుకట్టఁగలరు?
పులుల కూనలకు రేపునుమాపుఁ దగునట్టి
మేపు లెవ్వరుదెచ్చి మేపువారు?

గీ॥ ఇంట నీ వటు లేకున్న నిట్టిపనులు
కుఱుచబుదుతలచే నౌనె కొలమువారు
చాల నెగ్గింప జాలును జాలు నింక
నుదుటుతనమెల్ల మాని యిట్లుండ నగునె?

ఉ॥ కానకు నేగి వింతరుచి
గల్గెడు పిట్టలుఁ జెట్టు జున్నులున్
దేనెలుఁ జారపప్పులును
దెచ్చుఁగదా యిఁకనంచుఁ గూళ్లలోఁ
గూనలువోని నీకొడుకుఁ
గుఱ్ఱలు నీదను దెంచుతోర్వనఁ జూ
పానఁగ నిల్తు రయ్యెడలు
హా! మముబోంట్లకుఁ జూడవచ్చునే?

గీ॥ తెల్లవారిన గుండగ్గికోళ్ళలీల
నీళ్ళమునుఁగుచు నోడలెల్లఁ దెల్లబాఱి
నిట్టి పాపంబులను గూడి నెవ్వఁ డోడరు
వెడగుబాపనతగులునఁ బడితివేల?

వ॥ అని యివ్విధంబున నావ్యాధులెల్ల మహావ్యాధులుంబోలె వానిని బాధింప శబరనాథుండును,

క॥ కనుదెఱచి నవ్వి యేమియుఁ
బని లేదని ముందు మీరు పలికితి రిపుడే
పని కిటు వచ్చితి రిందఱు?
జనుఁ డెఱుఁగుదు మీదుమాయ జరుగునె యింకన్?

గీ॥ తండ్రి రాముఁడు జనకజ తల్లి యెల్ల
బంధులును నాకు నాస్వామిభక్తు లెన్న
నింతవాఁడను నా కిందు నెదురు గలదె?
సకలజగములు నేలుదు సుకరముగను.

క॥ మీ రెవ్వరు మే మెవ్వరు
నేరము లెంచక చనుండు నిలువక యెటకే
శ్రీరఘుపతియే నాకు న
కారణబంధుండు గురుఁడు గణుతింపంగన్.

వ॥ అని యాశ విరుగంబలికిన నవ్వనచరులెల్లరు వానిని విడిచి యొందేనియుం బోయిరి. తాపసోపదేశానుసారంబుగ నానిషాదుండు జపించుచుండు 'మరామరా' శబ్దంబులు క్రమంబుగ రామరామ శబ్దంబులై వాని నత్యధికమహిమాఢ్యుం జేయుచుండెను. ఇ ట్లనంతశాంతగుణస్వాం

తుఁడై యామహిమాఢ్యుం డచ్చట నభంగధ్యాననిష్ఠాగరిష్ఠుండై తపంబు సేయుచుండ నేడేండ్లు గడచుటయు లేశమును జనసంచారము లేమి నాప్రదేశమంతయుఁ జెదపుర్వుల కాలవాలమై విషసర్పంబుల కాటపట్టులగు పెక్కు పుట్టలు పుట్టెను. దానంజేసి యాతపోధనుని చుట్టును జుట్టికొని పుట్టి యొకమహావల్మీకము తాళ ప్రమాణంబుగ వ్యాపించె.

రామమంత్రోపదేశకర్తలగు మహర్షులు కైలాసంబునకుఁ బోయి మఱలివచ్చుచు నాప్రదేశంబును సమీపించినంతనే వారికి దొల్లింటి బోయవాని వృత్తాంతము చిత్తంబులకుస్ఫురింప నా బోయ యెందుఁ బోయెనోయని యిటునటుఁ బరిశీలింపసాగిరి. అప్పు డాకాశవాణి 'రామభక్తుం డీ వల్మీకముననున్నవాఁ' డని వారి కెఱింగించెను. పుట్టకు నట్టనడుమనున్న యారామభక్తుండును మునుల మాటలు విని వల్మీకమును భేదించుకొని యుదయార్కబింబంబు పగిది తేజరిల్లుచు వెలుపలికి వచ్చి వారలకు నమస్కరించెను. మహర్షులు వాని తేజోవిశేషంబుల కాశ్చర్యపడుచు,

క॥ ఈజట లీ కృష్ణాజిన
మీజపమాలికయు శాంతి యొల్లఁ గలిగెనో
యీజగదాంగకు నోహో
శ్రీజానిస్మరణమహిమ చెప్పఁగ వశమే?

వ॥ వీడు ప్రహ్లాదనారదపరాశరవ్యాసపుండరీకాదులలో నొకఁడుగాని సామాన్యుండు గాఁ డని తమలోఁ దాము పలుకుకొనుచువాని నెంతయు నభినందించి యథేచ్ఛంజనిరి. వాఁడు వల్మీకంబునం బుట్టిన కతన వాల్మీకి యను నామధేయంబు వహించె. అవ్వాల్మీకి మహామునియు నంతకంతకంతరంగంబున నుప్పొంగుభక్తివిశేషంబున నిరంతరజపశీలుండై యుండ వానిచిత్తశుద్ధికి నలరి రామభద్రుం డొకనాఁ డతని యగ్రభాగంబున సాక్షాత్కరించె. వాల్మీకి తన

నిర్మలభక్తి స్తోత్రంబుల నాజానకీజానిని రంజింపఁజేసి యిట్లనియె.

ఉ॥ శ్రీరఘురామ! భానుకుల
శేఖర! నీ పదపద్మసేవ మం
దారనగంబు, ముంగిటి ని
ధానము, తంగెటిజున్ను, కొంగుబం
గారము, వేల్పుమానికము,
కైవసమైనధనంబు, చేరువౌ
మేరువు, కామధేనువు స
మీపసుధాంబుధి, నాకు నెప్పుడున్.

వ॥ అని సన్నుతించిన సంతసించి రామభద్రుండు నిర్మల తాత్పర్యంబున నమ్మునివర్యుని మస్తకంబున హస్తస్పర్శకంబు గావించి, యో మునికులతిలకా! నీభక్తికి మెచ్చితి. మచ్చరితంబు భవ్యంబగు కావ్యంబుగా నొనరింపు మని యానతిచ్చి చనియె. అంత వాల్మీకియు జానకీవల్లభుని భక్తసులభత్వంబును గొనియాడి మృదుపదసందర్భరసగర్భితార్థచమత్కారపారాయణంబుగా రామాయణంబు వక్కాణించె. అట్టి రామాయణంబు సకలలోకప్రసిద్ధంబయ్యె.

క॥ శ్రీకరమై తగు నవ్వా
ల్మీకిచరిత్రంబు భక్తిమెఱయఁగ నెపుడున్
జేకొని చదివిన వినినన్
జేకురు వారల కభీష్టచిరశోభనముల్.

ఉత్తరరామాయణము.

17 కుశలవ చరిత్రము

1 వ భాగము.

[కంకంటిపాపరాజు- ఇతఁడాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు - నెల్లూరు మండలమువాఁడు, 1790 సం॥ ప్రాంతమువాఁడు. ఇతఁ డుత్తరరామాయణమును వ్రాసెను.]

వ॥ వల్మీకోద్భవుఁడు గఱపెడు విద్యాబుద్ధులచే దినదినప్రవర్ధమానులై జానకీసూనులు తల్లికిని దక్కటివారికిని సంతసంబార మెలంగుచుండ, నచ్చట నయోధ్యానగరంబున రామభద్రుఁడు సీతాపరిత్యాగంబువలని మనఃక్లేశంబు వాయఁ బుణ్యకథాశ్రవణంబునఁ బొద్దులుపుచ్చుచు నశ్వమేధంబొనరింప సమకట్టి, లక్ష్మణుంజీరి, "వత్సా! నీవు చని కశ్యప కుత్స వసిష్ఠ కణ్వముఖ్యనిఖిలసన్మునీశ్వరులం దోడ్కొని రమ్ము! నావుడు నతండును నట్లకావించె. భరతాదులు గొల్వ నిండుకొలువై యున్న భూకాంతుఁడు వచ్చిన మునికులతిలకుల కెదురుగవచ్చి పూజించి తోడితెచ్చి యుచితాసనాసీనులం గావించి తన యశ్వమేధసంకల్పము విన్నవింప వారెల్లరు నత్యంత హర్షోత్కర్షంబున సమ్మతించిరి.

చ. అనితరపుణ్యులా ర భువ
నాంచితమౌ హయమేధ మేను మీ
యనుమతిఁ జేయఁ వాఁడ నని
యాత్మఁదలంచితి; మీర లమ్మఖం
బునకు ననుజ్ఞయిండనిన
బోరన నమ్మునులెల్లఁ బల్కి రో
జనవర! ముజ్జగంబులకు
సమ్మత మా క్రతు వాచరింప వే.

అంత రాఘవుఁడు నైమిశారణ్యమున గోమతీ నదీతీర భూమియందు హయమేధమును గావింప నిశ్చయించి తత్క్రతుసందర్శనార్థము సుగ్రీవాంగద హనుమన్నీల జాంబవద్గవయ గవాక్ష నల సుషేణ ప్రముఖులను విభీషణ కేకయాధిప విదేహా ద్యఖిలదేశాధీశ్వరులను నానాదేశ విప్రులను బహ్మర్షి దేవర్షి గణంబులను రావించె. సామంతమంత్రిపురోహితప్రముఖులును భరతాదు లైన సోదరులును రామాజ్ఞ ననుసరించి యజ్ఞశాలాదిక సకలనిర్మాణంబులును యథావిధి నొనరించిరి. విశ్వకర్మం బురుడించు శిల్పకారులు తమ యనల్పశిల్పకలాకౌశలం బేర్పడ బంగారు సీతమ్మను సృష్టించి తెచ్చిరి. అంత సంపూర్ణలక్షణసంపన్నంబైన క్రతుహయంబు విడువం బడియె. వేగజితకురంగంబగు నాతురంగంబున కంగరక్ష

కుండై చతురంగబలసమన్వితుండై లక్ష్మణుండు వెడల రాముం డానతిచ్చె.

చ॥ అతఁడు ననేక సైనికస
మన్వితుఁడై బహుబుత్విగావళీ
యుతుఁడయి శత్రుభీకర బ
లోద్ధతుఁడై చతురంతధారుణిం
గ్రితుతురగంబుఁ ద్రిప్పి భుజ
గర్వముదక్క సమస్తధారుణీ
పతులును భీతులై తన కు
పాయనముల్ తగ నిచ్చి కొల్వగన్.

ఉ॥ రాజకులాభిరాముఁడగు
రాముని తమ్ముఁడు లక్ష్మణుండె యీ
త్తేజికి రక్షకుండు ధర
ధీరులు గల్గినఁ బట్టుఁడంచు, న
వ్వాజిలలాటపట్టమున
వ్రాసిన వ్రాల్ గని దానిఁ జేర రే
రాజులు భీతులై తమపు
రంబులచెంతల సంచరింపఁగన్.

వ॥ అంత రామభద్రుండును యజ్ఞదీక్షం బూనె. భరతాదుల దాన మానాదికంబుల శ్రితబాంధవాదులగు కృతుదర్శనాగతులెల్లరు నిరంతరసంతృప్తులగుచుండిరి.

చ॥ ఎడపక యేఁడుగాలమిటు
లేగఁగ లక్ష్మణుఁ డంతలోనఁ ద
త్తడిఁగొని తెచ్చినన్ నృపతి
తద్దయు వేడుక యాగకృత్యముల్
నడపుచునుండె; విప్రులు ది
నంబును భోజనదక్షిణాదులన్
గడుముదమంది రందఱును
గాంక్షితముల్ గని రమ్మఖంబునన్.

చ॥ వలసినభోజనాభరణ
వస్త్రధనాదులఁ జెంది తృప్తులై
పలుమఱుఁ జాలుఁజాలునని
పల్కెడు వారలెగాని మాకుఁ గా
వలయు నొసంగుఁ డంచనెడి
వారల మందునకైనఁగాన మా
స్థలమున జానకీవిభుని
జన్నము వైభవ మెంచ శక్యమే?

ఉ॥ ఆమఖవైభవంబునకు నద్భుతమంది మహర్షు లెంచి రా
రా! మును బ్రహ్మ చేసినమహాధ్వరమున్ మఘవంతుయజ్ఞమున్
సోమునియాగమున్ దపనసూనుమహావంబు దధీశుహోమమీ
రాముని యశ్వమేధమఖరాజముతోఁ బ్రతిసేయవచ్చునే?

క॥ ధనసామగ్రియు నానా
జనసామగ్రియును రామజనవిభునకుఁ గ
ల్గిన కతన నీమహోత్సవ
మొనరించెంగాక లేక యొరులకు వశమే?

మ॥ అని సభ్యుల్ గొనియాడఁగా రఘుకులా
ధ్యక్షుండు సంవత్సరం
బును బూర్ణంబుగ సాంగదక్షిణలచేఁ
బొల్పొంద యాగంబు సే
యు నెడం దన్మఖవైభవంబు గనఁగా
నూహించి వాల్మీకి శి
ష్యనికాయంబుఁ బ్రశిష్య సంఘము భ
జింపన్ వచ్చె నచ్చోటికిన్.

క॥ వచ్చిన యమ్మునిచంద్రుని
హెచ్చినరహి నెదురుకొని నరేశ్వరుఁ డర్ఘ్యం
బిచ్చి సపర్యల నాతని
యచ్చపుయలరఁ గుశల మడిగి యిట్లని పలికెన్.

చ॥ వరమునిచంద్ర! మీ రిటకు
వచ్చుట నామఖమున్ ఫలించె మీ
చరణయుగంబు సోకి క్రతు
శాల పవిత్రతఁ జెందె; మామకా
ధ్వరవిధి పూర్ణమా దనుక
వచ్చిన యమ్మునులట్ల మీరు నిం
దిరవుగ నిల్వుఁ డంచు విడి
యించెద దర్హ్యగృహాంతరంబునన్.

వ॥ దాశరథిమాట జవదాటఁ జాలక వామలూరు భవుండు శిష్యగణంబులతో నందె నివసించుచుండె. ఆశిష్యగణంబులలో మార నలకూబర మనోహరాకారులును వీణాగాన కలాకుశలులును నగు కుశలవులుఁగూడ నుండిరి. అయ్యాదికవీశ్వరుం డక్కుమారకులం జేరఁజీరి వారల కిట్లనియె. "వత్సలారా! మీ రిందుఁ బ్రతిదినంబును గవపాయక రఘునాయకుని కొలువుకూటమున నేను గఱపిన రామాయణమును గానము సేయుచుండవలయును. మఱియు,

చ॥ స్వరములుఁ దాళముల్ లయలు
సారపు మీటుకొలంబు లేర్పడం
జిరముగ మీకు నారదుఁడు
సేసిన శిక్ష ఫలింప నింక మీ
రిరువురు వీణెలూని దిన
మిర్వదిసర్గల లెక్క రాఘువే
శ్వరుసభఁ బాడుఁ డవ్విభుని
చారు చరిత్రము సభ్యులౌననన్.

మ॥ ఫలమూలాశనులై ధనేచ్ఛవిహీయిం
పంబోక రామాయణం
బెలమిన్ రేపటినుండియున్ దొరకొనుం;
డెవ్వారు మీ రంచుఁ గే

వలమైత్రిఁ రఘుభర్త మిమ్మడిగినన్
వాల్మీకిమహాసీందుశి
ష్యుల మంచున్ వచియింపుఁ డవ్విభుఁదలం
పుం డాత్మలోఁ దండ్రిగన్.

వ॥ ఏల యంటిరేని భూవల్లభునిఁ బితృసమానునిగాఁ దలంచుట ప్రజలకు ధర్మంబు. కావున మీ రా రామభూవల్లభుం దండ్రిగా భావించుచుండవలయు.”అని యాజ్ఞాపించుటయు నక్కవలు మహాప్రసాదం బని యారేయి గడపి మఱు నాఁడు వేగుటయు నప్పటి కృత్యంబులెల్లఁ దీర్చి వీణాపా ణులై వెడలి రామభద్రుని యజ్ఞశాలం జొచ్చి రామాయ ణమును బాడసాగిరి. పదసందర్భములు నర్థకల్పనలు నలంకారములు రసౌచిత్యప్రభావములు బహుగతుల నలరారు జగత్పూజ్యంబైన శ్రీరామాయణ మహాకావ్యం బునందలి మొదటి శ్లోకంబు లోక కొన్ని కుశలవకుమా రులు జగన్మోహనముగ గాన మొనర్చినంతనె రాముం డాలకించి తన్మధురగానశ్రవణానందపరవశుండై హోమ కృత్యంబులు దీర్చి వచ్చి కవిగాయకపురోహితమంత్రి సామంతబంధుమిత్ర పరివారంబులతో నిండుకొలు వుండి సీతానందనులఁదనచేరువనెకూర్చుండఁజేసి వారిముఖంబున గానమాధురీమేదురంబైన రామాయణ కథావిధానంబును సావధానంబుగ నవధరింపసాగెను.

18 కుశలవచరిత్రము

2 వ భాగము.

లక్షలకొలందిగల జనులతో నిండి సప్తసముద్ర ఘోషంబులం బురుడించు మహాధ్వనుల కాలవాలంబై యుండిన యయ్యజ్ఞశాలయంతయుఁ బసిపాపలగు కుశలవుల మనోహరగానకలావిశేషంబున క్షణంబులో నిశ్శబ్దంబయ్యె. మఱియు నక్కుమారవరులిరువురును రఘువరునకు మిక్కిలిసమీపంబుననె యుపవసించినవా రగుటంజేసి వారల మనోజ్ఞాకారంబులయందు రామచంద్రుని యాకారవిశేషంబు లుండుట యెల్లవారలకును స్పష్టంబయ్యె.

ఉ॥ ఈ ముఖకాంతు లీ నగవు
లీకనుదామర లీమెలుంగు లీ
చామనచాయ లీ మొగుభు
జంబుల పొంకము లీ యురంబు లీ
కోమలమూర్తు లీ వచన
గుంభనలున్ గనుఁగొన్న గట్టిగా
రామునిలీల మించి రభి
రామశరీరులు వీర లెవ్వరో ?

ఉ॥ హారకిరీటకుండలభు
జాంగదవస్త్ర సుగంధమాల్యముల్
వీరు ధరింప కీజటిల
వేషము లేటికి దాల్చిరో? శుభా
కారవిలాససంపదలఁ
గంతు జయంతుల ధిక్కరించి నా
రేఋషిపుత్రులో ఋషుల
కెక్కుడి వీమహనీయరూపముల్!

వ॥ అని యిట్లు సభ్యులెల్లరుఁ దమలోఁ దా మాడుకొను మాటలవలని కలకలంబంతయు లక్ష్మణుండు చే సంజ్ఞల నివారించుటయు నత్యధిక ప్రోత్సాహితులగు నావత్సు లిరువురు నాఁడు రామాయణమునందలి యిరువది సర్గలను గానము చేసిరి. రాఘవేశ్వరుఁ డబ్బాలకుల యనవద్య గానవిద్యాకౌశలమున కెంతయు మెచ్చి వారికిఁ బదివేల వరా లిమ్మనుటయెగాక వారు కోరినవెల్ల నొసఁగూర్పు మని భరతున కాజ్ఞాపించెను. ఆ పలుకులకు సీతకొడుకులు చిఱునవ్వు నవ్వుచు కరములు మోడ్చి "రామచంద్రా! కానలఁ గందమూలములు గుడుచుచుఁ దాపసవృత్తి నుండు వారి కిట్టిధనంబు లేల" యని పలికిరి. రామచంద్రుం డంత తో నూరకుండక,

చ॥ అనియె గుణాఢ్యులార! నిజ
మా నది యీకృతి యెవ్వ రాచరిం
చినయది, యేప్రమాణమునఁ
జెల్వగు, నెవ్వని దీచరిత్ర, మిం
దున కభిధానమే, మెలమి
తో నిది యెవ్వరివంక నేర్చినా
రనిన వినీతులై కుశలవా
హ్వయు లిట్లని రమ్మహాత్ములో.

సీ॥ ఇనవంశశేఖర! యీకావ్యమణి విని
ర్మించిన సుకవి వాల్మీకిమౌని
రామాయణం బనునామంబు దీనికిఁ
గావించె నది భవత్కథయ సుమ్ము
విను మిరువదినాల్గువేల గ్రంథం బిది
యేనూఱుసర్గల నింపుగులుకుఁ
బట్టాభిషేచనపర్యంత కథ లాఱు
కాండంబుల రచించెఁ గడమకథయు

నవల నుత్తరకాండంబునం దమర్చె
నమ్మహామౌని యతని దయానిరూఢి
నేము నేర్చితి మిది విన నిచ్ఛగల్గె
నేని వినఁదగు దినమును నిర్విధమున॥

వ॥ దేవా! ఇమ్మఖదీక్ష దీర్చినపిమ్మట మాగీతములు సాఫల్యమొంద సావధానంబుగ నీ కావ్యంబంతయు వినవలయు నని కోరుచున్నా మనవుడు రామచంద్రుఁడు వల్లె యని విప్రపురోహితబంధుమిత్రపరివారసమేతుండై ప్రతి దినంబును రామాయణంబు వినుచుండెను. పూఁదేనియలొలికినగతిఁ గప్పురంబుఁబొడి చిందినకైవడి, జాజిపొట్లమ్ములవిప్పిన చొప్పునఁ దమ జగన్మోహనగానకళాకౌశలము నెఱపుచుండ, రామభద్రుం డొక్కనాఁడు కుశలవులతనూవిలాసంబులఁ బరిశీలించి, “వీరియాకారములు జానకీరమణికైవడి నున్నవి. మున్ను భూజాతకుఁ గవ లుదయించిరనియు వింటి. ఈ డింభకులు సీతాడింభకులుగా గాకున్న నింతడి చెలువంబుగలుగునే”యని భావించి,

చ॥ జడలుధరించి కృష్ణమృగ
చర్మములుం బలు నారచీరలుం
గొడుకులుదానుఁ గట్టు
కొని కూరలఁగాయల త్రుత్తుమాన్పుచుఁ
గుడిచొను వంత రేవగలుఁ గుంద
చు నెంత నలంగియున్నదో
యడవులలోన సీత యక
టా!యిఁకఁ జూడక యెట్లు తాళుదుఁ!

లోకులాడుసడి కోర్వలేక యిట్లుచేసితి. నాయపరాధంబు మన్నింపుఁడు. ఇందలి జనంబు లెఱుంగ నింకొకసారి మహీ కుమారి శపథంబొనరింపందగు' ననుటయుఁ దోడనభూమి పట్టి పతిపదారవిందంబుల డెందంబున నిలిపి కరాంబుజంబులు మొగిడ్చి తలవాంచి నేలపై దృష్టి సారించి సభ్యులెల్లరు విని విస్మయంబంద నిట్లనియె.

శా॥ రామస్వామిపదాంబుజంబు లెద నా
రాధింతు నేనిర్ సదా
రామాజ్ఞం జరియింతు నేనిఁ దగుజా
గ్రత్స్వప్న సుషుప్త్యాదులన్
రాముం దప్పనిదాననౌటయు యథా
ర్థంబేని నాతల్లి! యో
భూమీ!యీయెడఁ ద్రోవఁజూపి ననుఁ
గొంపోవమ్మ! నీలోనికిన్.

వ॥ అని సకలబృందారకసందోహంబుల కానందంబును నరవానర నిశాచర ప్రముఖనిఖిలజనంబులకు శోకదైన్యంబులు నుప్పతిల్లంబలికి నసప్పలుకులతోడనే మహీతలంబు భేదించుకొని భూదేవి దేవగంధర్వ కాంతారత్నంబులతోఁ బ్రత్యక్షమై కూఁతుం గౌఁగిలించుకొని కన్నీరు దుడిచి యారార్చి తా నెక్కివచ్చిన మణిపీఠంబుపైఁ జేర్చుకొని యిందాదిదిక్పాలకులు మందారకుసుమంబులు గురియుచుండ

ననువంటి మచ్చెకంటికిఁ దత్ఫలం బనుభవింపక పోవచ్చునే? రచ్చలోకి వచ్చి బాస యిచ్చి పతికింగల రిచ్చపాటు తొలంగింపక తప్పదు. విజయంబు సేయుం' డని వానితో నాశ్రమంబు నిర్గమించెను.

వామలూరు భవుండు సీతాంగనాసమేతంబుగ నాశ్రమంబు వెలువడి వచ్చి రామభద్రుని యజ్ఞవాటికం జొచ్చి, దివినుండి బృందారక బృందంబులును భువినుండి సకలజన సమూహంబులుం గడు నక్కజం పడి కనుంగొనుచుండ సమస్త పరివార సంపూర్ణంబైన మహాసభాంతరంబునఁ బ్రవేశించి, రఘువీరుని పురోభాగంబున నిలిచి, ప్రజల కలకలంబులు చేసన్నల నివారించి, యాసన్నులై దివినున్న దేవతలును సభనున్న సమస్తజనంబులు నాకర్ణింపఁ బ్రావృడంభోదగంభీరఘోషంబున నిట్లనియె.

మ॥ దిననాథాన్వయ! యీధరాతనయ
పాతివ్రత్యముఁ సత్యముఁ
గనియుఁ నీవు జనాపవాదగతశం
కఁ నిందుచూలాలిఁ గా
ననసీమం దిగఁద్రోయఁబంచుటయు దై
న్యం బొంది యస్మద్వనం
బునకుఁ వచ్చి కుశుఁ లవుం గనియె నీ
పుణ్యుల్ భవత్పుత్రకుల్.

వ॥ కావున నీధర్మచారిణియైన సీతాసతిని నీతనయులైన కుశ
లవులం బరిగ్రహింపుము. ఇమ్మహాసాధ్విని నీ వనుమా
నింపం బని లేదు. శ్రుతులెల్ల నేర్చి యధికతపోవిభూతి నొంది



నీయెడ నసత్యంబు లాడనేర్తునే? గగనసూర్యచంద్రాగ్నితో
యంబులు సర్వసుపర్వులు సాక్షులుగా సుమారమారమణీ
మణులకరణి భూమిసుత మహాపతివ్రత. అనవుడు రామభ
ద్రుండు బద్ధాంజలియై "మునిసత్తమా! జానకిం దెలిసియు

లోకులాడుసడి కోర్వలేక యిట్లుచేసితి. నాయపరాధంబు మన్నింపుఁడు. ఇందలి జనంబు లెఱుంగ నిం కొకసారి మహీకుమారి శపథంబొనరింపందగు' ననుటయుఁ దోడనభూమి పట్టి పతిపదారవిందంబుల డెందంబున నిలిపి కరాంబుజంబులు మొగిడ్చి తలవాంచి నేలపై దృష్టి సారించి సభ్యులెల్లరు విని విస్మయం బంద నిట్లనియె.

శా॥ రామస్వామిపదాంబుజంబు లెద నా
రాధింతు నేనిన్ సదా
రామాజ్ఞం జరియింతు నేనిఁ దగుజా
గ్రత్స్వప్న సుషుప్త్యాదులన్
రాముం దప్పనిదాననౌటయు యథా
ర్థంబేని నాతల్లి! యో
భూమీ!యీయెడఁ దోవఁజూపి ననుఁ
గొంపోవమ్మ! నీలోనికిన్.

అని సకలబృందారకసందోహంబుల కానందంబును నరవానర నిశాచరప్రముఖనిఖిలజనంబులకు శోకదైన్యంబులు నుప్పతిల్లంబలికి నవప్పలుకులతోడనే మహీతలంబు భేదించుకొని భూదేవి దేవగంధర్వకాంతారత్నంబులతోఁ బ్రత్యక్షమై కూఁతుంగౌగిలించుకొని కన్నీరు దుడిచి యూరార్చి తా నెక్కివచ్చిన మణిపీఠంబుపైఁ జేర్చుకొని యుండాదిదిక్పాలకులు మందారకుసుమంబులు గురియుచుండ

రసాతలంబునకు గొనిపోయెె. అమ్మహామహిమంబున కెల్ల వారలు వింతపడి సీత లేమికి నెంతయు వంతపడిరి.

రాముండును సీతావియోగంబు భరింపలేక తన సుతులైన కుశలవులఁ బట్టభద్రులంజేసి తన సోదరులగు లక్ష్మణాదులతో సరయూనదిం జొచ్చి మహావిష్ణుండై వైకుంఠంబునకుఁ బోయి యందు మహాలక్ష్మియైయున్న సీతంగలిసికొనియె. అందు లక్ష్మీనారాయణులు సకలదివ్యభోగానందంబుల నుల్లసిల్లుచు నార్తత్రాణపరాయణులై జగంబులఁ బాలించుచున్నవారలు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

ఉ॥ ఎంచి పురాణగాథల ర
చించిన మా దగు వాచకంబులన్
గొంచు పఠించు బాలకుఁ
కున్ శుభమున్ సువివేకముం బ్రసా
దించి, ముకుందుఁ డున్నతులఁ
దేలిచి ప్రోచునుగాక వీనివ్రా
యించి యశంబు గైకొనిన
యేలూరు వేంకటరామ కంపెనిన్.